శ్రీరాముని అంతరంగము

(లఘుటీకావ్యాఖ్యాన సహితము)

రచన

ఎమ్.వి.ఎస్. రంగనాథం

శ్రీరాముని అంతరంగము

రచన:

ఎమ్.వి.ఎస్. రంగనాథం

శ్రీరాముని అంతరంగము

SRIRAMUNI ANTARANGAMU

రచన: **ఎమ్.వి.ఎస్. రంగనాథం**

ISBN 978-93-343-4723-4

9 789334 347234

© సర్వహక్కులు రచయితవే

ప్రచురణ: జులై **2025**

వెల: అమూల్యము

ఎలక్ట్రానిక్ ప్రతులకు:
M.V.S. RANGANADHAM
M.Sc, BL, ISS
Former Director General,
Central Statistical Office, New Delhi.

H.No.5-12-78/46, Laxmipuri Colony,
Phase-2, Sainikpuri, Hyderabad - 500 094,
Telangana State.

Mob: +91 98188 78155
E-Mail: mvsranganadham@hotmail.com

టైప్‌సెట్టింగ్ మరియు ముద్రణ:

భండారి ఆర్ట్స్ 'ఎన్' ప్రింటర్స్

చిక్కడపల్లి, హైదరాబాద్ - 500 020.

సెల్: 9963480837

అంకితం

కీ॥శే॥ శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు
(జీవన కాలము: 1902 - 1983)

ఉ॥ ఆకృతి యందు సాధువు, యహంకృతి లేనిఁ గృపాళుఁడున్, యసం
ఖ్యాకము ఛాత్రవర్గము దిగంతము లందున యున్న శిక్షకుం,
డూఁకువఁ దోడ సంఘమున యున్నతిఁ గొన్న ప్రసాదరాయుడే,
యీ కృతి నంద యోగ్యుఁడని, యిచ్చితి నంకిత మా మనీషికిన్.

(ఆకృతి = రూపము, సాధువు = సన్యాసి, అహంకృతి = అహంకారము, కృపాళుఁడు = కనికరము కలవాఁడు, అసంఖ్యాకము = అపరిమితమైనది, ఛాత్ర = శిష్యుఁడు, వర్గము = సమూహము, దిగంతము = ఆశాంతము, శిక్షకుడు = ఉపాధ్యాయుడు, ఊకువ = పూనిక, ఉన్నతి = ఉచ్చస్థితి, యోగ్యుఁడు = అర్హుఁడు, మనీషి = మహా ప్రజ్ఞాశాలి)

రూపంలో సన్యాసి, అహంకారము లేని దయాళువు, అసంఖ్యాకమైన శిష్యవర్గము దిగంతాలలో ఉన్న ఉపాధ్యాయుడు, పూనికతో సమాజంలో ఉచ్చస్థితిని అందుకొన్న కీ॥శే॥ శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారే ఈ కావ్యము అందుకోవడానికి అర్హుఁడని, ఆ మహా ప్రజ్ఞాశాలికి అంకితం ఇచ్చాను.

బహుగ్రంథకర్త

శ్రీ చిరువోలు విజయనరసింహారావు గారు

న్యూ ఢిల్లీ

ఆశీర్వచనము

గణికుఁడవెౘ గాని, కావీవు వణిజుఁ డెపుడు,
కావ్యకర్తవై భాసిల్లు కవివె నీవు,
భవ్య రామాయణము వ్రాసి వాసి కెక్క,
మేటి రచయితవను ఖ్యాతి మించె ప్రతిభ. ॥ 1 ॥

శిష్ట క్లిష్ట పద నియుక్తి శేముషిఁ గన
శస్త పద్యముల్ పఠిత కాసక్తిఁ గొలుప
రచన సల్పిన కవివర్య! రంగనాధ!
భవ్య రామాయణం బది భవము దుల్చు. ॥ 2 ॥

రామశబ్ద మొక్కటె పాపరహితుఁ జేయు
నన్న, పూర్ణ రామాయణమ్మతుల రచన
యెట్టి పుణ్యంబుఁ గూర్చునో, యీప్సితములఁ
దీర్చి సుఖశాంతి జ్ఞానంబు కూర్చు మనకు. ॥ 3 ॥

కృతికి ప్రఖ్యాత రాము సుకృతునిఁ జేసి
కావ్య రచనంబు ఘనతమ గణ్యగతిని
పూర్తి యొనరింప సులభమే? బుధులకైన,
నీవు ధన్యుడవైతివి నేర్పుఁ జూపి,
శ్లాఘనీయ మీ సత్కృతి జ్ఞాన మొసగు. ॥ 4 ॥

వందనీయుడ వీవు, యానందదాయి
రమ్య రామాయణ రచన రాణ కెక్క
కవుల కరముల కందించి, ఘనతఁ గాంచ
నాయు రారోగ్య కవనంబు లర్థసిద్ధి
కలుగు గాత! నీ కనిశంబు, కవి వరేణ్య!
భావి బహు గ్రంథ రచన సౌభాగ్య మిడుత! ॥ 5 ॥

పాండురంగని కృపఁ బొంది, ప్రభవ మంది,
భవ్య జీవితముఁ గడపి భద్రముగను
సకల సాఫల్య సంప్రాప్తి జగతి వెలిగి
నట్టి నీకు దైవంబు సర్వాత్మకుండు
రక్షఁ జేయుత ననిశ మా రామవిభుడు ॥ 6 ॥

ఎమ్.వి.ఎస్. రంగనాథం
M.Sc, BL, ISS

నా గురించి

ఉ॥ పల్లెను జీవితమ్ము నొక పక్షిగ నెంచితి, స్వేచ్ఛ నొందితిన్,
చల్లగ పట్నవాసమను చాతురి చేష్టల పంజరమ్ములో,
కల్లలు సత్యముల్ గనుచు, కన్నడు బాధ్యత లన్ని మోయుచున్,
మెల్లగ మింటికిన్ యెగసి, మెప్పులు పొందితి, తృప్తి నందితిన్.

(చాతురి = చతురత్వము, నేర్పు; చేష్ట = క్రియ, పని; మింటికి = ఆకాశానికి; మెప్పు = శ్లాఘన)

గ్రామంలో జీవితాన్ని ఒక స్వేచ్ఛావిహంగంలా అనుకున్నాను. చలాకీ పనులకి ఆవాసమైన పట్నమనే పంజరంలో కల్లలు, నిజాలు చూస్తూ, తెలిసిన

బాధ్యతలన్నీ నిర్వహిస్తూ, మెల్లగా పైకొచ్చి అందరి మెప్పులూ పొందాను. తృప్తి నందాను.

కం॥ సాంఖ్యక సేవను (Indian Statistical Service) జేరి, ప్ర
సంఖ్యానము తెచ్చుకొంటి సాంఖ్యక జగతిన్,
సంఖ్యము జేసితి స్వేచ్ఛగ,
సాంఖ్యక విలువలను బెంచ సంఘము నందున్.

(సాంఖ్యక సేవ = ప్రజలయొక్క సామాజిక వర్గముల యొక్క సాంఘికార్థిక పరిస్థితులను గురించి క్రమపద్ధతిలో విషయములను సేకరించు సేవ, ప్రసంఖ్యానము = కీర్తి, సంఖ్యము = యుద్ధము, విలువ = ప్రయోజనము)

ప్రజల యొక్క సామాజిక వర్గముల యొక్క సాంఘికార్థిక పరిస్థితులను గురించి క్రమపద్ధతిలో విషయములను సేకరించే ప్రభుత్వ సేవలో (Statistical Service) చేరి, సాంఖ్యక ప్రపంచంలో పేరు తెచ్చుకున్నాను. సంఘంలో సాంఖ్యక శాస్త్ర ప్రయోజనాలు పెంచడానికి పోరాడాను.

ముందు మాట

రామాయణం చిన్నప్పటి నుండి విన్న కథే. రామాయణానికి అనుబంధంగా ఉన్న పిట్ట కథలు, కల్పిత కథలు కూడా చాలా విన్నాను. సినిమాలలో కూడా చూశాను. శ్రీరాముణ్ణి ఒక ఆదర్శ పురుషుడుగా కాకుండా దైవంగా ఆరాధించే వాళ్ళని చూస్తూ పెరిగాను. శ్రీరాముడు ఒక ధర్మమూర్తి అని నిరూపిస్తూ కొంత మంది పెద్దలు ఇచ్చిన ప్రవచనాలు కూడా విన్నాను. శ్రీరామాయణ కల్పవృక్షము, రామాయణ విషవృక్షము, విషవృక్షఖండన గురించి కొద్దో గొప్పో తెలుసుకున్నాను. నేను పుట్టి పెరిగిన పల్లెటూళ్ళో వేసిన వీధి నాటకంలో రావణుడు సీతను ఎత్తుకుపోతుంటే, మా ఎదురుగా ఈ అన్యాయం జరగనివ్వమని రావణ పాత్రధారిని పట్టుకుని కొట్టిన ఆవేశపరులైన అమాయక పల్లె ప్రజలని కూడా చూశాను.

మన జీవితాలని ఇంతగా ప్రభావితం చేసిన రామాయణం అంటే నాకు చాలా ఇష్టం. రామాయణం గురించి నేను చదివిన పుస్తకాల్లో "Lectures on the Ramayana" అన్న రైట్ ఆనరబుల్ వి. ఎస్. శ్రీనివాస శాస్త్రి (Rt. Hon. V.S. Srinivasa Sastri) గారి పుస్తకం నేను కాలేజీలో చదివే రోజుల నుంచి నా మీద చాలా ప్రభావం చూపించింది. నా ఆలోచనా ధోరణిని మార్చివేసింది. పద్మశ్రీ పురస్కృత మహామహోపాధ్యాయ ఆచార్య డా. పుల్లెల శ్రీరామచంద్రుడు గారి "వాల్మీకి రామాయణము యథామూలానువాదము" అన్న వచన రామాయణం పుస్తకాలు ఈ మధ్య కాలంలో చదివాను. నాకున్న చాలా సందేహాలు అవి చదివిన తరువాత తొలగిపోయాయి. మహా పండితుల రామాయణ ప్రవచనాలు చాలా విన్నాను. ఇంకా, వింటున్నాను. అవి రామాయణం మీద నా ఆసక్తిని ఇంకా పెంచాయి.

నేను పెరిగిన వాతావరణంలో దేవుడు ఉన్నాడా? లేడా? రాముడు దేవుడా? కాడా? అన్న విషయాల మీద పనికిరాని చర్చలు చేసే వాళ్ళని చాలా మందిని చూశాను. ఇంకా చూస్తూనే ఉన్నాను. అయితే, అవన్నీ వదిలేసి రామాయణంలోనూ పురాణాల్లోనూ మనకి పనికొచ్చేవి మనం నేర్చుకోవాల్సినవి ఉంటే వాటి మీద దృష్టి పెట్టాలని నా మతము. అలాంటి విషయాలు మాత్రమే కావాలంటే ఎవరు చెప్తారు, ఎవరు చెప్తే బాగుంటుంది అని ఆలోచిస్తూ ఉంటే నాకు మహాకవి కాటూరి వేంకటేశ్వరరావు గారి "పౌలస్త్య హృదయము" దారి చూపించింది. అది రావణుని స్వగతము. అందులో పూర్తిగా కథ చెప్పకుండా రావణుడు సాగరుడికి (సముద్రానికి) తన గోడు వినిపించడం ఉంటుంది. మరి అలా ఒక స్వగతం లాగా రామాయణంలో మనకి పనికొచ్చేవి మనం నేర్చుకోవాల్సినవి ఎవరు చెప్పాలి అన్న ప్రశ్న ఉదయించగానే ఆ పని శ్రీరామచంద్రుడే చేస్తే బాగుంటుందని నా మనస్సుకి తోచింది. అతడు తన భావాలని తన తమ్ముడు, మిత్రుడు, బహిప్రాణము అయిన లక్ష్మణుడితో పంచుకోవడమే ఈ కావ్యంలోని వస్తువు.

జనవరి 05, 2025న "సంచిక" అనబడే వెబ్ పత్రిక మరియు డా॥ అమృతలత సంయుక్తంగా ప్రకటించిన 2025 ఉగాది - పద్యకావ్య రచన పోటీకి నేను రచించిన ఈ 'శ్రీరాముని అంతరంగము" అన్న కావ్యాన్ని పంపాను. మాన్యులు, పండితులు శ్రీ ఏల్చూరి మురళీధరరావు గారు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ కావ్యాన్ని పరిశీలించి వారు ఫలితార్థం ఈ విధంగా చెప్పారు:

"అశ్వమేధయాగ దీక్షలో ఉన్న శ్రీరాముని యెదుట వాల్మీకి శిష్యులైన లవకుశులు రామచరితను గానం చేయగా విని పరవశుడైన శ్రీరాముడు లక్ష్మణునితో తన మనోగతాన్ని పంచుకొనటం ఇందులోని ఇతివృత్తం. భవ్యమైన కల్పన తోడి మనోహరమైన అనుస్మృతి కావ్యం ఇది. భాషావ్యతిక్రమాలను సంస్కరించిన తర్వాత తప్పక ప్రకాశితం కావలసిన కృతి."

ఆచార్య ఏల్చూరి మురళీధరరావు గారి అభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కావ్యాన్ని పునఃపరిశీలించి కొన్ని మెరుగులు దిద్దడం జరిగింది. కావ్యాన్ని పరిష్కరించే కార్యంలో శ్రీ చిరువోలు విజయ నరసింహారావు గారు ఇచ్చిన సూచనలు

చాలా దోహద పడ్డాయి. పద్యరూపంలో వారిచ్చిన ఆశీర్వచనాలు ఇందులో ఇవ్వబడ్డాయి. ఇక నా గురించి కొంత "నా గురించి" అన్న శీర్షిక క్రింద ఇచ్చాను. కావ్యాన్ని ప్రారంభించే ముందు ప్రార్థన పద్యాలు విడిగా ఇవ్వబడ్డాయి.

నా మాతామహులు నా గురువుగారు అయిన కీ॥శే॥ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు నాకు దైవంతో సమానం. వారు సమాజ సేవకులు, దైవ భక్తులు. చిరువోలు గ్రామంలో రామాలయాన్ని నిర్మించి, ఇతర పండుగలతో పాటు ప్రతి శ్రీరామనవమిని ఊరి వారి పండుగలా ఒక ధర్మప్రవచనంలా జరిపించి రామాయణార్థాన్ని సకల జనులకు చాటిచెప్పిన మహానుభావులు. వారు శతక రచయిత. వారు వ్రాసిన ఆ ఆత్మాశ్రయ కవిత్వంలో శ్రీరామభద్ర శతకం కూడా ఉంది. నాకు చిన్నతనంలో విద్యాబుద్ధులతో పాటు రామాయణాది పురాణాల కథలను వాటి లోని అనుసరణీయమైన అంశాలను చాలా భావోద్వేగంతో ప్రత్యేకంగా చెప్పిన నా గురువు గారికి సభక్తికంగా సవినయంగా "శ్రీరాముని అంతరంగము" అన్న, నా ఈ మొదటి కావ్యాన్ని అంకితం ఇస్తున్నాను.

రామాయణ కథలోని 32 ఘట్టాల ద్వారా శ్రీరాముడు తన మనోభావలను లక్ష్మణుడితో పంచుకోవడం ఈ కావ్యంలోని వస్తువు. ఆ ఘట్టాలే ఈ కావ్యంలోని శీర్షికలు. ఈ కావ్యంలో 291 పద్యాలు ఉన్నాయి. కొన్ని పద్యాలలో, ఉండవలసిన నాలుగు పంక్తుల కన్నా ఎక్కువ పంక్తు లున్నాయి. అనుకున్న భావాన్ని ఆ పద్యాలలో రప్పించడానికి నాలుగు పంక్తుల నియమాన్ని ఉల్లంఘించాల్సొచ్చింది. "నా గురించి", "అంకితం", "ప్రార్థన" అన్న శీర్షికల క్రింద ఉన్న 6 పద్యాలతో కలిపి గణిస్తే, మొత్తం 297 పద్యాలవుతాయి.

కావ్యరచనలో నేను చేసిన మొదటి ప్రయత్నం ఇది. కాబట్టి, దోషాలు ఖచ్చితంగా ఉంటాయి. పాఠకులు అలాంటివి గమనిస్తే నాకు తప్పక తెలియచెయ్యాలని ప్రార్థన.

ఎం.వి.ఎస్. రంగనాథం

సైనిక్‌పురి, హైదరాబాదు

ప్రార్థన

కం॥ యుక్తాయుక్త విచక్షణ
సూక్తంబుల వోలెఁ గఱపుచు, సమత్వంబే
భక్తిగ నెరిగించిన వ్యా
సక్తులు నా గురువుల కనిశము వందనముల్.

(యుక్తము = తగినది, అయుక్తము = తగనది, విచక్షణ = చక్కగా ఆలోచించుట, సూక్తము = సూక్తి, పోలె = వలె, కఱపు = బోధించు, ఎరిగించు = తెలియజేయు, వ్యాసక్తుడు = ఎక్కువ ఆసక్తిఁ గలవాఁడు, అనిశము = ఎల్లప్పుడు, వందనము = నమస్కారము)

తగినది తగనిది అన్న వివేకాన్ని సూక్తుల లాగా బోధిస్తూ, సమభావమే భక్తి (శ్రీకృష్ణుడు భగవద్గీత 12వ అధ్యాయమైన భక్తి యోగంలో చెప్పిన దిదే.) అని తెలియఁ జేసిన ఎక్కువ ఆసక్తిఁ గల నా గురువులకు ఎప్పుడూ వందనములు.

కం॥ శ్రీరాము యంతరంగము
చేరువ యవ సర్వ జనుల చేతనములకున్
ఆ రాముని ధర్మనిరతి
కారణమై నిలుచు గాత కావ్యాకృతిలో

(అంతరంగము = అంతఃకరణము, చేరువ = సమీపము, చేతనము = మనస్సు, నిరతి = మిక్కిలి ఆసక్తి, గాత = గాక, ఆకృతి = రూపము)

"శ్రీరాముని అంతరంగము" అన్న ఈ కావ్యము ప్రజలందరి మనస్సులకు దగ్గర అవ్వడానికి, ధర్మము పైన ఆ రాముని కున్న అత్యంతాసక్తి కావ్యం రూపంలో కారణమై నిలుస్తుంది.

సీ॥ ఎవ్వని చారిత్ర మెల్ల యుగంబుల
నాదర్శ చిహ్నమై యలరు చుండు?
యేకపత్నీవ్రత మెవ్వరు చేపట్టి
దాంపత్యమునకు సార్థకముఁ దెలిపె?
రాజధర్మం బన రాజు సేవకు డంచు
నూత్నమౌ యర్థంబు నుడివె నెవరు?
స్వార్థమే లేని జీవనమెవ్వరిది? పరి
వారముతో నున్న పారికాంక్షి

తే॥గీ॥ యెవరు? మానవతాదృష్టి నెవ్వ రఖిల
జగతి నేలె? నా గుణములే సన్నిహితము
నాకు బాల్యంబు నుండి, సనాతన మగు
నట్టి రాము తత్త్వంబున కంజలింతు.

(చారిత్రము = నడవడి, ఎల్ల = సమస్తము, యుగము = కాల విశేషము, ఆదర్శ = ప్రామాణ్యము, చిహ్నము = గుర్తు, అలరు = ప్రకాశించు, సార్థకము = ప్రయోజనము, నూత్నము = కొత్త, నుడువు = చెప్పు, పరివారము = పరిజనము, పారికాంక్షి = ముని, అఖిల = అంతయు, జగతి = ప్రపంచము, ఏలు = పాలించు, సన్నిహితము = దగ్గరిది, బాల్యము = చిన్నతనము, సనాతనము = శాశ్వతము, తత్త్వము = ప్రవృత్తి, అంజలించు = దోయిలించు)

ఎవరి నడవడి అన్ని కాలాలలో ప్రామాణ్య చిహ్నంగా ప్రకాశిస్తుందో, ఎవరు ఏకపత్నీవ్రతము చేపట్టి దాంపత్యానికి ప్రయోజనం తెలియఁ జేశారో, రాజధర్మము అంటే రాజు సేవకుడని కొత్త అర్థాన్ని ఎవరు చెప్పారో, స్వార్థము అన్న మాట లేని జీవితము ఎవ్వరిదో, పరివారంతో ఉండి కూడా ముని ఎవ్వరో, మానవతా దృక్పథంతో ఎవ్వరు ప్రపంచ మంతా పాలించారో, ఆ లక్షణాలే నాకు చిన్నతనం నుండి సన్నిహితము. శాశ్వతమైన అటువంటి శ్రీరాముని స్వభావానికి అంజలిస్తాను.

విషయసూచిక

క్ర.సం.	కావ్యాంతర్గత విషయములు		పుట
1.	కావ్యప్రాశస్త్యము	... ...	15
2.	బాల్య దశ	... ...	25
3.	విశ్వామిత్రునితో అనుబంధము	... ...	29
4.	భగీరథుని ప్రయత్నము	... ...	33
5.	అహల్యా శాపవిమోచనము	... ...	35
6.	సీతా పరిగ్రహణము	... ...	37
7.	యువరాజు నియుక్తికి ప్రణాళిక	... ...	43
8.	మంధర కైకల ప్రణాళిక	... ...	46
9.	సీతారామలక్ష్మణులు వనవాసానికి ప్రయాణము	... ...	56
10.	దశరథుని మరణం	... ...	62
11.	భరతుని పశ్చాత్తాపము	... ...	67
12.	సీతారామ వనవాసము	... ...	70
13.	శూర్పణఖ కథ మలుపు త్రిప్పుట	... ...	74
14.	సీతాపహరణము	... ...	77
15.	రామ సుగ్రీవుల మైత్రి	... ...	94

16.	వాలి వధ	... ...	97
17.	సీతాన్వేషణకు సన్నాహాలు	... ...	99
18.	సీతాన్వేషణ	... ...	103
19.	రామునికి సీత జాడ తెలుపుట	... ...	108
20.	సీతా వియోగము	... ...	111
21.	విభీషణు శరణాగతి	... ...	115
22.	యుద్ధ సన్నాహాలు	... ...	118
23.	యుద్ధ వివరాలు	... ...	122
24.	కుంభకర్ణుని ఉపదేశము	... ...	127
25.	రావణ వధ	... ...	129
26.	యుద్ధానంతర విశేషాలు	... ...	131
27.	సీతాపరిత్యాగము	... ...	143
28.	శునకము విజ్ఞప్తి	... ...	146
29.	శంబూక వధ	... ...	147
30.	అశ్వమేధయాగం	... ...	149
31.	మహాప్రస్థానం	... ...	151
32.	వందన సమర్పణ	... ...	152

శ్రీరాముని అంతరంగము

(లఘుటీకావ్యాఖ్యాన సహితము)

(అశ్వమేధ యాగ దీక్షలో నున్న శ్రీరాముని ఎదుట వాల్మీకి శిష్యులైన లవకుశులు రామాయణ గానం చేయగా విని పరవశుడైన శ్రీరాముడు తన సోదరుడైన లక్ష్మణునితో తన మనస్సులో ఉదయించిన భావములు పంచుకొనుట)

కావ్యప్రాశస్త్యము:

కం॥ శ్రీమద్వాల్మీకి రచిత
రామాయణ గానము విన లవకుశుల నుతిన్,
నా మనసు కరిగె లక్ష్మణ!
ప్రామాణిక కృతి ధ్వని కది, వక్కాణించన్... ॥ 1 ॥

(శ్రీమత్ = శుభము చేకూర్చు, రచితము = రచియింపఁబడినది, నుతి = స్తోత్రము, ప్రామాణిక = సహేతుకమును ప్రమాణంతో సిద్ధించినదియును, కృతి = ప్రబంధము, ధ్వని = వ్యంజనావృత్తితో తోఁచెడి యర్థము, వక్కాణించు = చెప్పు)

వాల్మీకి రచించిన రామాయణ కావ్యము ఏడు కాండములుగా ఉంటుంది. అవి బాల కాండము, అయోధ్య కాండము, అరణ్య కాండము, కిష్కింధా కాండము, సుందర కాండము, యుద్ధ కాండము, ఉత్తర కాండము అన్నవి. వాల్మీకి రామాయణ మందలి ఉత్తర కాండము లోని 91-98 సర్గలలో శ్రీరాముడు చేసిన అశ్వమేధ యాగము గురించిన విశేషాలు ఉన్నాయి. ఈ యాగం ఒక సంవత్సర కాలం పైగా జరిగిందని, యాగం పరిసమాప్తి కాక ముందే వాల్మీకి మహర్షి తన శిష్యులైన లవకుశులతో అక్కడకు వచ్చాడని, రామాయణ కావ్యాన్ని అన్ని బహిరంగ ప్రదేశాల్లోను (public places), రాజాంతఃపురాలలోను, అశ్వమేధయాగ ప్రాంగణంలోను రోజుకి 20 సర్గలు చొప్పున గానం చేయమని వాల్మీకి తన శిష్యులను ఆదేశించాడని చెప్పబడింది.

శ్రీరాముడితో పాటు అక్కడ చాలా మంది మహర్షులు, పండితులు, వివిధ శాస్త్రాలలో నిష్ణాతులు, నాగరికులు, లవకుశుల గానాన్ని విన్నారు. పాడుతున్న బాలురిలో రాముని పోలికలు ఆ ప్రేక్షక వర్గం గమనించారు. తరువాత వాల్మీకి మహాముని ఆ బాలురు నీ పుత్రులే అని శ్రీరామునికి చెప్పడం, సీత పాతివ్రత్యం గురించి మొదటగా వాల్మీకి తరువాత స్వయంగా సీత శపథాలు చేయడం, ఆ వెంటనే సీత ఒక దివ్య సింహాసనం మీద కూర్చుని రసాతలం లోకి వెళ్ళిపోవడం జరిగాయి. శ్రీరాముడు మరల సీతావియోగంతో దుఃఖించడం, బ్రహ్మదేవుడు ఆయనను శాంతింప జేసి వాల్మీకి వ్రాసిన తరువాతి రామకథను విడిగా నీవొక్కడవే వినమని చెప్పడం, ఆ విధంగా చేసి రాముడు భవిష్యత్తులో జరగబోయేది తెలుసుకొని అట్లే తాను నడుచుకోవడం జరిగాయి. ఇక పై పద్యంలో ఏమి చెప్పబడిందో చూద్దాము.

లక్ష్మణా! శుభకరమైన వాల్మీకి మహామునిచే రచియింపఁబడిన రామాయణము యొక్క గానము లవకుశుల స్తోత్రములో వినగా నా మనసు కరిగింది. చెప్పాలంటే, ధ్వని కావ్యాలలో ప్రామాణికమైన కృతి అది.

తే॥గీ॥ యోగ దృష్టిని వాల్మీకి, సాగిన కథ,
సాగఁబోవు కథయును యాసాంతముఁ గని,
వ్రాసి, నేర్ప నా చరితము వటువులైన
లవకుశులకు, గానంబుగా రాణ కెక్కె... ॥ 2 ॥

(యోగదృష్టి = దివ్యదృష్టి, సాగు = జరుగు, ఆసాంతము = పూర్తిగా, కను = చూచు, చరితము = ఇతివృత్తము, వటువు = శిష్యుడు, రాణ = ప్రాబల్యము)

దివ్యదృష్టితో వాల్మీకి మహాముని జరిగిన జరగఁబోయే కథను పూర్తిగా చూసి వ్రాసి, యా చరిత్రను శిష్యులైన లవకుశులకు నేర్పగా గానముగా ప్రసిద్ధి కెక్కింది.

తే॥గీ॥ ఇన్ని వేల యేండ్లకు నాదు సన్నిధి నిటు
నా చరిత విన సుతుల వర్ణనల కతన,
జరుగఁ బోవునదియును నా కెఱుక పడెను
జగతి నెవ్వరి కిట్టుల జరుగు? ననుజ!... ॥ 3 ॥

(అనుజ = తమ్ముడా, ఏండ్లు = సంవత్సరాలు, నాదు = నా యొక్క, సన్నిధి = సమీపము, ఇటు = ఈ ప్రకారము, సుతుడు = కుమారుడు, వర్ణన = స్తోత్రము, కతన = కారణముచేత, ఎఱుకపడు = తెలియవచ్చు, జగతి = లోకము)

తమ్ముడా! ఇన్ని వేల సంవత్సరాలకి నా దగ్గర కుమారుల స్తోత్రము కారణముచేత ఈ విధంగా నా చరిత్రను వినడం వలన, జరగఁ బోయేది కూడా నాకు విదిత మయ్యింది. లోకంలో ఇలా ఎవ్వరికి జరుగుతుంది?

తే॥గీ॥ సీత వాల్మీకి యాశ్రమ సీమలను వ
సించు కాల మందె యరుదెంచె నొక నాడు
నారదుండు, సద్గుణవంతుఁ నామ మేది
యనుచు వాల్మీకి యా ముని నడుగ, కథకు
యంకురార్పణ జరిగె నా కంకితముగ... ॥ 4 ॥

(ఆశ్రమ = పర్ణశాల, సీమ = ప్రదేశము, వసించు = నివసించు, అరుదెంచు = వచ్చు, సద్గుణవంతుఁడు = మంచి గుణములుఁ గలవాఁడు, నామము = పేరు, అడుగ = ప్రశ్నించగా, అంకురార్పణ = ప్రారంభం, అంకితము = కృతి సమర్పణము)

సీత వాల్మీకి మహాముని ఆశ్రమ ప్రదేశంలో నివసిస్తున్న కాలం లోనే ఒక నాడు నారద మహర్షి వచ్చాడు. మంచి గుణములుఁ గలవాఁని పేరు ఏమిటి అని వాల్మీకి ఆ మునిని ప్రశ్నించగా, నాకు సమర్పణంగా కథకు అంకురార్పణ జరిగింది.

కం॥ మిశ్రిత స్పందన లెన్నో
యాశ్రారణ మందుఁ గదులు యారటుఁల వలెన్,
శ్వశ్రేయసములు పీడలు
యశ్రాంతము జ్ఞప్తి కొచ్చు నా కథ వినగన్... ॥ 5 ॥

(మిశ్రిత = కలిసిన, స్పందన = కదలుట, ఆశ్రారణము = నాటకము, కదులు = చలించు, ఆరటుఁడు = నటుఁడు, శ్వశ్రేయసము = శుభము, పీడ = బాధ, అశ్రాంతము = ఎల్లప్పుడు, జ్ఞప్తి = జాపకము)

నాటకంలో చలించే నటుఁల లాగా ఎన్నో మిశ్రమ స్పందనలు (mixed reactions), శుభములు, బాధలు నా కథ వింటే ఎల్లప్పుడు జాపకం వస్తాయి.

తే॥గీ॥ దానవత్వము యెక్కుడై ధరణి చెలఁగ,
మానవత్వము యంతంత మాత్ర ముండ,
మలి యుగంబుల ధర్మ మాకలనఁ జేయ
నలరు, వాల్మీకి కావ్యంబు యంకితముగ... ॥ 6 ॥

(దానవత్వము = రాక్షసత్వము, ఎక్కుడు = అధికము, ధరణి = భూమి, చెలగు = విజృంభించు, అంతంత = అక్కడక్కడ, ఆకలన = తెలిసికొనుట, అలరు = శోభిల్లు, అంకితము = సమర్పణము)

భూమి మీద రాక్షసత్వము ఎక్కువై విజృంభించగా, మానవత్వము అక్కడక్కడ మాత్రమే ఉండగా, తరువాతి యుగాలలో ధర్మము తెలియఁ జెప్పడానికి వాల్మీకి కావ్యము సమర్పణంగా శోభిల్లింది.

కం॥ రామాయణ మందు ఘటన
లేమి నటనఁ గాదు, పెక్కు రెంచి యని రిటుల్,
శ్రీమంతుడుఁ దన్ను మరచి
తా మానవుడై చరించె ధర్మముఁ గఱపన్... ॥ 7 ॥

(ఘటన = సన్నివేశము, నటన = కపట ప్రవర్తనము, ఎంచు = విమర్శ చేయు, ఇటుల్ = ఈ ప్రకారము, శ్రీమంతుడు = విష్ణువు, తన్ను = తనను, మరచు = మరిచి పోవు, తా = తాను, చరించు = తిరుగు, కఱపు = బోధించు)

రామాయణంలోని సన్నివేశాలు నటన కాదు. చాలా మంది విమర్శ చేసి ఈ ప్రకారము అన్నారు: విష్ణువు తనను మరచిపోయి ధర్మాన్ని బోధించడానికి తాను మానవుడిగా తిరిగాడు.

తే॥గీ॥ ఘటనయొ, చరితయొ, ప్రకృతి గరగరికయొ,
యూహయొ, యనుభవమ్ములో, యుత్సుకతయొ
కావ్యమునకు ప్రేరణ మగు, భవ్యమైన
నా కథకునుఁ గల దొౕక ధానమనిఁ దెలిసె... ॥ 8 ॥

(ఘటన = జరిగినది, చరిత = చారిత్రము, గరగరిక = అందము, అనుభవము = ప్రత్యక్షజ్ఞానము, ఉత్సుకత = కుతూహలము, ప్రేరణము = పురికొలుపడము, భవ్యము = మంగళము, ధానము = ఆధారము)

ఘటనో, చారిత్రమో, ప్రకృతి అందమో, ఊహో, అనుభవాలో, కుతూహలమో కావ్యానికి ప్రేరణ అవుతాయి. మంగళకరమైన నా కథకు కూడా ఒక ఆధారము ఉందని తెలిసింది.

కం॥ ప్రాకున పక్షుల జంటను
భీకరముగ బోయ యొకడు వేటాడంగా,
యా కవను యొకటె మిగిలెను,
వ్యాకులపడ యాడు పక్షి వాల్మీకిఁ గనెన్... **॥ 9 ॥**

(ప్రాకు = వృక్షము, భీకరము = భయము పుట్టించే విధంగా, బోయ = కిరాతుఁడు, కవ = జంట, వ్యాకులపడు = కలతఁ జెందు, కను = చూచు)

చెట్టు మీద ఉన్న పక్షుల జంటను భయంకరంగా కిరాతుఁ డొకడు వేటాడగా ఆ జంటలో ఒకటే మిగిలింది. ఆడు పక్షి కలతఁ జెందగా వాల్మీకి చూచాడు.

కం॥ శోకించె నంటఁ గని ముని
శ్లోకంబున, నదియె ఛందసూత్రోచితమై
లోకమున యనుష్టుప్పుల
నా కథ కాధార మనెడి నానుడి వినమే?... **॥ 10 ॥**

(శోకించు = దుఃఖించు, అంట = అఁట, కను = చూచు, శ్లోకము = సంస్కృత పద్యము, ఛంద = ఛందశ్శాస్త్రము, సూత్రోచితము = సూత్రాలకు తగినట్లుగా, అనుష్టుప్పు = పాదమునకు ఎనిమిది అక్షరములుఁ గల 32 అక్షరముల ఛందస్సు, ఆధారము = ఊతము, నానుడి = జనశ్రుతి)

చూచి (ముందరి పద్యంతో అన్వయము) వాల్మీకి ముని శ్లోకంలో దుఃఖించాడఁట. అదే ఛందశ్శాస్త్ర సూత్రాలకు తగినట్లుగా లోకంలో అనుష్టుప్పు ఛందస్సులో నా కథకు ఆధారం అనే జనశ్రుతి వినమా?

పక్షుల జంటకు కలిగిన బాధకు విలవిల లాడిన వాల్మీకి మనస్సు ఒక అనుష్టుప్పు శ్లోకంలో విలపించింది. ఆ శ్లోకమిదే:

“మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః, యత్ క్రౌఞ్చ మిథునాదేకమవధీః కామ మోహితం” (నిర్భాగ్యుడవైన ఓ కిరాతుడా! నీవు క్రౌంచ పక్షుల జంట నుండి మన్మథపరవశమైన ఒక పక్షిని చంపావు. అందుచేత నీవు చాలా కాలం జీవించకుందువు గాక.)

ఈ శ్లోకమే రామాయణ కథ నంతా సంక్షేపంగా సూచించింది అని పండిత విమర్శకులు అన్నారు. ఇలాంటి శ్లోకాలే (పాదానికి 8 అక్షరాలు చొప్పున నాల్గు పాదాలకి 32 అక్షరాలతో – అంటే అనుష్టుప్పు ఛందస్సులో) 24,000 వ్రాసి రామాయణాన్ని అందించాడు వాల్మీకి మహాముని. అందుచేత, ఈ శ్లోకమే వాల్మీకి రచించిన రామాయణానికి ఆధారమైంది అని పెద్దలు అంటారు. అనుష్టుప్పు ఛందస్సు వేద ఛందస్సు. ఈ ఛందస్సు వృత్త ఛందస్సుల కన్నా పురాతనమైనది.

కం॥ ప్రాకట మగు యెడబాట్లును,
శ్రీకరమగు మిత్రబంధ శిష్టాచరణల్,
యేకాకు లైన జంటలు,
యాకలనం బగునుఁ గావ్య మంతయు వినగన్.... ॥ 11 ॥

(ప్రాకటము = ప్రసిద్ధము, ఎడబాటు = వియోగము, శ్రీకరము = శుభము కల్గించునది, శిష్ట = సదాచార సంపన్నము కలది, ఆచరణ = నడత, ఏకాకి = ఒంటరి, ఆకలనము = అవగాహనము)

కావ్యం అంతా వింటే ప్రసిద్ధమైన వియోగాలు, శుభము కలిగించే సత్సాంప్రదాయాలు, ఒంటరులైన జంటలు అవగాహనం అవుతాయి. వాల్మీకి చూచిన పక్షుల జంట వియోగము రామాయణంలో జరగబోయే ఇటువంటి సంఘటనలని సూచించింది.

తే॥గీ॥ కొన్ని ఘట్టము లందు పాల్గొంటి నేను,
కొన్ని సందర్భములను లేకుంటి గాని,
సన్నివేశము లెదుటనే జరిగి నట్లు,
ఋతముఁ జక్కగఁ జూపె వాల్మీకి మౌని... ॥ 12 ॥

(ఘట్టము = సందర్భము, ఋతము = సత్యమైనది, మౌని = ముని)

కొన్ని సందర్భాలలో నేను పాలుపంచుకున్నాను, కొన్నిటిలో నేను లేను గానీ, సన్నివేశాలు కళ్ళెదుటనే జరిగినట్లుగా వాల్మీకి మహాముని నిజాన్ని చక్కగా చూపించాడు.

సీ॥ ఏకపత్నీవ్రత మెక్కు డనుచుఁ జూపు,
దాంపత్య బంధ మాదర్శ మనును,
వసుధైక భావమ్ము వ్యాప్తిఁ జేయు, నిలుపు
భ్రాతృభక్తిని గురుభక్తి నిలను,
ధర్మవిరుద్ధమౌ ధనములు కామమ్ము
చేకొన్న పతితుఁలై చెడుదు రనును,
సంకటముల లోన సహన శక్తినిఁ బెంచు,
ధైర్యమ్ముఁ గలిగించు, దార్ఢ్య మిచ్చు,

తే॥గీ॥ నన్యుల కుపకారముఁ జేయు టగ్ర గుణమ
టంచు, రాజు ప్రథమ భృత్యుఁ డంచు రాజ
ధర్మముఁ గఱపు, యన్ని విధముల యిట్లు
మానవ వికాస మొసఁగు రామాయణమ్ము.... ॥ 13 ॥

(ఏకపత్నీవ్రతము = ఒక్క భార్యతోనే యుండుట అను వ్రతము, ఎక్కుడు = ఆధిక్యము, దాంపత్యము = భార్యాభర్తృ భావము, ఆదర్శము = అనుకరింపదగినది, వసుధైక భావము = ప్రపంచం ఒకే కుటుంబం, నిలుపు = స్థిరపఱచు, భ్రాతృ = సహోదరుడు, ఇల = భూలోకము, పతితుఁడు = భ్రష్టుడు, సంకటము = బాధ, సహన = ఓర్పు, పెంచు = అధికము చేయు, దార్ఢ్యము = దిటవు, అన్యులు = ఇతరులు, అగ్ర = ఉత్తమమైన, ప్రథమ = మొదటి, భృత్యుఁడు = సేవకుడు, కఱపు = బోధించు, వికాసము = తెలివి, ఒసఁగు = ఇచ్చు)

ఏకపత్నీవ్రతము యొక్క ఆధిక్యతని చూపిస్తుంది, దాంపత్య బంధము ఆదర్శ మంటుంది, ప్రపంచం ఒకే కుటుంబం అన్న భావాన్ని వ్యాపింపఁ జేస్తుంది, లోకంలో సోదరుల పట్ల గురువుల పట్ల భక్తిని నిలుపుతుంది, ధర్మవిరుద్ధమైన అర్థకామాలు గ్రహిస్తే భ్రష్టులై చెడిపోతారంటుంది, బాధలలో సహన శక్తిని పెంచుతుంది, ధైర్యాన్ని కలిగిస్తుంది, దిటవు నిస్తుంది, పరోపకారం ఉత్తమమైన గుణమని రాజు ప్రథమ సేవకుడని రాజధర్మాన్ని బోధిస్తుంది. అన్ని విధాల ఈ ప్రకారం రామాయణము మానవ వికాసము ఇస్తుంది.

తే॥గీ॥ మంచి చెడు లందుఁ దోడ వర్తించి సతము,
బాధ లందు ధైర్యము నిడి, క్రోధ మడ్డి,
బోధ జేసి కర్తవ్యము, మేధ మేల్కొ
లిపిన మేటి! నీ కెవ్వరు లేరు సాటి... ॥ 14 ॥

(తోడ = వెంట, వర్తించు = ప్రవర్తించు, సతము = ఎల్లప్పుడు, ఇడు = ఇచ్చు, క్రోధము = కోపము, అడ్డు = నిరోధించు, మేధ = బుద్ధి, మేటి = శ్రేష్ఠుడు, సాటి = సమానము)

మంచి చెడులలో ఎప్పుడూ వెంట నిలిచి, బాధలలో ధైర్యం ఇచ్చి, కోపాన్ని నిరోధించి, కర్తవ్యము బోధించి బుద్ధిని మేలుకొలిపిన శ్రేష్ఠుడా! నీకు ఎవరూ సాటి లేరు.

మ॥ కవి వాల్మీకి రచించి నట్టి ధ్వని నీ కావ్యంబు స్పష్టీకరిం
ప విశేషంబుగఁ బెక్కు పండితు లిటన్ వాగ్ధాటిఁ జూపింప, యా
నవచైతన్యము మిన్ను ముట్టె, వినుమా! నా దృష్టి యందీ కృతిన్
రవివంశోద్భవు నాకు నీ యిలను యే లక్ష్యమ్ము సిద్ధించెనో... ॥ 15 ॥

(ధ్వని = వ్యంజనావృత్తితో తోఁచెడి యర్థము, స్పష్టీకరించు = తేటపఱచు, పెక్కు = అనేక, ఇట = ఇక్కడ, వాగ్ధాటి = వాక్ప్రవాహము, నవచైతన్యము = నూతన విజ్ఞానము, మిన్ను = ఆకాశము, దృష్టి = అభిప్రాయము, కృతి = కావ్యము, రవి = సూర్యుడు, ఇల = భూమి, లక్ష్యము = ఉద్దేశము, సిద్ధించు = నెఱవేరు)

వాల్మీకి కవి రచించి నట్టి ధ్వనిలో ఈ రామాయణ కావ్యం తేటపఱచడానికి ప్రత్యేకంగా చాలా మంది పండితులు ఇక్కడ వాక్ప్రవాహము చూపించగా, ఆ నూతన చైతన్యము ఆకాశాన్ని అంటింది. సూర్యవంశంలో పుట్టిన నాకు ఈ కావ్య మందు నా అభిప్రాయం ప్రకారం ఈ భూలోకంలో ఏ లక్ష్యము నెఱవేరిందో ఆలకించుమా.

తే॥గీ॥ క్లుప్తముగఁ బలుమార్లు వాక్రుచ్చ కథను
పారికాంక్షియౌ వాల్మీకి ప్రజ్ఞఁ జూపె,
యట్టి సన్నివేశములకు యర్హమైన
రీతిని వచించి, వాక్చతురిమనుఁ గఱప... ॥ 16 ॥

(క్లుప్తము = సంక్షిప్తము, పలుమార్లు = అనేక సార్లు, వాక్రుచ్చు = చెప్పు, పారికాంక్షి = ముని, ప్రజ్ఞ = సామర్థ్యము, అర్హము = తగినది, రీతి = పద్ధతి, వచించు = చెప్పు, వాక్చతురిమ = మాటలలో నేర్పరితనము, కఱపు = బోధించు)

రామాయణం సంక్షిప్తంగా చెప్ప వలసిన సందర్భాలు రామ కథలో చాలా సార్లు వస్తాయి. బాలకాండము ప్రారంభంలోనే, 16 గుణాలు చెప్పి అటువంటి వారు ఉన్నారా అని వాల్మీకి నారదుణ్ణి అడగగానే నారదుడు సంక్షిప్తంగా రామకథ చెబుతాడు. తరువాత, వివిధ సందర్భాలలో అవసరమయినంత వరకు సంబంధిత పాత్రల ద్వారా రామకథ చెప్పించబడుతుంది. ఉదాహరణకి, రామలక్ష్మణులు హనుమంతుని, సుగ్రీవుని మొదటి సారి కలిసినప్పుడు, హనుమంతుడు సీతను మొదటిసారి కలిసి తాను రామదూతనని నమ్మించాల్సి వచ్చినప్పుడు రామకథ క్లుప్తంగా చెప్పబడుతుంది. ఇక పద్యంలో ఏం చెప్పబడిందో చూద్దాం.

సంక్షిప్తంగా అనేక సార్లు కథను చెప్పడానికి అటువంటి సన్నివేశాలకు తగిన విధంగా చెప్పి మాటలలో నేర్పరితనము బోధించడానికి వాల్మీకి మహర్షి సామర్థ్యము చూపించాడు.

కం॥ భావోద్వేగము పొంగెను
నే విన్న కథనుఁ దలపగ, నెమ్మది "సీతా
రావా!" యను యార్తత్వము
నా వీనుల ధ్వానము నిడె, న్యాయ మొసంగన్... ॥ 17 ॥

(ఉద్వేగము = అవ్యవస్థిత చిత్తత, పొంగు = ఉబుకు, నే = నేను, తలచు = భావించు, నెమ్మది = నిండు మనస్సు, ఆర్తత్వము = బాధ, వీనులు = చెవులు, ధ్వానము = మ్రోత, ఇడు = ఇచ్చు, ఒసగు = ఇచ్చు)

నేను విన్న కథను గురించి ఆలోచించగా భావోద్వేగము ఉబికింది. న్యాయం ఇవ్వడానికి నిండు మనస్సుతో "సీతా రావా!" అనే బాధ నా చెవుల్లో చప్పుడు చేసింది. అంటే, సీతకి అన్యాయం చేశానని మనస్సులో చాలా బాధ అనిపించింది.

తే॥గీ॥ కథను మరలఁ జెప్పగ నిచ్ఛఁ గాదుఁ గాని,
యందు గల విశేషములను, యందు నెఱుగ
భావి తరములు శీలించు పద్ధతులను,
మంచి చెడుల గురించి, నా మదిని పొంగు
భావములు నీకుఁ దెలిపెద బ్రాఁతి మీర.... ॥ 18 ॥

(ఇచ్ఛ = అభిలాష, విశేషము = ప్రత్యేకత, ఎఱుగు = తెలిసికొను, భావి = భవిష్యత్తు, శీలించు = పరీక్షించు, పొంగు = ఉబుకు, బ్రాఁతి = ప్రేమ, మీరు = అతిశయించు)

కథను మళ్ళీ చెప్పాలన్న అభిలాష కాదు గానీ, అందులో ఉన్న విశేషాలు, అందులో భావి తరాలు పరీక్షించే పద్ధతులు, మంచి చెడుల గురించి, నా మనస్సులో పొంగే భావాలు నీకు ప్రేమ అతిశయించేటట్లుగా చెబుతాను.

బాల్య దశ:

తే॥గీ॥ రాజు ధర్మంబు మీరిన రాజ్య మందు
యీతిబాధలు పీడించు నెల్లర నని
రోమపాదుని చరిత నిరూపితమ్ముఁ
జేయ, విడివడె నవి ఋష్యశృంగు వలన... ॥ 19 ॥

(మీరు = అతిక్రమించు; ఈతిబాధలు = అతివృష్టి, అనావృష్టి, శలభబాధ, మూషిక బాధ, శుకబాధ, దండెత్తివచ్చిన రాజులబాధ; పీడించు = బాధించు; ఎల్లరు = అందఱు; నిరూపితము = నిరూపింపఁబడినది; విడివడు = తొలగు)

వాల్మీకి రామాయణం బాలకాండము 9వ సర్గములో రోమపాదుని ఋష్యశృంగుని కథలు చెప్పబడ్డాయి. రోమపాదుడనే రాజు ధర్మాతిక్రమణం

చెయ్యడం వల్ల అతని రాజ్యంలో తీవ్రమైన అనావృష్టి కలుగుతుంది. ఋష్యశృంగుణ్ణి రాజ్యానికి తీసుకొని వస్తే వర్షాలు పడతాయి అని వేదపండితులు ఇచ్చిన సలహా పాటించడం వల్ల సమస్య తీరుతుంది. ఇక పద్యార్థం ఏమిటో చూద్దాం.

రాజు కర్తవ్యాన్ని అతిక్రమించిన రాజ్యంలో అందరిని ఈతి బాధలు పీడిస్తాయి అని రోమపాదుని చరిత్ర నిరూపిస్తే, ఋష్యశృంగ మహర్షి వలన అవి తొలగిపోయాయి.

ఉ॥ శృంగము లున్న యేకకుఁడు, శిష్ట ఋషీశ్వరు ఋష్యశృంగు, వా
రాంగన లాదరించి వలరాచపనిం గఱపన్, తదార్తిచే
యంగ నృపాలుఁ బుత్రిఁ గర మందె, నయోధ్యకు రమ్మటంచుఁ బి
ల్వంగ యతండు పంక్తిరథు రాజ్యమునన్ నడిపించె యాగమున్ ॥ 20 ॥

(శృంగము = కొమ్ము, ఏకకుఁడు = అసహాయుఁడు, శిష్ట = సదాచార సంపన్నముఁ గల, వారాంగన = వేశ్య, ఆదరించు = అభిమానించు, వలరాచపని = సంభోగము, కఱపు = నేర్పు, తత్ = ఆ, ఆర్తి = మనోవ్యథ, నృపాలుఁడు = రాజు, పుత్రి = కుమార్తె, కరము = చేయి, అందు = గ్రహించు, పిల్చు = ఆహ్వానించు, పంక్తిరథుడు = దశరథుడు, నడిపించు = జరిగించు, యాగము = యజ్ఞము)

కొమ్ములున్న అసహాయుడు సదాచారసంపన్నుడు మునీశ్వరుడైన ఋష్యశృంగుని వేశ్యలు అభిమానించి సంభోగము నేర్పగా, ఆ మనోవ్యథతో అంగరాజైన రోమపాదుని కుమార్తెయైన శాంతను పాణిగ్రహణం చేసుకున్నాడు. అయోధ్యకు రమ్మని ఆహ్వానించగా అతడు దశరథుని రాజ్యంలో యజ్ఞము జరిపించాడు.

కం॥ పుత్రేష్టి నా మునిఁ సలుప
క్షేత్రములకు సంతుఁ గలుగఁ జేయ, దశరథుం
దత్రముఁ బడసెను, యతడి క
ళత్రము లది త్రాగిఁ బొందె, లక్ష్మణ! మనలన్... ॥ 21 ॥

(పుత్రేష్టి = మగ సంతానం కోసం చేసే పుత్రకామేష్టి అనే యజ్ఞం, చలుపు = చేయు, క్షేత్రము = భార్య, సంతు = సంతానము, అత్రము = క్షీరాన్నము, పడయు = పొందు, కళత్రము = భార్య)

లక్ష్మణా! ఆ మునీశ్వరుడు భార్యలకు సంతానం కలుగడానికి మగ సంతానం కోసం చేసే పుత్రకామేష్టి అనే యజ్ఞం చేయగా, దశరథుడు క్షీరాన్నము అందుకున్నాడు. అతడి భార్యలు అది త్రాగి మనలను పొందారు.

కం॥ యజనములు, వ్రతము లప్పుడు
రజనయె లేనట్టి మునులు, బ్రాహ్మణులకు భూ
భుజుఁలుఁ గలిమిఁ బంచుట, యవ
రజ! సమతనుఁ బెంచునట్టి లక్ష్యమెఁ గాదా!... ॥ 22 ॥

(యజనము = యజ్ఞము, వ్రతము = ఉపవాసాది పుణ్యకర్మము, రజన = సంపాదన, భూభుజుఁడు = రాజు, కలిమి = సంపద, పంచు = విభజించు, అవరజుఁడు = తమ్ముఁడు, సమత = సమత్వము, పెంచు = వృద్ధిచేయు, లక్ష్యము = ఉద్దేశము)

తమ్ముఁడా! యజ్ఞములు పుణ్యకర్మలు చేసేటప్పుడు సంపాదన లేనట్టి మునులకు బ్రాహ్మణులకు రాజులు సంపదని పంచిపెట్టడం సమత్వము వృద్ధిచేసే ఉద్దేశమే కాదా.

తే॥గీ॥ రావణునికి నరుఁ లన నిరాదర మని,
బ్రహ్మను వర మడుగు వేళ వదలె నరుల
నుండి రక్షణ యనుచు, జినునికిఁ జెప్ప
సురలు, విష్ణు వంశగ నేను ధరను దశర
థునికి యజ్ఞ ఫలమగు సుతుఁనిగఁ బుట్ట,
జన్మ తోడనె వైరమ్ము జటిల మయ్యె
మానవుడె రావణుం బరిమార్చుఁ గనుక... ॥ 23 ॥

(నరుఁడు = మనుష్యుఁడు, నిరాదరము = గౌరవం లేకపోవడం, జినుఁడు = విష్ణువు, సురలు = దేవతలు, అంశ = ఒక భాగము, ధర = భూలోకము,

సుతుఁడు = కుమారుడు, పుట్టు = జన్మించు, తోడను = వెంబడిని, వైరము = విరోధము, జటిలము = దట్టమైనది, పరిమార్చు = చంపు)

రావణునికి మనుష్యు లంటే గౌరవం లేదని బ్రహ్మని వరము అడిగే వేళ మానవుల నుండి రక్షణ వదిలి వేశాడని విష్ణువుకు దేవతలు చెప్పగా, విష్ణువు అంశగా నేను భూలోకంలో దశరథునికి యజ్ఞ ఫలమైన పుత్రునిగా జన్మించగా, మానవుడే రావణుణ్ణి చంపుతాడు కావున పుట్టడం తోనే విరోధం జటిలము అయ్యింది.

కం॥ పదుగురు మెచ్చు గుణంబులు
పదుగురు కీర్తించు కదన పటిమయు క్షమయున్
సదమల సఖ్యాతిశయముఁ
బదిలముగా నేర్పిరి మునివర్యులు మనకున్... ॥ 24 ॥

(పదుగురు = పెక్కురు, కదన = యుద్ధము, పటిమ = సామర్థ్యము, క్షమ = ఓర్పు, సదమలము = మిక్కిలి నిర్మలమైన, సఖ్య = స్నేహము, అతిశయము = ఆధిక్యము, పదిలము = జాగ్రత్త)

పదుగురు శ్లాఘించే గుణాలు, పదుగురు పొగిడే యుద్ధ సామర్థ్యము, ఓర్పు, అతి నిర్మలమైన స్నేహాధిక్యము జాగ్రత్తగా మునీశ్వరులు మనకు నేర్పారు.

కం॥ గురువులు నేర్పి నటుల మన
యిరువురి నడవడిక, విష్ణు వింద్రాదులకున్
వర మిడ జరిగిన మాయని,
నరుఁల కశక్య మది యనుట నగుఁబాటెఁ గదా... ॥ 25 ॥

(అటుల = ఆ ప్రకారము, ఇరువురు = ఇద్దరు, నడవడిక = ప్రవర్తన, ఇంద్రాదులు = ఇంద్రుడు మొదలైన వారు, ఇడు = ఇచ్చు, నరుఁడు = మనుష్యుఁడు, అశక్యము = అసాధ్యము, నగుఁబాటు = తలవంపు)

గురుదేవులు నేర్పిన విధంగా మన ఇద్దరి ప్రవర్తన, విష్ణువు ఇంద్రాది దేవతలకు వర మివ్వడం వల్ల జరిగిన మాయ అని, మానవులకు అసాధ్య మని,

అనడం తలవంపు కదా. అంటే, ఆ విధంగా నేర్పే గురువు లుంటే ఎవరైనా అలాగే తయారవుతారు, అందులో గొప్పేముంది అని వినయంగా చెప్పడం.

విశ్వామిత్రునితో అనుబంధము:

ఉ॥ ఎంతటి వారలైన, మన సెంత నియంత్రణఁ జేసికొన్న, యో
కాంతకు దాసుఁలే యనగ, గాధిజు సంయతి కంతరాయమైఁ
జెంతను నిల్చు మేనకనుఁ జిత్తము నందున నిల్పిఁ బొందె నా
యింతిని గాధిపట్టి తన యీప్సిత మెంత బలీయమోఁ గదా...॥ 26 ॥

(నియంత్రణ = అదుపుచేయటం, ఓ = ఒక, దాసుఁడు = సేవకుడు, గాధిజుఁడు = విశ్వామిత్రుఁడు, సంయతి = తపస్సు, అంతరాయము = విఘ్నము, చెంత = సమీపము, చిత్తము = మనస్సు, పొందు = అనుభవించు, ఇంతి = స్త్రీ, గాధిపట్టి = విశ్వామిత్రుఁడు, ఈప్సితము = కోరిక, బలీయము = బలిష్ఠము)

ఎంతవారలైనా మనస్సును ఎంత అదుపులో ఉంచుకున్నా ఒక స్త్రీకి దాసులే అన్నట్లుగా, విశ్వామిత్రుఁని తపస్సుకు విఘ్నమై చెంతను నిలబడ్డ మేనకను మనస్సులో నిలిపి ఆ స్త్రీని అనుభవించాడు విశ్వామిత్రుఁడు. తన కోరిక ఎంత బలిష్ఠమో కదా.

కం॥ కోపం బెంత యనర్థమొ
తాపసి గాధేయు గాథ తార్కాణంబై
కోపము నదుపున నుంచుట
కోప మనయమైన తెచ్చుకొనుటను నేర్పెన్... ॥ 27 ॥

(అనర్థము = అర్థములేనిది, తాపసి = ముని, గాధేయుఁడు = విశ్వామిత్రుఁడు, గాథ = చరిత్రము, తార్కాణము = దృష్టాంతము, అదుపు = చేయి దాటిపోని స్థితి, అనయము = అవశ్యము)

విశ్వామిత్ర మహర్షి చరిత్రము దృష్టాంతమై కోపము ఎంత అనర్థమూ, కోపాన్ని అదుపులో ఉంచుకోవడం, కోపం అవసరమైతే తెచ్చుకోవడం, నేర్పింది.

తే॥గీ॥ క్రూరమైననుఁ గాకున్న, కొడిమె యున్నఁ
గాని, కార్యము జనుల రక్షణకుఁ జేయ,
తలకు వల దది ప్రాచీన ధర్మ మన్న,
గాధిజుఁని వాక్కె శాస్త్రమ్ము క్ష్మాపతులకు... ॥ 28 ॥

(క్రూరము = భయంకరమైనది, కొడిమె = పాపము, తలకు = సంశయము, గాధిజుఁడు = విశ్వామిత్రుఁడు, వాక్కు = మాట, శాస్త్రము = నియమన గ్రంథము, క్ష్మాపతి = రాజు)

భయంకరమైనా కాకపోయినా, పాపమే యున్నా సరే, ప్రజల రక్షణ కోసం పని చెయ్యడానికి సంశయము వద్దన్నది ప్రాచీన ధర్మమన్న విశ్వామిత్రుఁని మాటే, రాజులకు శాస్త్రము.

కం॥ ముని విశ్వామిత్రునితో
ననుఁ బంపగ యాగ రక్షణకు గహనమునన్
మన పిత తడఁబడె తొలుతన్,
యనుమతి నివ్వగ వశిష్ఠ దది నెఱవేరెన్... ॥ 29 ॥

(పంపు = పంపించు, యాగము = యజ్ఞము, గహనము = అడవి, పిత = తండ్రి, తడఁబడు = సంకోచించు, తొలుత = మొదట, అనుమతి = అనుజ్ఞ, నెఱవేరు = సిద్ధించు)

విశ్వామిత్ర మునితో యాగరక్షణ కోసం అడవికి నన్ను పంపడం విషయంలో, మన తండ్రి మొదట సంకోచించాడు. వశిష్ఠుడు అనుజ్ఞ ఇవ్వగా అది నెఱవేరింది.

కం॥ ఎవరో శిక్షణ నివ్వగ
యవకాశము మాదటంచు యన్యులు సతమా
ప్రవణుఁల నుపయోగించు ట
లవడును గాధిజుఁని కతన ప్రచురత కలుగన్... ॥ 30 ॥

(అన్యులు = ఇతరులు, సతము = ఎల్లప్పుడు, ప్రవణుఁడు = సమర్థుఁడు, అలవడు = వాడుకపడు, గాధిజుఁడు = విశ్వామిత్రుఁడు, కతన = కారణముచేత, ప్రచురత = వ్యాప్తి)

ఎవరో శిక్షణ ఇవ్వగా అవకాశం మాది అంటూ ఇతరులు ఎల్లప్పుడు ఆ సమర్థుఁలను ఉపయోగించడం విశ్వామిత్రుఁని కారణం చేత వ్యాప్తి కలుగగా వాడుక అవుతుంది (ఒక కంపెనీలోనో గవర్నమెంటులోనో వృత్తికి సంబంధించిన శిక్షణ పొందిన మెరిక లాంటి కుర్రాళ్ళని వేరే కంపెనీ వాళ్ళు ఎగరేసుకుని పోవడం మనం చూస్తూ ఉంటాం.).

కం॥ కౌసల్యాత్మజ! యనుచున్
భాసురమగు సంధ్య వేళ వాత్సల్యమునన్
యీ సరణి గాధిజుఁడు ప్రతి
వాసరమున నిద్ర లేపె ప్రాంతర మందున్... ॥ 31 ॥

(ఆత్మజుడు = కొడుకు, భాసురము = ప్రకాశించునది, సంధ్య = ఉదయము, వాత్సల్యము = పెద్దలకు పిన్నలయందలి ఆదరము, సరణి = విధము, గాధిజుఁడు = విశ్వామిత్రుఁడు, వాసరము = దినము, ప్రాంతరము = అడవి)

కౌసల్యాసుత! (రామా!) అంటూ ప్రకాశించే ఉదయ కాలంలో ఆదరముతో ఈ విధంగా విశ్వామిత్రుఁడు ప్రతి రోజూ అడవిలో నిద్ర లేపాడు (వాల్మీకి రామాయణం లోని “కౌసల్యా సుప్రజా రామా ..” అన్న శ్లోకానికి అర్థమే ఇది. ఆ శ్లోకం అందరికీ నోటికొచ్చు.).

కం॥ “బల”, “అతిబల” యను విద్యలు
సులభముగా నేర్ప గాధిజుఁడు, శ్రమలు రుజల్
తొలగి మనకు సర్వావ
స్థలలో రక్షణఁ గలిగెను, సాంత్వన దొరికెన్... ॥ 32 ॥

(గాధిజుండు = విశ్వామిత్రుండు, శ్రమ = అలసట, రుజ = రోగము, తొలగు = నశించు, సర్వ = అన్ని, అవస్థ = పరిస్థితి, సాంత్వన = ఓదార్పు)

విశ్వామిత్రుండు "బల", "అతిబల" అనే విద్యలు తేలికగా నేర్పగా అలసటలు రోగాలు నశించి మనకు అన్ని పరిస్థితులలో రక్షణ కలిగింది, ఓదార్పు దొరికింది.

చం॥ రయమున మానవాస్త్రమును రాఘవు డేయగ తాటకేయుఁపై
భయమున మున్గె నబ్ధిని, సుబాహుడు నన్య నిశాచరుల్ పరా
జయమును మూటఁగట్టుకొనె జన్నపుగాపరి యస్త్ర ధాటికిన్,
నయమున కౌశికాధ్వరము నాంది యయెన్ యసురాళి ధ్వస్తికిన్
భయ మిక లేదటం చనిరి ప్రాంతర మందున మౌని పుంగవుల్ ॥ 33 ॥

(రయము = వేగము, రాఘవుడు = శ్రీరాముడు, తాటకేయుండు = మారీచుండు, మున్గు = మునుగు, అబ్ధి = సముద్రము, అన్య = ఇతర, నిశాచరుండు = రాక్షసుండు, పరాజయము = ఓటమి, మూటఁగట్టుకొను = ఆర్జించుకొను, జన్నపుగాపరి = యజ్ఞమును రక్షించినవాఁడైన శ్రీరాముండు, ధాటి = దాడి, నయము = ఆసక్తి, కౌశికుండు = విశ్వామిత్రుండు, అధ్వరము = యజ్ఞము, నాంది = ప్రారంభము, అసురాళి = రాక్షస సమూహము, ధ్వస్తి = నాశనము, ప్రాంతరము = అడవి, మౌని = ముని, పుంగవుండు = శ్రేష్ఠుండు)

శ్రీరాముండు వేగంగా మానవాస్త్రం వేయగా మారీచుండు భయంతో సముద్రంలో మునిగాడు. సుబాహుడు, ఇతర రాక్షసులు యజ్ఞ సంరక్షకుడైన శ్రీరాముని అస్త్రధాటికి ఓటమిని మూటఁగట్టుకున్నారు. ఆసక్తికరంగా రాక్షస సమూహము నాశనానికి కౌశికు యాగము నాంది అయ్యింది. అడవిలో ఇంక భయం లేదు అని మునీశ్వరులు అన్నారు.

తే॥గీ॥ దాగి మేఘము మాటున దాడిఁ జేయు
తాటకనుఁ జంపి తీవు ప్రాంతరము నోమ,
యజ్ఞమునుఁ గావ తరిమితి వామె సుతుల
ననుచు మెచ్చెను గాధిజుం దనుజ! నన్ను... ॥ 34 ॥

(దాగు = మరుగుపడు, మాటు = చాటు, దాడి = దండయాత్ర, ఈవు = నీవు, ప్రాంతరము = అడవి, ఓము = రక్షించు, కాయు = రక్షించు, తరుము = పారద్రోలు, సుతుడు = పుత్రుడు, గాధిజుఁడు = విశ్వామిత్రుఁడు, అనుజుడు = తమ్ముడు)

ఓ తమ్ముడా! మేఘము చాటున దాగి దాడి చేయగా తాటకను నువ్వు చంపినావు, యజ్ఞమును రక్షించడానికి ఆమె పుత్రులను పారద్రోలావు అని విశ్వామిత్రుఁడు నన్ను మెచ్చుకున్నాడు.

తే॥గీ॥ గాధిజు యజతి కడ్డగు కర్మకరుఁలు
రావణుని రాజనీతికి పావు లవగ,
వారి యడ్డునుఁ దొలఁగించి, పారికాంక్షి
వెంట మిథిలకుఁ బయనించ, వెడలు దారి
లోన గంగ గాథనుఁ జెప్పె మౌని మనకు... ॥ 35 ॥

(గాధిజుఁడు = విశ్వామిత్రుఁడు, యజతి = యాగము, అడ్డు = అవరోధము, కర్మకరుఁడు = సేవకుడు, పావులు = సాధనములు, తొలఁగించు = పోగొట్టు, పారికాంక్షి = ముని)

విశ్వామిత్రుఁని యాగానికి అవరోధమైన సేవకులు రావణుని రాజనీతికి సాధనాలు అవడం వలన వారి అడ్డును పోగొట్టి ముని వెంట మిథిలకు ప్రయాణించగా వెళ్ళే దారిలో ముని మనకు గంగ కథ చెప్పాడు.

భగీరథుని ప్రయత్నము:

కం॥ తాతలు యుత్తమ గతిఁ గొన,
క్ష్మాతలమున గంగఁ జేర్చ సగరు ప్రపౌత్రుం
డాతురపడ, నియ్యకొనిన
సీతనుఁ గని శంకరుండు చిందులు వేసెన్... ॥ 36 ॥

(కొను = పొందు, క్ష్మాతలము = భూప్రదేశము, ప్రపౌత్రుడు = మునిమనుమఁడు, ఆతురపడు = శ్రమపడు, ఇయ్యకొను = సమ్మతించు, సీత = గంగ, చిందు = నాట్యము)

తాతలు ఉత్తమ గతి పొందడానికి భూతలానికి గంగా నదిని చేర్చాలని సగరుని మునిమనుమఁడైన భగీరథుఁడు శ్రమపడగా, సమ్మతించిన గంగను చూసి శంకరుడు తాండవం చేశాడు.

తే॥గీ॥ విష్ణుపది లహరి వడిని విశ్వగంధ
యోపదని, యుమాధవ! జట నాఁపి, నిత్య
మచ్యుతమగు తరంగిణి నందఁజేయు,
యిందుమౌళి! గుడాకేశ! వందనమ్ము... ॥ 37 ॥

(విష్ణుపది = గంగ, లహరి = మహాతరంగము, వడి = వేగము, విశ్వగంధ = భూమి, ఓపు = ఓర్చు, ఉమాధవుడు = పార్వతి భర్తయైన శివుడు, జట = అల్లుకొనినజుట్టు, ఆఁపు = అడ్డగించు, నిత్యము = ఎల్లప్పుడు, అచ్యుతము = నాశము లేనిది, తరంగిణి = నది, ఇందుమౌళి = చంద్రుని తలపై ధరించిన ఈశ్వరుఁడు, గుడాకేశుఁడు = జెముడువలె గుబురుగా పెరిగిన జుట్టు కలవాడైన శివుఁడు, వందనము = నమస్కారము)

శివా! చంద్రమౌళీ! గుడాకేశా! గంగా నది మహా తరంగ వేగాన్ని భూమి ఓర్చుకోలేదని, నీ జటతో నిరోధించి నిత్యము నాశము లేనిది అయిన నదిని (అంటే, జీవ నదిని) అందఁజేసిన నీకు నమస్కారము.

తే॥గీ॥ యుగయుగంబుల గురుతుండు యుపకృతి యన
యన్నదాతగు గంగ నీ యవని పైకి
పట్టుదలను భగీరథుఁ డెట్టుఁ దెచ్చె,
యతడె త్యాగికి తార్కాణ మగుచు నిలిచె... ॥ 38 ॥

(గురుతు = జ్ఞాపకం, ఉపకృతి = ఉపకారము, అవని = భూమి, ఎట్టు = ఎట్లు, త్యాగి = వితరణశీలుఁడు, తార్కాణము = ఉదాహరణము)

యుగయుగాలలో జ్ఞాపకం ఉండే ఉపకారం అనేటట్లుగా అన్నదాతయైన గంగా నదిని ఈ భూమి పైకి పట్టుదలతో భగీరథుఁడు ఎట్లా తీసుకొచ్చాడు. అతడే త్యాగికి ఉదాహరణమై నిలిచాడు.

తే॥గీ॥ తాతలఁ బదడు మునుగంగ తరలు మనుచుఁ
దపమున భగీరథుఁ డడుగంగ, పయనమయి
యడ్డు లన్నియుఁ దొలగంగ యవనిఁ జేరి,
జాహ్నవిగఁ గొనసాగంగ జగతి యెఱఁగె... ॥ 39 ॥

(పదడు = భస్మము, తరలు = ప్రయాణమగు, అడ్డు = అవరోధము, అవని = భూమి, జాహ్నవి = జహ్ను మహాముని పుత్రియైన గంగ, కొనసాగు = ప్రవహించు, జగతి = లోకము, ఎఱఁగు = నమస్కరించు)

తాతల భస్మము మునగడానికి ప్రయాణం అవ్వమని తపస్సులో భగీరథుఁడు అడుగగా, బయలుదేరి అవరోధాలన్నీ తొలగిపోగా భూలోకానికి చేరి జాహ్నవిగా ప్రవహించడం వలన లోకం నమస్కరించింది.

అహల్యా శాపవిమోచనము:

తే॥గీ॥ పోవు దారిలో మిథిల దాపునఁ గనపడె
పాడుపడిన యాశ్రమము, శాపముల బారిఁ
బడిన ముని భార్య యిందగుపడక యుండు
ననుచు గాధిపట్టి యహల్య యార్తిఁ దెలిపె... ॥ 40 ॥

(దాపు = దగ్గర, పాడుపడు = ఉపయోగించకపోవుట వలన శిథిలమగు, అగుపడు = కంటబడు, గాధిపట్టి = విశ్వామిత్రుడు, ఆర్తి = దుఃఖము)

వెళ్ళే దారిలో మిథిలా నగరానికి దగ్గరగా పాడుపడిన ఆశ్రమము కనపడింది. శాపాల బారిన పడిన ముని భార్య (గౌతముని భార్య) ఈ ఆశ్రమంలో కనపడకుండా ఉంటుంది అంటూ విశ్వామిత్రుడు అహల్య దుఃఖాన్ని తెలియజేశాడు.

చం॥ తపమున విఘ్నముల్ జొనిపి తాపసి గౌతము కాగ్రహం బిడన్
కపటిగఁ జేరి తాను ముని గౌతముఁ బోలె యహల్యఁ జెంతకున్
త్రప విడి వజ్రపాణి మరుఁ దాపముఁ దీర్చెను యామె మేకొనన్
నెప మదయోగ్య మంచనుచు నిచ్చలుఁ దోచును నాకు, లక్ష్మణా! ॥ 41 ॥

(విఘ్నము = ఆటంకము, చొనుపు = కలిగించు, తాపసి = ముని, ఆగ్రహము = కోపము, ఇడు = ఇచ్చు, కపటి = మోసగాడు, చేరు = సమీపించు, పోలె = వలె, చెంతకు = వద్దకు, త్రప = సిగ్గు, విడు = త్యజించు, వజ్రపాణి = ఇంద్రుడు, మరుఁడు = మన్మథుఁడు, తాపము = బాధ, తీర్చు = తొలగించు, మేకొను = సమ్మతించు, నెపము = కారణము, అయోగ్యము = తగనిది, నిచ్చలు = ఎల్లప్పుడు, తోచు = భావముదయించు)

ఓ లక్ష్మణా! తపస్సులో విఘ్నాలు కలిగించి గౌతమ మహర్షికి కోపం వచ్చేటట్లు చెయ్యడానికి గౌతమ ముని లాగా మోసగాడిగా తాను అహల్య వద్దకు చేరి సిగ్గు వదిలి ఇంద్రుడు ఆమె సమ్మతించగా మన్మథ తాపము తీర్చాడు. ఆ కారణము సరియైనది కాదని నాకు ఎప్పుడూ అనిపిస్తుంది.

కం॥ చిరకాలము యొంటరి యగు
తరుణి యహల్యకు లభించె తపమున ఫలమై
సురపతిఁ గూడగఁ బొందిన
వరుఁశాపముఁ బాపు నాదు పాదరజమ్మే... ॥ 42 ॥

(చిరకాలము = చాలకాలము, ఒంటరి = ఏకాకి, తరుణి = యౌవనము గల ఆఁడుది, సురపతి = ఇంద్రుఁడు, కూడు = సంభోగించు, పొందు = ప్రాప్తించు, వరుడు = భర్త, పాపు = పోఁగొట్టు, రజము = దుమ్ము)

చాలకాలము ఏకాకిగా ఉన్న తరుణి అహల్యకు తపఃఫలమై ఇంద్రుఁనితో సంభోగించడం వలన ప్రాప్తించిన తన భర్త శాపము పోఁగొట్టు నా కాలి దుమ్ము లభించింది. అంటే, నేను కాలిడగానే ఆమెకు శాపవిముక్తి అయ్యింది.

సీతా పరిగ్రహణము:

తే॥గీ॥ మేటి విలుకాండ్రుగా పర్వి మిథిల కొచ్చి,
వీర్యశుల్కనుఁ జేపట్ట వీలుఁ గాక,
పోయి రొయ్యన నృపుఁలని పొక్కిసవడి
కుజ మనువుకై దిగులుఁ జెందిన జనకు డనె
కౌశిక జపీ! తగు వెరవు కాశ కలదె?... ॥ 43 ॥

(మేటి = శ్రేష్ఠము, విలుకాడు = విల్లు ధరించినవాఁడు, పర్వు = పేరుగాంచు, చేపట్టు = పెండ్లియాడు, వీలు = అనుకాలము, ఒయ్యన = నెమ్మదిగా, నృపుఁడు = రాజు, పొక్కిసవడు = దుఃఖించు, కుజ = సీత, మనువు = పెండ్లి, దిగులు = అధైర్యము, కౌశికుడు = విశ్వామిత్రుఁడు, జపి = ముని, తగు = యుక్తమగు, వెరవు = ఉపాయము, ఆశ = అపేక్ష)

శ్రేష్ఠమైన విలుకాండ్రుగా పేరుగాంచి మిథిలకు వచ్చి వీర్యశుల్కగా నిర్ణయించబడిన సీతను పెండ్లియాడడం వీలు కాక రాజులు మెల్లిగా వెళ్ళిపోయారని దుఃఖించి సీత పెండ్లి కోసం దిగులు చెందిన జనక మహారాజు విశ్వామిత్ర మునీశ్వరా! తగిన ఉపాయానికి ఆశ ఉందా అని అన్నాడు. అంటే, జనకుడు కుమార్తె సీత వివాహం గురించి బెంగ పెట్టేసుకున్నాడు.

చం॥ నగరున కొచ్చి యెక్కిడి పినాకి లసక్తిని వీర్యశుల్క మి
య్యగల యనూక మందు తనయన్ జనకుం డిడు, నీవ నంగ నా
కు గరువ మంచుఁ జెప్పు ముని కోర్కె గ్రహించితి, కౌశి కాజ్ఞ య
వ్వగ రుజు వివ్వ నేను యొక బద్దను వోలె ధనుస్సుఁ ద్రుంపితిన్ ॥ 44 ॥

(నగరు = రాజగృహము [మిథిల], ఎక్కిడు = ఎక్కుపెట్టు, పినాకి = శివుడు, లసక్తి = విల్లు, అనూకము = వంశము, తనయ = కూతురు, ఇడు = ఇచ్చు, గరువము = గర్వము, గ్రహించు = గమనించు, కౌశికుడు = విశ్వామిత్రుడు, రుజువు = నిరూపణ, బద్ద = వెదురబద్ద, త్రుంపు = తునుగునట్లుచేయు)

మిథిలా రాజగృహానికి వచ్చి శివుని విల్లు ఎక్కుపెట్టి వీర్యశుల్కము ఇయ్యగల వంశంలో జనక మహారాజు కుమార్తెను ఇస్తాడు, నువ్వంటే నాకు ఎంతో గర్వము అంటూ చెప్పే ముని కోరిక గమనించాను. విశ్వామిత్రుని ఆజ్ఞ అవ్వగా నిరూపించడానికి నేను ఒక బద్ద లాగా విల్లును త్రుంచాను.

కం॥ జన్యుఁడు జనకుని పనుపున
విన్యాసముగా పినాకి విల్లునుఁ ద్రుంచన్
కన్యారత్నము సీతను
ధన్యుడనైఁ జెట్టపట్ట, దాణముఁ దీరెన్... ॥ 45 ॥

(జన్యుఁడు = తండ్రి, పనుపు = ఆజ్ఞ, విన్యాసము = చక్కని ప్రదర్శన, పినాకి = శివుడు, త్రుంచు = తునుకలు చేయు, ధన్యుడు = కృతకృత్యుడు, చెట్టపట్టు = పెండ్లాడు, దాణము = శుల్కము, తీరు = పరిష్కృతమగు)

తండ్రియైన జనక మహారాజు ఆజ్ఞతో మంచి ప్రదర్శనగా శివుని విల్లును త్రుంచగా కన్యారత్నమైన సీతను ధన్యుడనై పెండ్లాడగా శుల్కము తీరింది.

తే॥గీ॥ పరిణయమున పెద్దలు వధూవరుల వంశ
వివరములు ప్రకటించుట వేడుకయ్యె
యందు దుష్టులు సన్మార్గు లెంద రున్న,
యెట్టి దాఁపఱికము లేక యింటిపట్టు
సాఁగుట కది సముచితమే జగతి యందు... ॥ 46 ॥

(పరిణయము = పెండ్లి, వేడుక = కుతూహలము, దుష్టుడు = చెడ్డవాడు, సన్మార్గుడు = మంచి నడవడి కలవాడు, దాఁపఱికము = గోపనము, ఇంటిపట్టు = గృహస్థ ధర్మము, సాఁగు = ప్రవర్తిల్లు, సముచితము = యోగ్యమైనది, జగతి = లోకము)

బాలకాండము 70వ సర్గములో సీతారాముల వివాహ ప్రస్తావన సందర్భముగా వశిష్ఠుడు దశరథుని వంశవృక్షము గురించిన వివరాలు, శతానందుడు జనకుని వంశ వివరాలు అందరి ఎదుటా వెల్లడిస్తారు. అలా చెప్పేటప్పుడు, ఆ నాటి ఆచారం ప్రకారం వంశంలో ఉన్న లబ్ధప్రతిష్ఠుల గురించి

చెడు ప్రవర్తన గల వారి గురించి ఏమీ దాపరికం లేకుండా వివరించారు. ఉదాహరణకి, వశిష్ఠుడు చెప్పిన వివరాలలో రాజ్యభ్రష్టుడైన అసిత మహారాజు గురించి, అతని భార్యలలో ఒకతె తన సవతి గర్భము నష్ట మవ్వడానికి ఆమెకు విషం ఇవ్వడం గురించి, సగరుని పుత్రుల గురించి, ముఖ్యంగా కడు దుర్మార్గుడై నందున సగరుడు తన పుత్రుడైన అసమంజసుణ్ణి రాజ్యభ్రష్టుని చెయ్యడం, ఉన్నాయి. ఇక పద్యంలో ఏముందో చూద్దాము.

పెద్దలు వధూవరుల వంశ వివరాలు, వాళ్ళలో చెడ్డవారు మంచి నడవడి కల వారు ఎందరున్నా కూడ, పెళ్ళిలో వెల్లడి చెయ్యడం వేడుక అయ్యింది. ఎటువంటి దాంపటికము లేకుండా గృహస్థ ధర్మము లోకంలో ఉండడానికి అది యోగ్యమైనదే.

ఉ॥ నీ సహధర్మచారిణిగ నీడగ తోడుగ నన్ని వేళలన్
నా సుత సీత నిల్చునని నాకు ప్రమాణముఁ జేసె పెండ్లి నా
డా సువిదుండు సీత పిత, యా క్షణ మాదిగ నేటి దన్క వి
శ్వాసము మీర తాను నను భర్తగఁ బ్రేముడి మంచె సోదరా!...॥ 47 ॥

(సహధర్మచారిణి = భార్య, నీడ = ఛాయ, సుత = కుమార్తె, నిల్చు = నిలుచు, సువిదుడు = రాజు, పిత = తండ్రి, క్షణము = సమయము, ఆది = మొదలు, దన్క = వరకు, విశ్వాసము = నమ్మకము, మీరు = అతిశయించు, ప్రేముడి = అనురాగము, మంచు = గౌరవించు)

నీ భార్యగా తోడు నీడగా అన్ని వేళలా నా కుమార్తె నిలుస్తుందని సీత తండ్రి పెండ్లి నాడు నాకు ప్రమాణం చేశాడు. సోదరా! అప్పటి నుంచి నేటి వరకు నమ్మకము మీర ఆమె నన్ను భర్తగా అనురాగంతో గౌరవించింది.

కం॥ మనువు విశేష సమర్పణె,
మన సంస్కృతి కదియె యూంత, మమతకు నెలవై
మనుపు గృహస్థాశ్రమ లాం
ఛనమగు కలిమియును సప్తసంతానములన్... ॥ 48 ॥

(మనువు = పెండ్లి, విశేష = సంపూర్ణమైన, సమర్పణ = ఇచ్చుట, సంస్కృతి = నాగరికత, ఊంత = ఆధారము, మమత = నాది యను భావము, నెలవు = వాసస్థానము, మనుపు = వర్ధిల్లఁజేయు, గృహస్థాశ్రమం = దాంపత్య జీవితం, లాంఛనము = చిహ్నము, కలిమి = సంపద, సప్త సంతానములు = తటాకప్రతిష్ఠ ధననిక్షేపము అగ్రహారప్రతిష్ఠ దేవాలయప్రతిష్ఠ వనప్రతిష్ఠ ప్రబంధ నిర్మాణము సత్రప్రతిష్ఠ అనేవి)

పెండ్లి అంటే సంపూర్ణమైన సమర్పణ. మన నాగరికతకు అదియే ఆధారము. నాది యనే భావానికి వాసస్థానమై దాంపత్య జీవితానికి చిహ్నమైన సంపదను, మనిషి మరణించిన తరువాత కూడా ప్రపంచంలో గుర్తుంచుకోబడడానికి కారణమైన సప్త సంతానములను, వర్ధిల్లఁజేస్తుంది.

కం॥ ఎన్నో వివాహ వేడ్కలు
కన్నుల విందగునుఁ గాని, కౌతుక మిచ్చున్
కన్నార్పక వధువు వరుడు
కన్నులుఁ గలుపుట ముహూర్త కాలము నందున్... ॥ 49 ॥

(కౌతుకము = సంతోషము, ముహూర్తము = రెండు గడియలు అంటే 48 నిమిషాలు)

ఎన్నో వివాహ వేడుకలు కన్నులవిందుగా ఉంటాయి గానీ, 48 నిమిషాల లగ్న సమయంలో వధూవరులు కన్నార్పక కన్నులు కలపడం సంతోషము కలిగిస్తుంది.

కం॥ ఒడుదుడుకు వేళ లందున,
జడమతులను హెచ్చరించ జ్ఞప్తికి రాగా
పొడగన్న కనుల కాంతియె,
వడిగా సరిఁ ద్రోవఁ జూపి వగలను డుల్చున్... ॥ 50 ॥

(ఒడుదుడుకు = సంకటము, జడమతి = మందబుద్ధి గలవాఁడు, హెచ్చరించు = జాగ్రత చెప్పు, జ్ఞప్తి = జ్ఞాపకము, పొడగను = చూచు, వడి = వేగము, సరి = యుక్తము, త్రోవ = మార్గము, వగ = దుఃఖము, డుల్చు = దూరము చేయు)

సంకట సమయాలలో మందబుద్ధి గలవారిని హెచ్చరించడానికి, చూసిన కనుల కాంతియే జ్ఞాపకము రాగా వేగంగా సరియైన మార్గము చూపి దుఃఖము పోగొడుతుంది.

కం॥ నాలో కుజ కనుల వెలుగు
నీలోత్పల కాంతి వోలె నింపగ తాల్మిన్,
కాల పరీక్షకు నిలబడె
నా లోపలి ధర్మనిష్ఠ నాభీలములన్... ॥ 51 ॥

(కుజ = సీత, నీల = నల్లని, ఉత్పలము = కలువ, నింపు = నిండఁజేయు, తాల్మి = ధైర్యము, నాభీలము = కష్టము)

నాలో సీత కన్నుల వెలుగు నీలోత్పల ద్యుతి లాగా ధైర్యాన్ని నింపగా, నా లోపలి ధర్మనిష్ఠ కష్టాలలో కాల పరీక్షకి నిలిచింది.

కం॥ దైవ మిడిన సఖు డెవ్వరు?
జీవితమున భర్తఁ దక్క చింతనఁ జేయన్
దైవ మిడిన సఖి యెవ్వరు?
పావనియై మనసెరిగిన భార్యయెఁ గాదా... ॥ 52 ॥

(ఇడు = ఇచ్చు, సఖుఁడు = స్నేహితుఁడు, తక్క = తప్ప, చింతన = పలుమాఱు తలఁచుట, సఖి = స్నేహితురాలు, పావని = పవిత్రురాలు, ఎరుగు = తెలిసికొను)

పలుమాఱు ఆలోచిస్తే జీవితంలో భర్త తప్ప దేవు డిచ్చిన స్నేహితు డెవ్వరు? దేవు డిచ్చిన స్నేహితురాలు ఎవ్వరు? పవిత్రురాలై మనస్సు ఎరిగిన భార్యయే కాదా.

తే॥గీ॥ వప్రు డంగీకరించు సంబంధ మనుచు
సీత యన నాకు, తన పరిణేత ననుచు
నామెకుఁ, గల ప్రేమ దినదినాభివృద్ధిఁ
బొందె, రూప సద్గుణముల పొందు చేత... ॥ 53 ॥

(వప్రుడు = తండ్రి, పరిణేత = భర్త)

తండ్రి ఒప్పుకున్న సంబంధము కదా అని సీత అంటే నాకు, తన భర్తని కదా అని ఆమెకు, ఉన్న ప్రేమ, రూపము మంచి గుణాల కారణంగా దినదినాభివృద్ధి పొందింది.

శా॥ నమ్మన్ కార్యములందు చింతనయు, విన్నాణంబు, సౌందర్యమున్,
సమ్మోదమ్మగ సౌఖ్య మిచ్చుట విలాసమ్మన్న యుత్సేకమున్,
యమ్మన్ మించిన యాదరమ్ము, మలయమ్మందున్న స్త్రీత్వంబు, గా
రమ్మే, సీతకు యూఁత యైనవి మనోరాగమ్ము హెచ్చింపగన్...॥ 54 ॥

(నమ్ము = విశ్వసించు, చింతన = ఆలోచన, విన్నాణము = నేర్పు, సౌందర్యము = అందము, సమ్మోదము = సంతోషము, విలాసము = శృంగారము, ఉత్సేకము = గర్వము, ఆదరము = మన్నన, మలయమ్మ = పార్వతి, స్త్రీత్వము = ఆడుతనము, గారము = ప్రేమ, ఊతము = ఆధారము, మనోరాగము = మనస్సులో అనురాగము)

విశ్వసించడానికి కార్యాలలో ఆలోచించడం, నేర్పు, అందము, సంతోషంగా సుఖాన్ని ఇవ్వడం శృంగార మన్న గర్వము, అమ్మను మించిన ఆదరము, పార్వతీదేవి యందున్న ఆడుతనము, ప్రేమ, మనస్సులో అనురాగము పెంపుచేసుకోవడానికి సీతకు ఆధారమైనవి.

ఉ॥ తామస లక్షణాన్వితగు తాటకఁ ద్రుంచితి కౌశి కాజ్ఞచే,
బాములు పడ్డ గౌతముని భార్య యహల్య కదృశ్య రూపమున్
నోమి రజో గుణంబునకు నూతన సంస్కృతి నందఁజేసితిన్
బ్రేమను వార లేకమవ, పిమ్మట పెంపుగ సత్త్వ మూర్తియౌ
భూమిజఁ జెట్టపట్టితిని భూరి ధనుస్సు దళించి, యిట్లు నే
భామిని మూడు రూపముల భాజన మెంచి చరించిఁ జూపితిన్ ॥ 55 ॥

(తామస = దుష్ట, అన్విత = కూడుకొన్నది, త్రుంచు = చంపు, కౌశికుడు = విశ్వామిత్రుడు, బాము = కష్టము, అదృశ్య = కనిపించని, రూపము = ఆకారము,

నోము = పోఁగొట్టు, రజోగుణము = ప్రాపంచిక సౌఖ్యాలపై ఆసక్తి, సంస్కృతి = నాగరికత, ఏకమగు = ఒకటియగు, పిమ్మట = అనంతరము, పెంపు = అతిశయము, సత్త్వమూర్తి = సత్త్వగుణము మూర్తీభవించినది, భూమిజ = సీత, చెట్టపట్టు = పెండ్లాడు, భూరి = గొప్పది, ధనుస్సు = విల్లు, దళించు = విఱుచు, భామిని = స్త్రీ, భాజనము = యోగ్యము, ఎంచు = గణించు, చరించు = ప్రవర్తించు)

విశ్వామిత్రుని ఆజ్ఞతో తామస లక్షణాలు కూడుకొన్నదైన తాటకను చంపాను. కష్టాలు పడ్డ గౌతమ మహర్షి భార్య అహల్యకు అదృశ్యరూపాన్ని పోఁగొట్టి ప్రేమగా వారు ఒకటవడానికి రజోగుణానికి క్రొత్త నాగరికత అందజేశాను. అనంతరము, అట్టహాసంగా భూరి విల్లు విరిచి సత్త్వగుణము మూర్తీభవించినదైన సీతను పెండ్లాడాను. ఈ విధంగా, సత్త్వరజస్తమో గుణాలకు గుర్తుగా ఉన్న "స" "త" "ర" అక్షరాల కలయికతో ఏర్పడిన స్త్రీ మూడు రూపాలతో యోగ్యతను బట్టి ప్రవర్తించి చూపాను.

యువరాజు నియుక్తికి ప్రణాళిక:

తే॥గీ॥ నన్ను యువరాజుఁ జేయ మనమున యెంచి,
ప్రజల సమ్మతి చాల ప్రబర్హ మనుచు,
సంప్రతించెను మన తండ్రి సంప్రదాయ
పద్ధతిని, మంత్రులను ప్రజాప్రతినిధులను... ॥ 56 ॥

(మనము = మనస్సు, సమ్మతి = అంగీకారము, ప్రబర్హము = ముఖ్యము, సంప్రతించు = కలసి మాటలాడు, సంప్రదాయ పద్ధతి = గతంలో రూపకల్పన జరిగి అనుసరిస్తూ వస్తున్న విధానం, ప్రజాప్రతినిధి = ప్రజలకు బదులుగా వచ్చినవాడు)

నన్ను యువరాజును చెయ్యాలని మనస్సులో అనుకొని ప్రజల అంగీకారం ముఖ్యమంటూ మన తండ్రి సంప్రదాయ పద్ధతిలో మంత్రులను ప్రజాప్రతినిధులను సంప్రతించాడు.

కం॥ అందరి నాహ్వానించెడి
తొందరలో భరతు మఱచు దోషం బవ్వన్
కందిన మంథర కైకల
కందెను యవకాశ మపుడు యంకిలి పెట్టన్... **॥ 57 ॥**

(తొందర = తడబాటు, మఱచు = విస్మరించు, దోషము = తప్పు, కందు = కోపించు, అందు = దొరుకు, అవకాశము = వీలు, అంకిలి పెట్టు = అడ్డగించు)

అందరినీ ఆహ్వానించే తొందరలో భరతుణ్ణి మరచిపోయే తప్పు జరుగగా కోపించిన మంథర కైకలకు అడ్డగించడానికి అప్పుడు అవకాశం దొరికింది.

మ॥ తన సామంతుల, మంత్రులన్, ప్రముఖులన్, దర్బారునన్ బిల్చి, నా
యనుగుం బుత్రుడు రామునిన్, తమరు నా కంగీకృతిన్ దెల్పినన్,
మనుజేంద్రున్ వడిఁ జేతు నంచుఁ బలికెన్ మన్నీఁడు, వారంత మో
దనమున్ జాటుటఁ జూడ నా భరతు డా స్థానమ్మునన్ లేడుగా ॥ 58 ॥

(దర్బారు = రాజసభ, అనుగు = ప్రియమైన, పుత్రుడు = కుమారుడు, అంగీకృతి = అంగీకారము, మనుజేంద్రుడు = రాజు, వడి = వేగము, మన్నీఁడు = ప్రభువు, మోదనము = సంతోషము, చాటు = ప్రకటించు, స్థానము = ప్రదేశము [ఆస్థానము = రాజసభ])

తన సామంతులని మంత్రులని ముఖ్యమైన వాళ్ళని రాజసభకి పిలిచి మీరు అంగీకారము తెలిపితే నా ప్రియపుత్రుడైన రాముణ్ణి వేగంగా రాజుని చేస్తాను అని ప్రభువైన దశరథుడు అన్నాడు. అంతట వారు సంతోషము ప్రకటించడం చూడడానికి నా భరతుడు ఆ ప్రదేశంలో లేడుగా [రాజసభలో లేడుగా].

తే॥గీ॥ బుద్ధిని బృహస్పతి, క్షమను భూమి, హిముడు
సంతస మిడగ, వీఁకున శతమఖుఁడని,
సత్యసంధుఁడు, మృదుభాషి, జ్ఞాని, మాకు
యన్ని విధముల యోగ్యుఁడౌ మన్నియ యని,
పౌరులు ననుఁ బొగడ, వినెఁ బంక్తిరథుడు... **॥ 59 ॥**

(బుద్ధి = తెలివి తేటలు, క్షమ = ఓర్పు, హిముడు = చంద్రుడు, ఇడు = ఇచ్చు, వీఁకు = శౌర్యము, శతమఖుఁడు = దేవేంద్రుఁడు, సత్యసంధుఁడు = సత్యము పలుకువాఁడు, మృదుభాషి = మెత్తగా మాట్లాడు వాడు, జ్ఞాని = జ్ఞానము కలవాఁడు, యోగ్యుఁడు = అర్హుఁడు, మన్నియ = ప్రభువు, పౌరులు = పురజనులు, పొగడు = స్తుతించు, పంక్తిరథుడు = దశరథుడు)

తెలివి తేటలలో బృహస్పతి, ఓర్పున భూదేవి, సంతోషం ఇవ్వడంలో చంద్రుడు, శౌర్యంలో ఇంద్రుడు, సత్యము పలుకువాఁడు, మృదుభాషి, జ్ఞాని, మాకు అన్ని విధాల తగిన వాడైన ప్రభువు అని పురజనులు నన్ను పొగడగా దశరథుడు విన్నాడు.

కం॥ సభ లోని వార లందరు
విభుఁనిగ ననుఁ జేయు మంచు విదిత మొనర్చన్,
ప్రభువే నను మరల పిలిచి
యభయమ్మును నేర్పఁ దెలిపె నపశకునంబుల్... ॥ 60 ॥

(విభుఁడు = ప్రభువు, విదితము = తెలియబడినది, ఒనర్చు = చేయు, మరల = మళ్ళీ, అభయము = రక్షణము, అపశకునము = కీడును సూచించు నిమిత్తము)

సభలో ఉన్న వాళ్ళందరు నన్ను రాజును చేయమని తెలియజేయగా దశరథ మహారాజు నన్ను మళ్ళీ పిలిచి రక్షణ గురించి నేర్పడానికి దుశ్శకునాలు తెలిపాడు.

కం॥ వేగులు తెచ్చిన వార్తలు
యోగితముగ వ్యవహరించు యుక్తులుఁ దెలుపన్
సాగెను నాతో, భరతుని
ధీగుణము మరచినఁ దండ్రిఁ దెఱకువ పలుకుల్... ॥ 61 ॥

(వేగు = గూఢచారి, ఓగితము = యుక్తము, యుక్తి = ఉపాయము, సాగు = జరుగు, ధీగుణము = బుద్ధి కుశలత, తెఱకువ = ఉపాయము)

భరతుని సుగుణము మరచిన తండ్రి ఉపాయపు మాటలు, వేగుల వార్తలు, తగిన విధంగా వ్యవహరించే యుక్తులు చెప్పడం కోసం సాగింది నాతో.

మ॥ అగుపించన్ పలు దుర్నిమిత్తములు నా కాపత్తు సూచించుచున్,
రగిలెన్ నా మది, సత్వరంబుగను నీ రాజ్యాభిషేకంబుఁ జే
యగఁ దోచెన్ భరతుండు రాక మునుపే నంచున్ గడున్ భీతిమై,
నిగుడించెన్ మన తండ్రి, కారణములన్ నీ వైన నూహించుమా...॥62॥

(అగుపించు = కనిపించు, పలు = అనేకము, దుర్నిమిత్తము = దుశ్శకునము, ఆపత్తు = ఆపద, సూచించు = జాడగా తెలియజేయు, రగులు = మంట యెత్తు, మది = మనస్సు, సత్వరము = త్వరితము, తోచు = భావముదయించు, మునుపు = ముందు, కడు = మిక్కిలి, భీతి = భయము, నిగుడించు = వెలువరించు, ఊహించు = అంచనావేయు)

నాకు ఆపద సూచిస్తూ చాలా దుశ్శకునములు కనిపించగా నా మనస్సు రగిలింది. భరతుడు రాక ముందే, త్వరగా నీ రాజ్యాభిషేకము చెయ్యాలని అనిపిస్తోంది అని అంటూ మన తండ్రి చాలా భయంగా వెలువరించాడు. కారణాలు నువ్వైనా ఊహించు.

మంథర కైకల ప్రణాళిక:

మ॥ ననుఁ జేయన్ యువరాజుగా లగనమున్ నాయండుఁ బెట్టించగా,
జన సందోహము సంబరంబుఁ సలిపెన్ సంకల్ప మీడేరగన్,
గని యా వేడుక లన్ని మంథర వడిన్ కైకేయికిన్ జెప్పి గా
థను మార్చున్ మన తండ్రి కైక కిడు ప్రాధాన్యంబు శూన్యం బనెన్...॥63॥

(లగనము = ముహూర్తము, నాయడు = ప్రభువు, సందోహము = సమూహము, సంబరము = వేడుక, చలుపు = చేయు, సంకల్పము = మనోనిశ్చయము, ఈడేరు = నెరవేరు, కను = చూచు, వడి = వేగము, గాథ = చరిత్రము, ఇడు = ఇచ్చు, ప్రాధాన్యము = ముఖ్యత, శూన్యము = లేమి)

నన్ను యువరాజుగా చెయ్యడానికి ప్రభువు ముహూర్తము పెట్టించగా జన సమూహము సంకల్పము నెరవేరడం చేత వేడుకలు చేసింది. ఆ వేడుకలన్నీ

చూసి వేగంగా మంధర కైకేయికి చెప్పి చరిత్ర మార్చడానికి మన తండ్రి కైకకు ఇచ్చే ప్రాధాన్యము శూన్యము అని అంది.

చం॥ నిరతము రాముడున్ యతని నీతియు సంతతి రాజ్య మేలగన్,
భరతుడు నీవు మీ వలని వారసు లందరు దాసు లౌదురా?
భరతునకున్ ప్రమాద మనఁ బట్టదు నీ కిపు డెంతఁ జెప్పినన్,
త్వరపడు మంచు మంథర యుపాయము నేర్పెను కైక మాతకున్... ॥64॥

(నిరతము = ఎల్లప్పుడు, నీతి = న్యాయము, సంతతి = సంతానము, ఏలు = పాలించు)

ఎల్లప్పుడు శ్రీరాముడు, అతని న్యాయము, సంతానము రాజ్యము ఏలుతూ ఉంటే భరతుడు, నువ్వు, మీ వల్ల వారసులు – అందరూ దాసు లౌతారా? భరతుడికి ప్రమాదమని నీకు ఇప్పుడు ఎంత చెప్పినా పట్టదు, త్వరపడు అంటూ మంధర కైకకు ఉపాయము చెప్పింది.

తే॥గీ॥ పెక్కురు కుటిలత్వ మనిరి, పెక్కు రీస
డించి రార్తిని మంథర నెంచిఁ, గాని
వట్టి మాటలా యామెవి? గట్టి వనుచు,
నేను నాఁడె గ్రహించితి నిశ్చయముగ... ॥ 65 ॥

(పెక్కురు = అనేకులు, కుటిలత్వము = కపటము, ఈసడించు = అసహ్యించుకొను, ఆర్తి = బాధ, ఎంచు = తలఁచు, వట్టి = ప్రయోజనము లేనిది, నాఁడు = ఆ కాలము, నిశ్చయము = తప్పక కలుగుట)

మంధరని తలచి అనేకులు కపటము అన్నారు, అనేకులు బాధతో అసహ్యించుకున్నారు. కానీ వట్టి మాటాలా ఆమెవి గట్టివని నేను ఆ కాలంలోనే నిజంగా గ్రహించాను.

ఉ॥ రాముని సంతతే సతము రాజ్యము నేలుదు రన్న మాటయే
నా మది నొవ్వజేయగ, యనంతర మా నుడి కల్లఁ జేయ యీ

రాముని భ్రాతఁ బుత్రులను రాజులఁ జేసితి నీదు యండతో
క్షేమముగా ప్రజన్ నిలుపు శ్రేష్ఠ ప్రభుత్వము లిచ్చు నిచ్ఛతో.. ॥ 66 ॥

(సంతతి = సంతానము, సతము = ఎల్లప్పుడు, మది = మనస్సు, నొవ్వజేయు = బాధించు, అనంతరము = పిమ్మట, నుడి = మాట, కల్ల = అబద్ధము, భ్రాత = సోదరుడు, ఆత్మజుఁడు = పుత్రుఁడు, అండ = ఆధారము, క్షేమము = కుశలము, శ్రేష్ఠ = ప్రశస్తమైన, ఇచ్ఛ = వాంఛ)

రాముని సంతానమే ఎప్పుడూ రాజ్యం ఏలుతారు అన్న మాటే నా మనస్సును బాధించగా, అనంతరము ఆ మాట అబద్ధము చెయ్యడానికి క్షేమంగా ప్రజలను ఉంచే ప్రశస్తమైన ప్రభుత్వము ఇచ్చే కోరికతో నీ అండతో ఈ రాముని తమ్ముని పుత్రులను రాజులను చేశాను.

చం॥ శరణను వారి కిచ్చితిని శత్రువు బందుగు లైన రక్షణన్,
యరిఁ బరిమార్చి రాజ్యమున యాక్రమణం బొనరింపఁ గల్గియున్
భరువుగఁ జేసితిన్ యతని వారసు, నా కెది రాజ్యకాంక్ష? సో
దరుల కుమారు లందర యథావిధి నంపితి రాజ్య మిచ్చి, యే
మరకుము లక్ష్మణా! చరిత, మంథర మాటలుఁ గల్లఁ జేసితిన్ ॥ 67 ॥

(బందుగు = బంధువు, అరి = శత్రువు, పరిమార్చు = చంపు, ఆక్రమణ = దౌర్జన్యంగా తమ స్వాధీనంలోకి తెచ్చుకోవటం, ఒనరించు = చేయు, భరువు = రాజు, ఎది = ఏది, యథావిధి = శాస్త్రము ననుసరించి, అంపు = పంపు, ఏమరు = మఱచు, చరిత = చరిత్ర, కల్ల = అబద్ధము)

శరణన్న వారు శత్రువు బంధువులైనా రక్షణ ఇచ్చాను. శత్రువును చంపి రాజ్యాన్ని ఆక్రమించ గలిగి కూడా అతని వారసుని రాజును చేశాను. నాకేది రాజ్యకాంక్ష? తమ్ముల కుమారుల నందరినీ యథావిధి రాజ్య మిచ్చి పంపాను. చరిత్ర మరువకు లక్ష్మణా! మంథర మాటలు అబద్ధము చేశాను.

కం॥ ఎక్కువగ నెవ్వ రిష్టమొ
యెక్కుడుగా వారి వలన యిడుముడిఁ గనుకన్,

పెక్కురు భార్యలు యున్నను
దక్కెను కైకేయి కతన దశరథుకు వెతల్... **॥ 68 ॥**

(ఎక్కుడు = అధికము, ఇడుముడి = కష్టము, పెక్కురు = అనేకులు, దక్కు = లభించు, కతన = కారణముచేత, వెత = బాధ)

ఎక్కువగా ఎవరంటే ఇష్టమో అధికంగా వాళ్ళ వల్లే కష్టము కనుక, పెక్కు మంది భార్యలు ఉన్నా కైకేయి కారణంగా దశరథునికి బాధలు దక్కాయి.

కం॥ కోపగృహంబున కైకకు
తాపము తగ్గించ కామతాప వశుండై,
యా పడఁతుక నడుగు మనెన్
నాపై తా నొట్టు పెట్టి నరపతి, వరమున్... **॥ 69 ॥**

(కోపగృహం = స్త్రీలు కోపము వచ్చినపుడు ఉండు ప్రత్యేక గృహము, తాపము = బాధ, పడఁతుక = స్త్రీ, నరపతి = రాజు)

కోపగృహంలో ఉన్న కైకకు బాధ తగ్గించడానికి నామీద ఒట్టుపెట్టి రాజైన దశరథుడు వరము అడగమని అన్నాడు.

చం॥ వెరవున యుత్సవంబునకు విఘ్నముఁ జేయు మటంచుఁ జెప్పి మం
థరఁ గడు నార్తిమై తనకు తంత్రము నేర్పగ, కైకఁ గ్రక్కునన్
వరములు రెండుఁ గోరి యటు వర్తిలఁ జేయగఁ జెప్పి రాజుకున్
భరతుని రాజుఁ జేయ తన పాచిక వేసెను చాల నేర్పుగన్... **॥ 70 ॥**

(వెరవు = ఉపాయము, ఉత్సవము = సంబరము, విఘ్నము = ఆటంకము, కదు = మిక్కిలి, ఆర్తి = బాధ, తంత్రము = ఉపాయము, క్రక్కునన్ = తటాలున, వర్తిలు = వర్తించు, పాచికవేయు = ఎత్తులు పన్ను, నేర్పు = చాతుర్యము)

ఉపాయంతో ఉత్సవానికి ఆటంకము కలిగించమని చెప్పి మంధర మిక్కిలి బాధతో తనకు తంత్రము నేర్పగా కైక వెంటనే రెండు వరాలు కోరి ఆ విధంగా

వర్తింపజేయమని రాజుకు చెప్పి భరతుణ్ణి రాజును చేయడానికి తన పాచిక చాలా చాతుర్యంతో వేసింది.

చం॥ అరువది వేల యేండ్లిట ధరాధిపు యింటను సంతు లేదు, వా
రెరుగరు గద్దెఁ బొందుటకు యేలిక పుత్రులుఁ బోరుటన్న, మం
థర వలనన్ బయల్పడిన దారుణ మీ విషయంబు తొల్లి, యీ
యరుదగు సంగతిన్ దెలిపి నంతట కైక భ్రమించెఁ గ్రక్కునన్... ॥ 71 ॥

(ఇట = ఇక్కడ, ధరాధిపుడు = రాజు, సంతు = సంతానము, ఎరుగు = గ్రహించు, గద్దె = సింహాసనము, పొందు = ప్రాపించు, ఏలిక = రాజు, పుత్రుడు = కుమారుడు, పోరు = కలహించు, బయల్పడు = ప్రకాశితమగు, దారుణము = భయంకరము, తొల్లి = మొదటిది, అరుదు = దుష్కరము, సంగతి = వ్యవహారము, భ్రమించు = అపోహపడు, క్రక్కునన్ = తటాలున)

అరవై వేల ఏళ్ళుగా ఇక్కడ రాజుగారి ఇంటిలో సంతానం లేదు. సింహాసనం పొందడానికి రాజకుమారులు కలహించడం అన్నది వాళ్ళు ఎరుగరు. మొదటిసారిగా మంథర వల్ల బయటపడ్డ దారుణము ఈ విషయము. ఈ అరుదైన సంగతి తెలియజేయగానే కైక తటాలున భ్రమించింది.

తే॥గీ॥ భరతు యువరాజుఁ జేయుట ప్రథమ వరము,
రాముడు మునియై యడవి నల్లాడుచు పదు
నాలుగేండ్లు వసించుట నాదు రెండ
వ వరమని, కైక యచ్చెరువాటు నిచ్చె... ॥ 72 ॥

(ప్రథమ = మొదటిది, అల్లాడు = తిరుగు, వసించు = నివసించు, అచ్చెరువాటు = ఆశ్చర్యము)

భరతుణ్ణి యువరాజును చేయడం మొదటి వరము, రాముడు మునిగా అడవిలో తిరుగుతూ 14 ఏళ్ళు నివసించడం నా రెండవ వరము, అని కైక ఆశ్చర్యాన్ని ఇచ్చింది.

కం॥ వరపుత్రు డడవి కెళ్ళిన
మరణము తథ్యంబు నాకు, మరలించవె నీ
వరములని దశరథు డనన్
పరితాపముఁ జెంది కైక పట్టు బిగించెన్... ॥ 73 ॥

(వరపుత్రుడు = శ్రేష్ఠుఁడైన కుమారుడు, తథ్యము = సత్యము, మరలించు = ఉపసంహరించు, పరితాపము = సంతాపము, పట్టు = పట్టుదల, బిగించు = దృఢం చేయు)

ప్రియ పుత్రుడు అడవికి వెళితే నాకు చావు నిశ్చయము, నీ వరములు వెనక్కి తీసుకోవే అని దశరథుడు అనగా కైక సంతాపము చెంది పట్టుదల దృఢం చేసింది.

ఉ॥ రాముని సర్వసమ్మతిని రాజునుఁ జేసెద నంటి కొల్వునన్,
రామునిఁ గాన కంపుట వరమ్ముగ నంతిపురిన్ స్వపత్నికిన్
శేముషి యున్న వ్యక్తి యెటుఁ జెప్పును, యేమగు సత్యనిష్ఠకున్?
యోముము నన్ను కైక! యని యూఢను పంక్తిరథుండు వేడగన్ ॥ 74 ॥

(సర్వసమ్మతి = అందరి అంగీకారము, కొల్వు = ఆస్థానము, కాన = అడవి, అంపు = పంపు, అంతిపురి = అంతఃపురము, స్వపత్ని = స్వంత భార్య, శేముషి = బుద్ధి, ఎటు = ఎట్లు, సత్యనిష్ఠ = సత్యవ్రతము, ఓము = రక్షించు, ఊఢ = పెండ్లాము, పంక్తిరథుడు = దశరథుఁడు, వేడు = ప్రార్థించు)

అందరి అంగీకారంతో రాముణ్ణి రాజును చేస్తానని కొలువులో అన్నాను. రాముణ్ణి అడవికి పంపుట వరంగా అంతఃపురంలో స్వంత భార్యకు బుద్ధి ఉన్న వ్యక్తి ఎట్లా చెబుతాడు? సత్యవ్రతము ఎటు పోతుంది? కైకా! నన్ను రక్షించు అని దశరథుడు భార్యను ప్రార్థించగా (ముందరి పద్యంతో అన్వయము).

తే॥గీ॥ వరము లీడేర వనినచో మరణమే శ
రణ్య మనె కైక, తనపై భరతుని పైన
యొట్టుపెట్టి, నృపతి యామె కొగ్గి దుల్లి
గిలగిల మని కొట్టుకొని శోకించె వృథగ... ॥ 75 ॥

(ఈడేరు = నెరవేరు, శరణ్యము = శరణు పొందఁదగినది, ఒట్టుపెట్టు = శపథము చెయ్యడం, నృపతి = రాజు, ఒగ్గు = వశమగు, డుల్లు = కూలు, గిలగిల = బాధను తెలిపే ధ్వని, శోకించు = దుఃఖించు, వృథ = వ్యర్థము)

తన పైన భరతుని పైన ఒట్టుపెట్టి వరములు నెరవేరవు అంటే చావే శరణ్యము అని కైక అంది. రాజు ఆమెకు వశమై కూలి గిలగిల కొట్టుకొని వృథాగా శోకించాడు.

కం॥ పరులను రక్షించుటకై
గరళము మ్రింగిన మహేశు గాథ యటుండన్
పరులను నమ్మించుటకై
పరిపాటయె యొట్టుగొనుట స్వజనంబులపై... ॥ 76 ॥

(పరుడు = అన్యుడు, గరళము = విషము, మహేశుడు = శివుడు, గాథ = చరిత్ర, పరిపాటి = నియమితపద్ధతి, ఒట్టుగొను = ఒట్టు పెట్టుకొను, స్వజనము = పరివారము)

ఇతరులను రక్షించడానికి విషం మ్రింగిన శివుని చరిత్ర అటుంచి ఇతరులను నమ్మించడానికి పరివారం మీద ఒట్టుపెట్టడం పరిపాటి అయ్యింది.

కం॥ పరుల బలహీనత యనిన
పరితుష్టియె యేరి కైన, పరుల బలమ్మున్
పిరపడుదురె? కైకఁ గనెను
ధరణీశుఁని సత్యనిష్ఠ దౌర్బల్యముగా... ॥ 77 ॥

(పరులు = ఇతరులు, పరితుష్టి = మిక్కిలి సంతోషము, ఏరు = ఎవరు, పిరపడు = ఇష్టపడు, కను = చూచు, ధరణీశుఁడు = రాజు, సత్యనిష్ఠ = సత్యవ్రతము, దౌర్బల్యము = బలహీనత)

ఇతరుల బలహీనత అంటే ఎవరికైనా చాలా సంతోషమే. ఇతరుల బలాన్ని ఇష్టపడతారా? రాజు సత్యవ్రతాన్ని కైక బలహీనతగా చూసింది.

కం॥ వరముల వలలో దశరథుఁ
గరచరణము లాడకుండఁ గట్టిన కైకన్
గరుణనుఁ జూపుమని మహీ
శ్వరు డామెను యభిలషించిఁ జరణము లంటెన్... ॥ 78 ॥

(కరచరణములు = కాళ్ళు చేతులు, కరుణ = దయ, మహీశ్వరుడు = రాజు, అభిలషించు = కోరు, చరణము = పాదము)

వరముల వలలో దశరథుని కాళ్ళు చేతులు ఆడకుండా కట్టిన కైకేయిని దయ చూపించమని రాజు ఆమెను కోరి పాదాలంటాడు.

ఉ॥ నా పయి నెక్కుడున్ మమత నాటక మంచన లేను కైకకున్
యీ పరిణామముల్ గనగ, యిచ్ఛగ కైక వరమ్ములన్ గొనెన్,
పాపముఁ గాదు యీ సుతునిఁ బ్రాంతర మందున నుండు మంట, దై
వోపహతుండ నేను, యిట బుద్ధిని లోపము లేదు కైకకున్... ॥ 79 ॥

(ఎక్కుడు = అధికము, మమత = అభిమానము, నాటకము = కపటోపాయము, పరిణామము = మార్పు, కను = చూచు, ఇచ్ఛ = కోరిక, కొను = తీసికొను, ప్రాంతరము = అడవి, దైవోపహతుడు = దైవముచే కొట్టబడినవాడు, బుద్ధి = తెలివి)

ఈ మార్పులు చూడగా కైకకు నా మీద ఉన్న ఎక్కువ అభిమానం కపటోపాయము అని అనలేను. కైక ఇష్టపడి ఈ వరాలు తీసుకుంది. ఈ పుత్రుని అడవిలో ఉండమని చెప్పడం పాపం కాదు. దైవోపహతుడను నేను. ఇందులో కైకకు తెలివి తక్కువతనం లేదు.

తే॥గీ॥ మూడు వందల యాబది చేడెలు సతు
లైన హెచ్చుతగ్గుల రచ్చ యనిశ ముండు,
సంతు కధికార మివ్వగ సతులుఁ బోరు,
యొకరి వరములు యేఁచు మరొకరిని, యిట
భాగ్యవశమున యిర్వురే బాధ్యులైరి... ॥ 80 ॥

(చేడె = వనిత, సతి = భార్య, హెచ్చుతగ్గులు = ఎక్కువ తక్కువలు, రచ్చ = కలహము, అనిశము = ఎల్లప్పుడును, సంతు = సంతానము, పోరు = కలహించు, ఏఁచు = బాధించు, ఇట = ఇక్కడ, భాగ్యము = అదృష్టము, బాధ్యుడు = పూచీ తీసికొను వ్యక్తి)

350 మంది వనితలు భార్యలుగా ఉంటే ఎక్కువ తక్కువల రచ్చ ఎప్పుడూ ఉంటుంది. సంతానానికి అధికారము ఇవ్వమని భార్యలు కలహిస్తారు. ఒకరి వరములు మరొకరిని బాధిస్తాయి. ఇక్కడ అదృష్టం కొద్దీ ఇద్దరే బాధ్య లయ్యారు.

తే॥గీ॥ వరముల మిషతో రాజ్యము భరతు పరముఁ
జేయ కైక, యనుభవించి యీయఁ బరులు
రాజ్యమును స్వీకరించునా రాము డనుచు
మాత, యెవరి యాస్తి కొరకు యీ తగవులు?... ॥ 81 ॥

(మిష = వంక, పరము చేయు = అప్పగించు, అనుభవించు = సుఖదుఃఖాదుల నొందు, పరులు = ఇతరులు, తగవు = జగడము)

వరముల వంకతో రాజ్యము భరతునికి అప్పగించాలని కైక, ఇతరులు అనుభవించి ఇస్తే రాజ్యాన్ని రాముడు స్వీకరిస్తాడా అని కౌసల్యామాత, ఎవరి ఆస్తి కోసం ఈ జగడాలు?

మ॥ తన రాజ్యంబును స్వంత యాస్తి వలె, స్నిగ్ధత్వమ్మునన్ దోఁచు తీ
రున నెవ్వారల కైన నిచ్చుటలు, కారుణ్యంబు లోపించినన్
తన కిష్టుల్ తనుఁ గోరగా నొకరి బాధల్ పెట్టుటల్, రాజుకున్
యనయం బంచు నెరింగి కూడ, తన కామాంధత్వమున్ జూపుచున్,
జన విచ్చెన్ యధిపుండు కైకకును, ప్రాజాపత్యమున్ వీడుచున్ ॥ 82 ॥

(స్నిగ్ధత్వము = చెలిమి, తోఁచు = మనసున ఏర్పడు, తీరు = విధము, ఎవ్వారలు = ఏ మనుష్యులు, కారుణ్యము = దయ, లోపించు = తక్కువపడు, అనయము = అవినీతి, ఎరుగు = తెలియు, చనవు = చెల్లుబడి, అధిపుడు = ప్రభువు, ప్రాజాపత్యము = అధికారము, వీడు = త్యజించు)

తన రాజ్యాన్ని స్వంత ఆస్తి లాగా చెలిమిని తోచిన విధంగా ఎవరికైనా ఇవ్వడాలు, దయ తక్కువైతే తనకి ఇష్టమైన వారు కోరారని ఒకళ్ళని బాధ పెట్టడాలు రాజుకు అవినీతి అని తెలిసి కూడా తన కామం చేత కలిగిన అంధకారాన్ని చూపిస్తూ అధికారము త్యజించి రాజు కైకకు చనవు ఇచ్చాడు.

తే॥గీ॥ రాజ్యమన స్వంత యాస్తిగా భోజ్య మనుట
రాజ ధర్మ మసలుఁ గాదు, రాజు తానె
ప్రథమ సేవకుడ ననుచు ప్రజల మతముఁ
దెలిసి పరిపాలనముఁ జేయు తీరు, ధాత్రి
నుత్త మంబగు ధర్మమై యుపకరించు... ॥ 83 ॥

(భోజ్యము = భుజింపఁదగినది, ప్రథమ = మొదటి, మతము = అభిప్రాయము, తీరు = విధము, ధాత్రి = భూమి, ఉపకరించు = ఉపయోగించు)

రాజ్యం అంటే స్వంత ఆస్తిగా భోజ్యము అనడం రాజధర్మము ఏ మాత్రం కాదు. రాజు తానే మొదటి సేవకుడను అంటూ ప్రజల అభిప్రాయం తెలిసి పరిపాలనము చేసే విధానము ఇలలో ఉత్తమమైన ధర్మంగా ఉపకరిస్తుంది.

చం॥ నిజముగఁ దెల్పుడీ తమరి నిశ్చయ మంచు సభాసదుల్ వినన్
ప్రజలుఁ గనంగఁ బల్కెను నృపాలుడుఁ, గాని తుదన్ వరంబులే
నిజమనిఁ దేల్చె, నే నిటుల నీమముఁ దప్పితినా వచించుమా,
కుజను త్యజించితిన్ ప్రజలుఁ గోరిన రీతిని, నిల్ప ధర్మమున్...॥ 84 ॥

(సభాసదులు = సభ యందలి వారు, కను = చూచు, పల్కు = మాటాడు, నృపాలుడు = రాజు, తుద = చివర, తేల్చు = పరిష్కరించు, ఇటుల = ఈ ప్రకారముగ, నీమము = నియమము, వచించు = చెప్పు, కుజ = సీత, త్యజించు = విడిచిపెట్టు, రీతి = విధము, నిల్పు = నిలుపు)

నిజంగా మీ నిర్ణయము తెలపండి అంటూ రాజు సభికులు వింటుండంగా ప్రజలు చూస్తుండంగా అన్నాడు. కానీ, చివరలో వరాలే నిజము అని తేల్చాడు.

నేను ఈ ప్రకారంగా నియమము తప్పానా, చెప్పు. ధర్మము నిలపడానికి ప్రజలు కోరిన విధంగా సీతను విడిచిపెట్టాను.

సీతారామలక్ష్మణులు వనవాసానికి ప్రయాణము:

కం॥ మన తండ్రి నన్నుఁ బిలచియు,
మనమున తన కేల యంత మల్లడియోఁ దె
ల్పని కారణమున, కైకయె
తన వరములఁ గూర్చిఁ జెప్పె, దశరథుడుఁ గనన్... ॥ 85 ॥

(మనము = మనస్సు, మల్లడి = పరితాపము, కను = చూచు)

మన తండ్రియైన దశరథుడు నన్ను పిలిచి కూడా మనస్సులో తనకు పరితాపము ఎందుకో తెలుపని కారణమున, కైకయే తన వరముల గురించి దశరథుడు చూస్తూ ఉండగా చెప్పింది.

ఉ॥ దాపున నున్న కైక వరదానముఁ గూర్చి వచింప నాకు, ని
ష్టాపము లోన నాపుకొని శాంతముగా ప్రణమిల్లి యానతిన్
యోపున నాచరింతు నని యొట్టిడితిన్, పితృవాక్య పాలకుం
డీ పురుషుం డటంచు ధర నెన్నికఁ బొందితి నెట్టి వాక్యమున్
నా పితరుండుఁ జెప్పకనె, నా కిది వింతగఁ దోచె లక్ష్మణా!... ॥ 86 ॥

(దాపు = సమీపము, కూర్చి = గురించి, వచించు = చెప్పు, నిష్టాపము = దుఃఖము, ఆపు = నిరోధించు, ప్రణమిల్లు = నమస్కారముచేయు, ఆనతి = ఆజ్ఞ, ఓపు = సహనము, ఆచరించు = పాటించు, ఒట్టు = శపథము, ఇడు = పెట్టు, పాలకుడు = పాలించువాఁడు, ధర = భూమి, ఎన్నిక = కీర్తి, పొందు = అందుకొను, తోచు = మనసున ఏర్పడు)

దగ్గరలో ఉన్న కైక వరదానము గురించి నాకు చెప్పగా, దుఃఖాన్ని లోపలే దాచుకొని శాంతంగా నమస్కారం చేసి ఆజ్ఞను సహనముతో ఆచరిస్తానని ఒట్టు పెట్టాను. ఏ వాక్యమూ నా తండ్రి చెప్పక పోయినా కూడా పితృవాక్య పరిపాలకుడు

ఈ పురుషుడు అన్న కీర్తిని అందుకున్నాను. నాకు ఇది వింతగా అనిపించింది, లక్ష్మణా!

మ॥ అధిపుం డొల్లమిచూపగా సవతులం దారాధ్యనా? రాజుకున్
యధివిన్నం గని నంత మండు నొడ లత్యం తాగ్రహో దగ్రతన్,
విధియే కైకగ రాముఁ గానలకు పంపించంగ, రాజ్యంబు నే
కధనుం డేలగ నిశ్చయించె ననుచున్, కౌసల్యఁ గుందెన్ యటన్ ॥ 87 ॥

(అధిపుడు = రాజు, ఒల్లమిచూపు = అనిష్టమును గనఁబఱచు, ఆరాధ్య = పూజింప తగినది, అధివిన్న = మొదటి పెండ్లాము, కను = చూచు, అంత = అప్పుడు, మండు = జ్వలించు, ఒడలు = శరీరము, అత్యంత = చాలా అధికమైన, ఆగ్రహ = కోపము, ఉదగ్రత = ఉద్ధతి, విధి = విధాత, కాన = అడవి, పంపించు = పంపు, ఏకధనుడు = జ్ఞాతి, కుందు = దుఃఖించు, అట = అక్కడ)

రాజు అనిష్టముఁ గనఁబఱచగా సవతుల్లో పూజ్యనా? పెద్ద భార్యను చూడగానే రాజుకు అధికమైన కోపోద్ధతితో ఒళ్ళు మండిపోతుంది. విధాతయే కైకగా రాముణ్ణి అడవులకు పంపించడానికి రాజ్యము జ్ఞాతి ఏలడానికి నిశ్చయించాడని కౌసల్య అక్కడ దుఃఖించింది.

కం॥ అడవికి పోవుటకై సెల
వడుగ, విశల్యకరణి నిడి యభిమంత్రించెన్
విడుచుచు కౌసల్య జనని,
పడవను యీ యోషధి నను బ్రతికించెఁ గదా!.. ॥ 88 ॥

(సెలవు = ఆజ్ఞ, విశల్యకరణి = శరీరమున నాఁటిన ములుకుల నూడఁజేయు నొకవిధమైన యోషధి, ఇడు = ఇచ్చు, అభిమంత్రించు = మంత్రముచే సంస్కరించు, విడుచు = విడిచిపెట్టు, జనని = మాత, పడవ = యుద్ధము)

అడవికి వెళ్ళడానికి ఆజ్ఞ కోరగా, కౌసల్య మాత విడిచి పెడుతూ విశల్యకరణి ఇచ్చి మంత్రంతో సంస్కరించింది. యుద్ధంలో ఈ ఓషధి నన్ను బ్రతికించింది కదా.

తే॥గీ॥ నార చీర ధరించుట నాకు రాదు
యనగ సీత, యామె కపుడు యంద రెదుటె
పట్టు చీర పైననె నార బట్టఁ గట్టి
నేనె సిద్ధ పరచితి, వనికి సరించ... ॥ 89 ॥

(బట్ట = వస్త్రము, కట్టు = ధరించు, వని = అడవి, సరించు = వెళ్ళు)

నార చీర ధరించడం నాకు రాదు అని సీత అనగా, ఆమెకు అప్పుడు అందరి ఎదురుగానే పట్టుచీర పైనే నార వస్త్రము ధరింపజేసి నేనే అడవికి వెళ్ళడానికి సిద్ధం చేశాను.

కం॥ ఇక్కట్లుండును యడవిని
స్రుక్కెద వమ్మా యటంచు సుద్దులుఁ జెప్పన్
పెక్కురు నేనును, కుజ యవి
ప్రక్కనఁబెట్టి యిటు లిచ్చె ప్రత్యుత్తరమున్... ॥ 90 ॥

(ఇక్కట్లు = అపాయము, స్రుక్కు = దుఃఖించు, సుద్దులు = మంచి మాటలు, పెక్కురు = అనేకులు, కుజ = సీత, ప్రక్కనఁబెట్టు = పట్టించుకొనకుండు, ప్రత్యుత్తరము = జవాబు)

అడవిలో అపాయాలు ఉంటాయి, దుఃఖిస్తావమ్మా అంటూ అనేకులు, నేను మంచి మాటలు చెప్పగా అవి పట్టించుకోకుండా సీత ఈ విధంగా జవాబు ఇచ్చింది.

కం॥ నీ వంటి వీర పురుషుడుఁ
గావగ కష్టం బటంచుఁ, గానకు ననుఁ గొం
పోవక యుండిన, నీదు స్వ
భావము స్త్రీదని, జనకుడు భావించుఁ గదా!.. ॥ 91 ॥

(కాయు = రక్షించు, కాన = అడవి, కొంపోవు = తీసికొనిపోవు, స్వభావము = సహజమైన గుణము, జనకుడు = తండ్రియైన జనక మహారాజు, భావించు = అనుకొను)

నీ లాంటి వీరపురుషుడు రక్షించడం కష్టం అంటూ అడవికి నన్ను తీసికొని పోకుండా ఉంటే నీ స్వభావము స్త్రీది అని నా తండ్రియైన జనక మహారాజు అనుకుంటాడు కదా.

కం॥ నీ తోడి బ్రహ్మచర్యపు
నీతము పదునాలు గేండ్లు నెరపుదు నడవిన్,
బ్రీతిగ చేకొని పొమ్మీ
సీతను, నీ చెంత నుండ క్షేమం బరిదే?... ॥ 92 ॥

(నీతము = నియమము, నెరపు = నెరవేర్చు, ప్రీతి = సంతోషము, చేకొను = తోడ్కొను, చెంత = చేరువ, క్షేమము = కుశలము, అరిది = దుర్లభము)

నీ తోడుగా అడవిలో బ్రహ్మచర్యపు నియమము 14 ఏళ్ళు నెరవేరుస్తాను. ఈ సీతను సంతోషంగా తోడ్కొని వెళ్ళు. నీ చెంత ఉండగా క్షేమము దుర్లభమా?

కం॥ కన్నవిఁ దెమ్మని యడుగను,
యున్నంతను జరుపుఁ గొందు, నూరక నడవిన్
నిన్నిబ్బందులుఁ బెట్టను,
నన్నిట వదలకు మటంచు, నా సతిఁ గోరెన్... ॥ 93 ॥

(కన్నవి = చూచినవి, జరుపు = నిర్వహించు, ఊరక = అకారణముగా, ఇబ్బంది = కష్టము, ఇట = ఇక్కడ, సతి = భార్య)

చూసిన వల్లా తెమ్మని అడగను. ఉన్నంతలో జరుపుకుంటాను. ఊరికే అకారణంగా అడవిలో నిన్ను ఇబ్బందులు పెట్టను. నన్ను ఇక్కడ వదలద్దు అంటూ నా భార్య కోరింది.

తే॥గీ॥ ఆత్మహత్య చేసుకొనెద మనుచు పట్టుఁ
బట్టిరి కుజయు కైకయు వాంఛ కొరకు
యిట్టి బెదిరింపు కెవరైన మట్టికఱచు,
భావి తరముల కిది గుణపాఠ మగును... ॥ 94 ॥

(పట్టు = పట్టుదల, కుజ = సీత, వాంఛ = కోరిక, బెదిరింపు = హాని లేదా నష్టం కలిగిస్తామని భయపెట్టటం, మట్టికఱచు = పడిపోవు, భావి = భవిష్యత్తు, తరము = జీవితకాలము, గుణపాఠము = ఇతరుల దుష్ప్రవర్తనకు చెప్ప తగిన జవాబు)

సీత కైక ఇద్దరూ కోరిక కోసం ఆత్మహత్య చేసుకుంటామని పట్టుఁబట్టారు. ఇలాంటి బెదిరింపుకు ఎవరైనా పడిపోతారు. భావి తరాలకు ఇది గుణపాఠం అవుతుంది.

తే॥గీ॥ తండ్రి చిన్న వల్లభ నన్ను తల్కమునకుఁ
బంప భరతు రాజునుఁ జేయ వరము లడిగె,
వనికి నేఁగించ వీడ్కోలుఁ బలికె పెద్ద
భార్య లిర్వురు మనల నభాగ్యుఁలనుచు... ॥ 95 ॥

(వల్లభ = భార్య, తల్కము = అడవి, వనము = అడవి, ఏఁగించు = పంపు, వీడ్కోలు = పోవ ననుమతి, అభాగ్యుఁడు = దురదృష్టవంతుఁడు)

తండ్రి చిన్న భార్యయైన కైక నన్ను అడవికి పంపి భరతుణ్ణి రాజుగా చేసే వరములు అడిగింది. పెద్ద భార్యలైన ఇద్దరు, అంటే కౌసల్య సుమిత్రలు, మనలను దురదృష్టవంతులని అంటూ అడవికి పంపడానికి వీడ్కోలు పలికారు.

తే॥గీ॥ నేను యడవుల కేగ ప్రస్థాన మవగఁ
బనులు మాని జనులుఁ గూడి బ్రతిఘటించి,
పణ్యశాలలు మూయించి పాలకుఁనికిఁ
బల్లటఁ గలిగించఁ దెలిసె, ప్రజల యలుక... ॥ 96 ॥

(ఏగు = వెళ్ళు, ప్రస్థానము = ప్రయాణము, కూడు = గుమిగూడు, ప్రతిఘటించు = ఎదిరించు, పణ్యశాల = అంగడి, మూయించు = మూయునట్లు చేయు, పాలకుఁడు = రాజు, పల్లట = కష్టము, అలుక = కోపము)

నేను అడవులకు వెళ్ళడానికి ప్రయాణం అవ్వగా, పనులు మానుకొని జనులు గుమిగూడి ప్రతిఘటించి దుకాణాలు మూయించి రాజుకు కష్టము కలిగించగా,

ప్రజల ఆగ్రహము తెలిసింది (ఈ రోజుల్లో జరిగే బందులు, హర్తాళ్ళు ఆ రోజుల్లో కూడా ఉండేవి.).

కం॥ వనవాసమునకుఁ జను మన
లను వెన్కొన ప్రజలు కుందిల మయోధ్య యగున్,
వనిఁ జేయుఁ గ్రూరమృగములు
జనతయె విడు పురము నంచు శంక జనించన్... **॥ 97 ॥**

(చను = వెళ్ళు, కను = చూచు, వెన్కొను = వెంబడించు, కుందిలము = అడవి, వని = అడవి, జనత = జనసమూహము, విడు = విడిచి పెట్టు, పురము = నగరము, శంక = సందేహము, జనించు = పుట్టు)

వనవాసానికి వెళ్ళే మనల్ని ప్రజలు వెంబడిస్తే అయోధ్య అడవి అవుతుంది, జనసమూహము విడిచి పెట్టిన నగరాన్ని క్రూర మృగాలు అడవిగా చేస్తాయి అన్న సందేహము కలుగగా (ముందరి పద్యంతో అన్వయము).

తే॥గీ॥ నా రథమ్మును వెంటాడు పౌరుల భ్రమఁ
బెట్ట, యుత్తర దిశ నేగి పిదప మరలి
దక్షిణ దిశను పయనించి దాఁగి యుంటి,
గోప్య శోధన కీ రీతి వ్యాప్య మగును... **॥ 98 ॥**

(వెంటాడు = వెంబడించు, పౌరులు = పురజనులు, భ్రమ = భ్రాంతి, ఏగు = వెళ్ళు, పిదప = తరువాత, మరలు = వెనుకకు తిరుగు, పయనించు = ప్రయాణమగు, దాఁగు = మఱుఁగుపడు, గోప్య = దాఁచఁదగినది, శోధన = పరిశోధన, రీతి = విధానము, వ్యాప్యము = వ్యాపింపఁదగినది)

నా రథాన్ని వెంబడించే పురజనులను భ్రమింపజేయడానికి ఉత్తర దిశలో వెళ్ళి తరువాత వెనుకకు తిరిగి దక్షిణ దిశలో ప్రయాణమై దాఁగి ఉంటిని. రహస్య పరిశోధనకి ఈ విధానము వ్యాప్తి చెందుతుంది.

తే॥గీ॥ దండ కాటవిని మనముఁ దారు దారి
యందు, లక్ష్మణా! వాల్మీకి యా(శమమునుఁ
జూచితిమిఁ గాదె! యపుడు (గహించ కుంటి
సీత నా చెంతనే కడచేతు ననుచు... ॥ 99 ॥

(అటవి = అడవి, తారు = సంచరించు, ఆ(శమము = పర్ణశాల, చెంత = సమీపము, కడచేయు = విడిచిపెట్టు)

లక్ష్మణా! దండకారణ్యంలో మనము సంచరించు మార్గంలో వాల్మీకి యా(శమాన్ని చూశం కదా. సీతను ఆ సమీపంలోనే విడిచిపెడతానని అప్పుడు అనుకోలేదు.

దశరథుని మరణం:

తే॥గీ॥ ములికినిఁ బొరపాటున తన ముద్దుల సుతుఁ
జంపు యువ దశరథునికి శాప మిచ్చె
పు(త్రశోకముచే చచ్చిపోదు వనుచు
మృతుని పిత, యది వరమయ్యె సుతులు లేని
విభునికి సుమారు యరువది వేలయేండ్లు... ॥ 100 ॥

(ములికి = బాణము, పొరపాటు = తప్పిదము, యువ = పడుచువాఁడు, మృతుడు = స్వర్గస్థుడు, పిత = తం(డి, సుతుడు = కుమారుడు, విభుడు = (ప్రభువు, సుమారు = దాదాపు)

పొరపాటున బాణంతో తన ముద్దుల కుమారుణ్ణి చంపగా పు(త్రశోకంతో (తన వలె) చచ్చిపోతావు అని యువకుడైన దశరథునికి స్వర్గస్థుడైన వాని తం(డి శాప మిచ్చాడు. అది కుమారులు లేని రాజుకు సుమారు అరవై వేల సంవత్సరాలు వరం అయ్యింది (పు(త్రులు కలగక పోతే పు(త్రశోకం రాదుగా).

తే॥గీ॥ మృత తనూజుఁ దీవించుచు యతిఁ బలికిన
"యేకపత్నీవ్రతము వల్లఁ జేకుఱు మన
కుత్తమ గతు" లన్నఁ బలుకు యుత్త మాటఁ
గాదనుఁ దలఁపు పితకు రాలేదు పిదప... ॥ 101 ॥

(మృత తనూజుడు = మరణించిన కుమారుడు, దీవించు = ఆశీర్వదించు, యతి = సన్యాసి, చేకుఱు = లభించు, పలుకు = మాట, ఉత్త = అసత్యము, తలఁపు = ఆలోచన, పిత = తండ్రి, పిదప = తరువాత)

మరణించిన కుమారుణ్ణి ఆశీర్వదిస్తూ సన్యాసి అన్న "ఏకపత్నీవ్రతము వల్ల మనకు ఉత్తమగతులు లభిస్తాయి" అన్న మాట ఉత్త మాట కాదు అనే ఆలోచన తండ్రికి తరువాత రాలేదు (అందుకే, అంత మందిని వివాహం చేసుకున్నాడు అన్నట్లు).

తే॥గీ॥ బాల్యదశ నుండి మన కుటుంబమునుఁ జూచి
యేకపత్నీవ్రతముఁ జేయ నాకు యుక్త
మనుచు నిశ్చయించి ధరణిజను వివాహ
మాడితి, జను లగడుచేయ నామె నెడలి
నేను మరల పెండిలి యంచుఁ బూనుకొనక,
యామె ప్రతిమతోఁ జేసితి యజ్ఞములను,
భావి తరముల నా దీక్ష వాడు కగును... ॥ 102 ॥

(యుక్తము = తగినది, నిశ్చయించు = నిర్ణయించు, ధరణిజ = సీత, అగడుచేయు = నిందించు, ఎడలు = విడుచు, మరల = మళ్ళీ, పూనుకొను = ప్రయత్నించు, ప్రతిమ = విగ్రహము, భావి = భవిష్యత్తు, దీక్ష = పట్టుదల, వాడుక = ఆనవాయితి)

చిన్నప్పటి నుండి మన కుటుంబాన్ని చూసి ఏకపత్నీవ్రతము చెయ్యడం నాకు తగినది అని నిర్ణయించి సీతను వివాహ మాడాను. ప్రజలు నిందించగా ఆమెను వదలి నేను మళ్ళీ పెళ్ళి అంటూ ప్రయత్నించక ఆమె విగ్రహంతో యాగాలు చేశాను. భవిష్యత్తు తరాలకు నా పట్టుదల ఆనవాయితి అవుతుంది.

తే॥గీ॥ సుతులు కల్గినది మొదలు పితకు మదిని
పుత్రశోక భయము లోన పోరుపెట్టె
గాధిజునితో గమము తొలి గండ మవగ
పరశురాముని బెదరింపు పాటుఁ దెచ్చె
రెండు దాటిన వనుకొన రెండు వరము
లడిగి కైక పుత్రవియోగ మిడెను పితకు
నిజముఁ జేయుట కేమో యన జపి నింద... ॥ 103 ॥

(సుతుడు = కుమారుడు, పిత = తండ్రి, మది = మనస్సు, లోన = లోపల, పోరుపెట్టు = పెంకెతనము చేయు, గాధిజుడు = విశ్వామిత్రుడు, గమము = ప్రయాణము, తొలి = మొదటి, గండము = గొప్ప అపాయము, పాటు = ఆపద, దాటు = కడచు, అనుకొను = విశ్వసించు, ఇడు = ఇచ్చు, వియోగము = ఎడబాటు, పిత = తండ్రి, జపి = ముని, నింద = శాపము)

కుమారులు కలిగింది మొదలు, తండ్రికి మనస్సులో లోలోపల పుత్రశోక భయము పోరుపెట్టింది. విశ్వామిత్రునితో ప్రయాణము మొదటి గండము అవ్వగా పరశురాముని బెదరింపు ఆపద తీసుకొచ్చింది. రెండూ దాటినాయి అనుకుంటే ముని ఇచ్చిన శాపము నిజం చెయ్యడానికేమో అన్నట్లుగా రెండు వరాలు అడిగి కైక కుమారుని ఎడబాటు నిచ్చింది.

తే॥గీ॥ నా ముఖము వంకఁ జూడక నా యఘమ్ము
లేద నెఱిగిఁ గానకుఁ బంప లేక చాల
మథనపడెను పంక్తిరథుఁడు, మదినిఁ గోరె
నే నెదురుఁ దిరిగి ప్రభుత నిలుపుకొనగ... ॥ 104 ॥

(వంక = వైపు, అఘము = పాపము, ఎఱుగు = గ్రహించు, కాన = అడవి, మథనపడు = క్షోభపడు, పంక్తిరథుఁడు = దశరథుఁడు, మది = మనస్సు, ఎదురు తిరుగు = తిరగబడు, నిలుపుకొను = స్థిరపఱచుకొను)

నా ముఖం వంక చూడకుండా, నా పాపం లేదని తెలిసి నన్ను అడవికి పంప లేక, దశరథుఁడు చాలా ఆందోళన చెందాడు. నేను తిరగబడి ప్రభుత్వాన్ని నిలుపుకోవాలని మనస్సులో కోరుకున్నాడు.

కం॥ భోగించి వేల యేండ్లుగ
రాగమ్మును వీడ లేని రాజుగ, నా యీ
త్యాగము తరుణుగ, పిత కు
ద్వేగము కలిగించి త్రపను ద్విగుణితఁ బరచెన్... ॥ 105 ॥

(భోగించు = అనుభవించు, రాగము = రక్తి, వీడు = వదలు, త్యాగము = విడుపు, తరుణుడు = పడుచువాడు, పిత = తండ్రి, ఉద్వేగము = కలఁత నందిన మనస్సు, త్రప = సిగ్గు, ద్విగుణితము = రెట్టింపఁబడినది, పరచు = చేయు)

పడుచువానిగా నా యీ త్యాగము, వేల సంవత్సరాలుగా భోగించి రక్తిని వదల లేని రాజుగా తండ్రికి ఉద్వేగం కలిగించి, సిగ్గును ద్విగుణీకృతం చేసింది.

కం॥ తన్నొక మాటైన యనకఁ,
గ్రన్నన నే నన్ని విడిచిఁ గానకుఁ జనగా,
నాన్నకు తనపై తనకే
మిన్నంటు జుగుప్సఁ గల్గ, మేనును వీడెన్... ॥ 106 ॥

(తన్ను = తనను, క్రన్నన = శీఘ్రముగా, విడుచు = త్యజించు, కాన = అడవి, చను = వెళ్ళు, మిన్ను = ఆకాశము, అంటు = తాఁకు, జుగుప్స = రోఁత, కల్గు = కలుగు, మేను = శరీరము, వీడు = వదలిపెట్టు)

తనను ఒక్క మాటైనా అనకుండా శీఘ్రముగా నేను అన్నీ త్యజించి అడవికి వెళ్ళగా నాన్నకు తనపై తనకే ఆకాశాన్ని తాఁకే అంత రోఁత కలుగగా శరీరాన్ని వదిలిపెట్టాడు.

తే॥గీ॥ మన మయోధ్య వదలినఁ బిమ్మట దశరథు
యసువు నిలచెనుఁ గేవల మారు నాఁళ్ళు,
దహనసంస్కారమునుఁ జేయఁ దనయు లచట

లేరుఁ గనుక, వచ్చు వరకు వారు నూనె
దోనెనుఁ జెడకుండ శవము దొరపి నారు,
యట్టి యేర్పాటు బ్రాహ్మణ యర్భకుఁనికి
శంబుకుని వల్ల మరణించ సలిపి నారు,
ప్రగతి కీ యెఱుక యొక తార్కాణ మయ్యె... ॥ 107 ॥

(పిమ్మట = అనంతరము, అసువు = ప్రాణము, కేవలము = మాత్రం, నాఁడు = రోజు, దహనసంస్కారము = అంత్యక్రియ, తనయుడు = కుమారుడు, దోనె = ద్రోణి, దొరపు = ఉంచు, అర్భకుఁడు = బాలుఁడు, చలుపు = చేయు, ప్రగతి = అభివృద్ధి, ఎఱుక = జ్ఞానము, తార్కాణము = నిదర్శనము)

మనము అయోధ్యను వదిలి పెట్టిన అనంతరము దశరథుని ప్రాణము కేవలము ఆరు రోజులు మాత్రమే నిలిచింది. అంత్యక్రియ చేయడానికి కొడుకులు అక్కడ లేరు కనుక, వారు వచ్చే దాకా తైలద్రోణిలో శవాన్ని చెడకుండా ఉంచారు. అటువంటి ఏర్పాటు శంబుకుని వలన మరణించిన బ్రాహ్మణ బాలకునికి చేసినారు. ఈ జ్ఞానము అభివృద్ధికి ఒక నిదర్శనం అయ్యింది.

కం॥ గత మెన్నఁడును గతించదు
సతతము మన జ్ఞప్తి కొచ్చి సాంత్వన పరచున్
గతమున గల సహవాసులు
గతించినను యమరులె సమకాలికుల మదిన్.... ॥ 108 ॥

(గతము = జరిగినది, ఎన్నఁడు = ఎప్పుడును, గతించు = గడిచిపోవు, సతతము = నిరంతరము, జ్ఞప్తి = జ్ఞాపకము, సాంత్వన పరచు = ఓదార్చు, సహవాసి = స్నేహితుడు, అమరుడు = చావులేనివాఁడు, సమకాలికులు = ఒకే కాల మందు ఉన్నవారు, మది = మనస్సు)

గతం ఎప్పుడూ గడచిపోదు. నిరంతరము మనకు జ్ఞాపకానికి వచ్చి ఓదారుస్తుంది. గతంలో ఉన్న సహవాసులు మరణించినా కూడా సమకాలికుల మనస్సులో అమరులే.

భరతుని పశ్చాత్తాపము:

తే॥గీ॥ భరతు డొచ్చి యయోధ్యను జరిగినట్టి
దంతఁ గనుఁగొనిఁ జెడుగగు మాత నగడి
తండ్రి కంత్య క్రియలుఁ జేసి తరలి వచ్చె
నడవికి, మరలి రమ్మని యడుగ నన్ను... ॥ 109 ॥

(కనుఁగొను = తెలిసికొను, చెడుగు = దుష్టురాలు, మాత = తల్లి, అగడు = నిందించు, తరలు = ప్రయాణమగు, మరలు = వెనుకకు తిరుగు)

భరతుడు వచ్చి అయోధ్యలో జరిగిన దంతా తెలుసుకొని దుష్టురాలైన తల్లి కైకను నిందించి తండ్రికి అంత్యక్రియలు చేసి నన్ను వెనక్కి రమ్మని అడగడానికి అడవికి ప్రయాణమై వచ్చాడు.

తే॥గీ॥ మంథరను తిట్టు శత్రుఘ్ను మందలించి
యామెను వధింప శ్రీరాము డసలు మాట
లాడ, డనుజ! కాకున్నచో నేడె కైక
ప్రాణముగొని యుందు ననుచు భరతు డనియె... ॥ 110 ॥

(మందలించు = చీవాట్లు పెట్టు, వధించు = చంపు, అనుజుడు = తమ్ముడు, నేడు = ఈ రోజు, ప్రాణముగొను = చంపు)

మంథరను నిందించే శత్రుఘ్నుడికి చీవాట్లు పెట్టి ఆమెను చంపితే శ్రీరాముడు అసలు మాట్లాడడు, తమ్ముడా! అట్లా కాకపోతే ఈ రోజే నేను కైకను చంపియుండే వాడినని భరతు డన్నాడు.

శా॥ ఏ నుల్లంఘన మెట్లుఁ జేతుఁ, బితరున్ యిచ్చించ కైకేయి నన్
గానన్ బంపు నిబంధనమ్ము, భరతాఁ! గాదంచు వాదింతుమా?
కానిమ్మీ గమనమ్ముఁ గానలకు, యాకాంక్షించిఁ గైకొంటినా
నే నిక్కట్లను? సాంత్వనమ్ము దరి రానీ కంచు వాక్రుచ్చితిన్...॥ 111 ॥

(ఏను = నేను, ఉల్లంఘనము = అతిక్రమణము, పితరుఁడు = తండ్రి, ఇచ్ఛించు = కోరు, కాన = అడవి, నిబంధనము = కట్టుపాటు, గమనము = ప్రయాణము, ఆకాంక్షించు = కోరు, కైకొను = గ్రహించు, ఇక్కట్లు = కష్టము, సాంత్వనము = ఓదార్పు, దరి = సమీపము, వాక్రుచ్చు = చెప్పు)

కైకేయి నన్ను అడవికి పంపే నిబంధన తండ్రిని కోరగా నేను ఎట్లా అతిక్రమిస్తాను, భరతా! కాదని వాదిస్తామా? అవనీ అడవులకు ఈ ప్రయాణం. కష్టాన్ని కోరి తెచ్చుకున్నానా? ఓదార్పు దగ్గరకు రానీకు అని చెప్పాను.

సీ॥ మంత్రుల ప్రకృతుల మధ్యఁ జూచెడి నన్ను
యడవిని మృగముల నడుమఁ గాంచె
వలువలు వేలాది కలవాటు పడు నన్ను
లేడి తోళ్ళ జమళి తోడఁ జూచె
రంగురంగుల పూల రాజిల్లఁ గను నన్ను
జటల భారము ధరించ తిలకించె
యజ్ఞములనుఁ జేసి యశము పొందెడి నన్ను
కాయకష్టముఁ జేయఁ గానఁ గాంచె

తే॥గీ॥ యిట్లు భరతుడు ననుఁ గాంచి యెరిసి స్థితికి
తానె కారణం బని మదిన్ తల్లడిల్ల,
పాదుకల నిచ్చి యోదార్చి ప్రతినిధి వగు
మంచు రాజ్య మేలుటకు యొప్పించినాను... ॥ 112 ॥

(ప్రకృతి = పౌరవర్గము, నడుమ = మధ్య, కాంచు = చూచు, వలువ = వస్త్రము, అలవాటు = వాడుక, జమళి = జత, రాజిల్లు = ప్రకాశించు, జట = అల్లుకొనినజుట్టు, తిలకించు = చూచు, యశము = కీర్తి, కాయకష్టము = శరీర కష్టము, ఎరియు = పరితపించు, స్థితి = పరిస్థితి, మది = మనస్సు, తల్లడిల్లు = బాధపడు, పాదుకలు = పావకోళ్లు, ఓదార్చు = అనునయించు, ప్రతినిధి = ఒకరికి బదులుగా నుండువాఁడు, ఒప్పించు = సమ్మతింపజేయు)

మంత్రుల పౌరవర్గాల మధ్య ఉండగా చూసిన నన్ను అడవి మృగాల నడుమ చూశాడు. వేలాది వస్త్రాలకు అలవాటు పడ్డ నన్ను జత లేడి తోళ్ళతో చూశాడు. రంగురంగుల పూలలో ప్రకాశించగా చూచిన నన్ను జటల బరువు ధరించగా చూశాడు. యజ్ఞములు చేసి కీర్తి పొందే నన్ను అడవిలో శరీర కష్టము చేయగా చూశాడు. ఈ విధంగా భరతుడు నన్ను చూసి పరితపించి పరిస్థితికి తానే కారణమని మనస్సులో బాధపడగా పాదుకలను ఇచ్చి అనునయించి ప్రతినిధివి కమ్ము అని రాజ్యము పాలించుటకు సమ్మతింపజేసినాను.

తే॥గీ॥ నాఁడు భరతు డయోధ్యను వీడి నంది
నాట రాజధాని నిలుపు సూటి, వాని
శపథము మరువ రెన్నఁడు జనులు మదిని,
తలప ననిపించె నదె నాకు త్యాగమనుచు... ॥ 113 ॥

(నాఁడు = ఆ దినము, వీడు = వదలు, నందినాడు = నందిగ్రామము, రాజధాని = రాజుయొక్క ప్రధాన నగరము, నిలుపు = ప్రతిష్ఠించు, సూటి = విధము, శపథము = ప్రతిజ్ఞ, మరచు = మరిచిపోవు, ఎన్నఁడు = ఎప్పుడు, మది = మనస్సు, తలచు = ఆలోచించు)

ఆ రోజున భరతుడు అయోధ్యను విడిచిపెట్టి నందిగ్రామంలో రాజధానిని ప్రతిష్ఠించిన విధము, వాని ప్రతిజ్ఞ, ప్రజలు మనస్సులో ఎప్పుడూ మరచిపోరు. ఆలోచించగా నాకు అదే త్యాగమని అనిపించింది.

ఉ॥ తల్లికి దూరమై వనికి తర్లెను నొక్కడు తండ్రి మాటకై,
తల్లియె మెచ్చగా నొకడు తర్లెను యన్ననుఁ గూడిఁ గానకున్,
తల్లిని దూఱుచున్ సవతి తల్లికి మ్రొక్కె నొకండు విజ్ఞుఁడై,
తల్లుల మూడు రూపముల తత్త్వముఁ జూపెను నాదు గాథయే ॥ 114 ॥

(వని = అడవి, తర్లు = ప్రయాణమగు, కాన = అడవి, దూఱు = నిందించు, విజ్ఞుఁడు = సమర్థుడు, తత్త్వము = స్వభావము, గాథ = చరిత్రము)

ఒకడు (శ్రీరాముడు) తండ్రి మాట కోసం తల్లికి (కౌసల్యకు) దూరమై అడవికి ప్రయాణ మయ్యాడు. ఒకడు (లక్ష్మణుడు) తల్లి (సుమిత్ర) మెచ్చుకొనగా అన్నను కూడి అడవికి ప్రయాణ మయ్యాడు. ఒకడు (భరతుడు) సమర్థుడై తల్లిని (కైకేయిని) నిందిస్తూ సవతి తల్లికి (కౌసల్యకు) నమస్కరించాడు. నా చరిత్రము తల్లుల మూడు రూపాల స్వభావము చూపించింది.

సీతారామ వనవాసము:

చం॥ మనమున స్వార్థ మన్న దణు మాత్రము నంటని చెట్లుచేమలున్
జనులకు హానిఁ జేతు మను శారుక ముండని వన్యజీవులున్
యనుగలమైన యున్కి మన కబ్బునెఁ బట్టణ మందుఁ? గన్కనే
వనమున నున్న వాడె సుఖవంతుడు వాస్తవ మెంచిఁ జూచినన్ ॥ 115 ॥

(మనము = మనస్సు, అంటు = తాఁకు, శారుకము = క్రూరత్వము, అనుగలము = అనుకూలము, ఉన్కి = స్థితి, అబ్బు = ప్రాప్తించు, కన్క = కనుక, వనము = అడవి, వాస్తవము = నిజము, ఎంచు = గణించు)

మనస్సులో కొంచెం కూడా స్వార్థము తాఁకని చెట్లుచేమలు, ప్రజలకు కీడు చేద్దామనే క్రూరత్వము ఉండని వన్యప్రాణులు అనుకూలంగా ఉన్న స్థితి మనకు పట్టణంలో దొరుకుతుందా? కనుకనే నిజం ఎంచి చూస్తే అడవిలో ఉన్న వాడే సుఖవంతుడు.

తే॥గీ॥ కట్టెదుట సరోవరము, చెంగలువల విరి
హారములు, యంచకొదమ సింగార, మంశు
వదర నిపుడమికి యదనంచుఁ, గోళ్ళు
సుస్వరం బూది హరిత వసుధను లేపె... ॥ 116 ॥

(కట్టెదుట = సరిగ్గా ఎదురుగా, సరోవరము = దివ్యమైన కొలను, చెంగలువ = ఎఱ్ఱకలువ, విరి = పువ్వు, అంచకొదమ = చిన్న హంస, సింగారము = అందము, అంశువు = కాంతి, అదరు = శోభించు, పుడమి = భూమి, అదను = తగిన

సమయము, సుస్వరం = మంచి కంఠధ్వని, ఊదు = నోటితో వేగముగా గాలిని విడుచు, హరిత = ఆకుపచ్చ వర్ణము, వసుధ = భూమి, లేపు = లేవఁజేయు)

సరిగ్గా ఎదురుగా సరస్సు, ఎఱ్ఱకలువ పూల హారాలు, చిన్న హంస అందము, కాంతి వ్యాపించగా ఈ భూమికి సరియైన సమయం అని కోళ్ళు మంచి కంఠధ్వని ఊది పచ్చని నేలను నిద్ర లేపాయి.

కం॥ తెలి మంచుఁ గురియుచుండగ,
పొలముల దినకరుని రశ్మిఁ బొడచూపగనే,
తెలవారెను కెంజాయన్,
పులకలతో మేనుఁ బొంగెఁ బుడమినిఁ జూడన్... ॥ 117 ॥

(తెలి = తెల్లనిది, దినకరుని = సూర్యుని, రశ్మి = కాంతి, పొడచూపగనే = కనబడగనే, కెంజాయ = ఎరుపు, పులకలు = గగుర్పాటు, మేను = శరీరము, పుడమి = భూమి)

తెల్లటి మంచు కురుస్తుండగా, పంటపొలాల్లో సూర్యరశ్మి సోకగానే ఎరుపు రంగులో తెల్లారింది. నేలను చూడడానికి పులకలతో శరీరం పొంగింది.

కం॥ శతమూలి యాకు లందున
సిత హిమ బిందువులుఁ బడగ, చిన్ని దళంబుల్
కుతపుని కిరణముల మెరిసె
నతి సుందర సప్తవర్ణ హరివిల్లులతో... ॥ 118 ॥

(శతమూలి = పిల్లిపెసర, సిత = తెల్లని, హిమ = మంచు, కుతపుని = సూర్యుని, అతిసుందర = మిక్కిలి అందమైన, సప్తవర్ణ హరివిల్లులు = ఏడు రంగుల ఇంద్రధనుస్సులు)

పిల్లిపెసర ఆకులలో తెల్లని మంచు బిందువులు పడగా, ఆ చిన్ని ఆకులు సూర్యుని కిరణాలలో అతి సుందరమైన ఏడు రంగుల ఇంద్రధనుస్సులతో మెరిశాయి.

కం॥ నా తోడ మసలు వేళల
సీతకు యనిపించె, నడవి సీమను నాకున్
బ్రీతిని మంత్రిగ యుండుటె
పాతివ్రత్య మనుచు, యవబాసముఁ బంచన్... ॥ 119 ॥

(తోడ = వెంబడి, మసలు = విహరించు, సీమ = ప్రదేశము, ప్రీతి = ప్రేమ, పాతివ్రత్యము = పతివ్రత యొక్క శీలము, అవబాసము = జ్ఞానము)

నా వెంబడి విహరించే సమయాల్లో సీతకు అడవి ప్రదేశంలో జ్ఞానము పంచడానికి ప్రేమగా నాకు మంత్రిగా ఉండడమే పాతివ్రత్యము అని అనిపించింది.

తే॥గీ॥ వ్యసనములుఁ గల్గు కామము వలన మూడు,
యనృత మాడుట, పరసతి యభిగమనము,
వైరమే లేని క్రూరపు వైన మనుచు,
నాకు తొలి రెండు లేవని నమ్మఁ బలికి,
మూడవది సోకె ననె సీత, మునులుఁ గోర... ॥ 120 ॥

(వ్యసనము = దురభ్యాసము, కల్గు = కలుగు, కామము = ఇచ్ఛ, అనృతము = అబద్ధము, పరసతి = ఇతరుల భార్య, అభిగమనము = పొందు, వైరము = విరోధము, క్రూరము = భయంకరమైనది, వైనము = విధము, తొలి = మొదటి, నమ్మఁ బలుకు = నమ్మే విధంగా చెప్పడం, సోకు = తగులు)

కామం వల్ల కలిగే వ్యసనాలు మూడు - అబద్ధము ఆడడం, పరసతి పొందు, విరోధమే లేకుండా క్రూరత్వం చూపించడం అన్నవి. నాకు మొదటి రెండూ లేవని నమ్మఁ బలికి మునులు కోరడం వల్ల మూడవది తగులుకుంది అని సీత చెప్పింది.

తే॥గీ॥ అటుల హెచ్చరించగ సీత యార్తిని నను,
యామె సందియమునుఁ దీర్చి తపుడుఁ, గాని
రావణుడు మెదలె మదిని, లక్ష్మణా! త
మస్సు చేత మూడును యున్న మంటమారి... ॥ 121 ॥

(అటుల = ఆ విధంగా, హెచ్చరించు = సూచనచేయు, ఆర్తి = బాధ, సందియము = సందేహము, తీర్చు = తొలగించు, మెదలు = కొంచెము చలించు, మది = మనస్సు, తమస్సు = తమోగుణము, మంటమారి = కోపిష్ఠి)

ఆ విధంగా సీత బాధతో నన్ను హెచ్చరించగా, ఆమె సందేహాన్ని అప్పుడు తొలగించాను కానీ, లక్ష్మణా! తమోగుణము చేత మూడు వ్యసనాలు (అబద్ధము ఆడడం, పరసతి పొందు, విరోధమే లేకుండా క్రూరత్వం) ఉన్న కోపిష్ఠి రావణుడు మనస్సులో మెదిలాడు.

కం॥ వాసవుఁని మాయ చేతను,
న్యాసముగా ఖడ్గ మొక్క యతికి లభించన్,
ధ్యాస మరలి కటు కయ్యెను,
నా సతి యిదిఁ జెప్పి నాకు నడతను నేర్పెన్... ॥ 122 ॥

(వాసవుఁడు = ఇంద్రుఁడు, న్యాసము = పదిల పఱచి పెట్టి అడిగినప్పుడు ఇమ్మని యేదేని యొక వస్తువును ఒకరి వద్ద దాఁచుట, ఖడ్గము = కత్తి, యతి = ముని, ధ్యాస = ఆలోచన, మరలు = వక్రించు, కటుకు = క్రూరుడు, సతి = భార్య, నడత = నడవడి)

అరణ్య కాండము 9వ సర్గలో సీత రామునికి చెప్పిన నిరాయుధీకరణను (disarmament) సూచించే కథకు సంబంధించిన పద్యం ఇది. ఒక ముని తపస్సును భగ్నము చెయ్యడానికి ఇంద్రుడు అతని వద్దకు భటుని రూపంలో వెళ్ళి ఒక కత్తిని ఇచ్చి, ఇది కొంతకాలము ఉంచండి, మళ్ళీ వచ్చి తీసుకుంటాను అంటాడు. అప్పటి నుండి ఆ ముని ఆ కత్తిని శ్రద్ధగా చూసుకుంటూ, తాను ఎక్కడి కెళ్ళినా దాన్ని వెంట తీసుకెళుతూ ఉంటాడు. క్రమంగా ఆయనకు తపస్సు మీద శ్రద్ధ తగ్గి మెల్లిగా క్రూరత్వము అబ్బుతుంది. అతడు తరువాత హింస యందు అభిరుచి పెంచుకొని అధర్మానికి అలవాటు పడి నరకాన్ని పొందుతాడు. అందుచేత, శస్త్రాలు దగ్గర ఉంటే హింసా ప్రవృత్తి దానంతట అది పెరుగుతుంది అని సీత బోధ. ఇక పద్యంలో ఏముందో చూద్దాం.

ఇంద్రుని మాయ చేత ఇల్లడగా (పదిలపఱచిపెట్టి అడిగినప్పుడు ఇమ్మని యేదేని యొక వస్తువును ఒకరి వద్ద దాఁచుట) ఒక కత్తి మునికి లభించగా ఆలోచన వక్రించి క్రూరు డయ్యాడు. నా భార్య ఇది చెప్పి నాకు నడవడి నేర్పింది.

తే॥గీ॥ ప్రజలు పన్ను రూపున యారవ పెడ నివ్వ,
తాపసు లిడ నాల్గవ పాలు తమ తపమున,
వారి రక్షణ నృపతుల బాధ్య తగును,
తావు పురమైనఁ గాని ప్రాంతరమె యైన,
యనుచు సీతకుఁ జెప్పితి, నంతట వని
యందు వైర మేర్పడెఁ దెలియకనె స్వీయ
రక్షణ కనుచు నాకును రాక్షసులకు... **॥ 123 ॥**

(పెడ = భాగము, తాపసి = ముని, ఇడు = ఇచ్చు, పాలు = భాగము, నృపతి = రాజు, తావు = స్థానము, పురము = పట్టణము, ప్రాంతరము = అడవి, అంతట = అనంతరము, వైరము = విరోధము)

ప్రజలు పన్ను రూపంలో ఆరవ భాగము ఇవ్వగా, మునులు తమ తపస్సులో నాల్గవ భాగము ఇవ్వగా, ప్రదేశం పురమైనా అడవియైనా వారి రక్షణ రాజుల బాధ్యత అవుతుంది అని సీతకు చెప్పాను. అనంతరము స్వీయ రక్షణ (private defence) కోసం తెలియకుండానే నాకు రాక్షసులకు విరోధము ఏర్పడింది.

శూర్పణఖ కథ మలుపు త్రిప్పుట:

తే॥గీ॥ ఒక దశాబ్దము పైన కక్ష్యకము నందు
సర్వసుఖము లనుభవించి శాంతి నుండ
శూర్పణఖ మోచె మన కంగలార్పు, నీరు
నిలకడగ నుండుఁ జెరువున నెత్తతి వలె... **॥ 124 ॥**

(దశాబ్దము = 10 సంవత్సరాలు, కక్ష్యకము = అడవి, మోచు = మొదలుపెట్టు, అంగలార్పు = దుఃఖము, నెత్తతి = కల్లోలము)

ఒక దశాబ్దము పైగా అడవిలో అన్ని సుఖాలు అనుభవించి శాంతిగా ఉండగా, నీరు నిలకడగా ఉన్న చెరువులో కల్లోలం లాగా, శూర్పణఖ దుఃఖానికి తెరతీసింది.

తే॥గీ॥ కల్లబొల్లి మాటలుఁ బెక్కు లల్లి, తొలుత
ఖరుని, పిమ్మట దశకంఠు మరణమునకు,
వారి సేన యంతమునకుఁ, గారణముగ
శూర్పణఖఁ జేటయెను లంక దర్ప మణచ... ॥ 125 ॥

(కల్లబొల్లిమాట = అబద్ధము, పెక్కులు = అనేకములు, అల్లు = లేనివి కల్పించు, తొలుత = మొదట, పిమ్మట = అనంతరము, దశకంఠుడు = రావణుఁడు, అంతము = చావు, చేటు = వినాశము, దర్పము = గర్వము, అణచు = నశింపచేయు)

అబద్ధాలు పెక్కులు లేనివి కల్పించి మొదట ఖరుని తరువాత రావణుని చావుకు, వారి సేన చావుకు కారణంగా, శూర్పణఖ లంక గర్వము అణచడానికి వినాశము అయ్యింది (లంకకి చేటు అని సీతను అంటారు కానీ నిజానికి శూర్పణఖే లంకకు చేటు).

తే॥గీ॥ రూపసి యగు నాదు సతిని రూపుమాపఁ
జూచు రక్కసి పౌలస్తి జుట్టుఁ బట్టి,
కర్మసిద్ధిని యందించ, కర్ణ నాసి
కలను ఖండించి నావుగా, కలహ మొలసి... ॥ 126 ॥

(రూపసి = అందకత్తె, సతి = భార్య, రూపుమాపు = చంపు, రక్కసి = రాక్షసి, పౌలస్తి = శూర్పణఖ, కర్మసిద్ధి = కర్మఫలము, కర్ణ = చెవి, నాసిక = ముక్కు, ఖండించు = నఱకు, కలహము = జగడము, ఒలయు = కోరు)

అందకత్తెయైన నా భార్యను చంపఁజూచిన రాక్షసి శూర్పణఖ జుట్టు పట్టుకొని కర్మఫలాన్ని అందించడానికి కలహం ఆశించి ముక్కు చెవ్వు కోశావుగా.

కం॥ ఖరు దుగ్రత నిట్లనె, దా
శరథీ! జరిపింప శాస్తి చానకు, నీ పో
టరితన మగుపడె, యా యొ
ప్పర నారీ సోదరుండు, పంక్తిముఖుండే... ॥ 127 ॥

(ఉగ్రత = తీవ్రత, దాశరథి = శ్రీరాముడు, శాస్తి = శిక్ష, చాన = స్త్రీ, పోటరితనము = శూరత్వము, అగుపడు = కంటబడు, ఒప్పర = కురూపి, నారి = స్త్రీ, పంక్తిముఖుడు = రావణుడు)

ఖరుడు తీవ్రంగా ఇలా అన్నాడు. శ్రీరామా! స్త్రీకి శిక్ష జరిపించడంలో నీ శూరత్వము కనపడింది (అంటే, ఎగతాళి చేసినట్లు). ఆ కురూపి స్త్రీకి సోదరుడు రావణుడే.

తే॥గీ॥ ఖరుని రాక్షస సేన సంగ్రామ మందు
నిలువ, సీత నుంచితి నీదు బలకరమున,
స్వీయ రక్షణ కోసమై సేనఁ గూల్చ,
మానమందిరుతో పగ మరల వచ్చె... ॥ 128 ॥

(సంగ్రామము = యుద్ధము, బలకరము = కావలి, కూల్చు = చంపు, మానమందిరుడు = రావణుడు, పగ = విరోధము, మరల = మళ్ళీ)

ఖరుని రాక్షస సేన యుద్ధంలో నిలవగా సీతను నీ రక్షణలో ఉంచాను. స్వీయ రక్షణ కోసం సేనను చంపడం వల్ల రావణునితో విరోధము మళ్ళీ వచ్చింది.

మ॥ తన యన్నన్ గని యందకత్తె యగు సీతా సాధ్వి నీ భార్యగా
యనుకూలమ్మగు నామె నీ కడకు రా నాహ్వానమున్ బల్కగన్
వని నాకీ స్థితిఁ గల్గెఁ జూడు మనుచున్ వక్రీకరించెన్ సభన్
విను పౌలస్త్యునిఁ జుప్పనాక యెరుగన్ బింబాధరా లోలుగన్ ॥ 129 ॥

(సాధ్వి = పతివ్రత, అనుకూలము = తగినది, కడ = చెంత, పల్కు = మాటాడు, వని = అడవి, స్థితి = అవస్థ, కల్గు = కలుగు, వక్రీకరించు = తప్పుగా చిత్రించు,

పౌలస్త్యుడు = రావణుండు, చుప్పనాక = శూర్పణఖ, ఎరుగు = తెలియు, బింబాధర = స్త్రీ, లోలుడు = ఆసక్తుడు)

తన అన్నను చూసి అందకత్తెయైన పతివ్రత సీత నీ భార్యగా తగినది అవుతుంది, ఆమెను నీ వద్దకు రమ్మని ఆహ్వానము పలుకడం వల్ల అడవిలో నాకు ఈ అవస్థ కలిగింది, చూడు అంటూ సభలో వింటున్న రావణుని స్త్రీలోలుడుగా ఎరుగడం వల్ల శూర్పణఖ వక్రీకరించింది.

సీతాపహరణము:

తే॥గీ॥ సీత నపహరించగ తాను చెప్పు రీతి
లేడి రూపున యామె పరిసరములనుఁ
దిరుగ మారీచు మానమందిరుడుఁ గోర,
యాతడు విముఖతనుఁ జెప్పె నీతి నిట్లు... ॥ 130 ॥

(అపహరించు = మోసపుచ్చి తీసుకొనిపోవు, రీతి = విధము, రూపు = ఆకృతి, పరిసరములు = చుట్టుప్రక్కలు, మానమందిరుడు = రావణుడు, విముఖత = అనుకూలము కాకుండుట)

సీతను మోసపుచ్చి తీసుకొని పోవడానికి, తాను చెప్పే విధంగా లేడి రూపంలో ఆమె ఉన్న పరిసరాల్లో తిరగమని మారీచుణ్ణి రావణుడు కోరగా అతడు విముఖతతో నీతిని ఈ విధంగా చెప్పాడు.

కం॥ మెఱమెచ్చులాడి సులువుగఁ
బెఱవారిని మభ్యపెట్టఁ బెక్కురు వెలయన్,
పరహిత మప్రియమైనను,
వెరవని వదు లరుదుఁ, జెప్ప విను వారు నటే... ॥ 131 ॥

(మెఱమెచ్చులాడు = ముఖప్రీతి కొఱకు మెచ్చునట్లు నటించు, సులువు = తేలిక, పెఱవాడు = పరాయివాడు, మభ్యపెట్టు = మోసపుచ్చు, పెక్కురు = అనేకులు, వెలయు = ఉండు, పరహితము = ఇతరులకు మేలు చేయడం, అప్రియము =

ఇష్టము కానిది, వెరచు = భయపడు, వదుడు = వక్త, అరుదు = దుర్లభం, అటు = ఆప్రకారము)

ముఖప్రీతి కొఱకు మెచ్చునట్లు నటిస్తూ పరాయివాళ్ళను మోసపుచ్చడానికి అనేక మంది ఉండగా, పరోపకారము వారికి ఇష్టము కానిది అయినా భయపడని వక్తలు దుర్లభము. చెప్పినా వినే వాళ్ళు కూడా అంతే.

వాల్మీకి రామాయణం అరణ్య కాండలోని 37వ సర్గలో గల 2వ శ్లోకంలో అనుచితమైన పనిలో సాయం చేయమని అడిగిన రావణునికి మారీచుడు చెప్పిన మాటలు ఇవి. ఆ శ్లోకం క్రింద ఇవ్వబడింది:

సులభాః పురుషా రాజన్! సతతం ప్రియవాదినః ॥
అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥

యుద్ధ కాండలోని 16వ సర్గలో గల 21వ శ్లోకంలో విభీషణుడు రావణునికి తాను వదలి వెళ్ళిపోతూ చెప్పిన మాటలలో కూడా ఇదే శ్లోకం ఉంది.

తే॥గీ॥ ఒకరు ధర్మమార్గముననే యుండి యిటులెఁ
జెప్ప, వేరొకరు యిటులెఁ జెప్పి తాను
మాత్రము యధర్మమున సాగె, మానితమగు
ఘట్టములు రెంటి యందు శ్లోక మొకటియె ర
చించె వాల్మీకి మౌని, వచింప నెట్టి
భేద ముండె మారీచ విభీషణులను,
యొకరు వేడ నాదు శరణు, మెకము రూప
మంది మ్రందె వేరొకరు నా యస్త్రమునకు... ॥ 132 ॥

(ఇటులు = ఈ ప్రకారము, సాగు = ప్రవర్తిల్లు, మానితము = కొనియాడబడిన, ఘట్టము = సందర్భము, మౌని = ముని, వచించు = చెప్పు, ఎట్టి = ఎటువంటి, భేదము = వ్యత్యాసము, వేడు = ప్రార్థించు, శరణు = రక్షణము, మెకము = లేడి, రూపము = ఆకృతి, మ్రందు = చచ్చు, అస్త్రము = మంత్రపూర్వకముగ ప్రయోగింపబడిన బాణము)

ఒకరు (విభీషణుడు) ధర్మ మార్గంలో ఉండి ఈ విధంగా చెప్పగా, వేరొకరు (మారీచుడు) ఈ విధంగా చెప్పి తాను మాత్రము అధర్మంలో సాగాడు. కొనియాడబడిన రెండు సందర్భాలలోను మారీచ విభీషణులలో ఎటువంటి వ్యత్యాసము ఉందో చెప్పడానికి ఒకటే శ్లోకం రచించాడు వాల్మీకి మహర్షి. ఒకరు (విభీషణుడు) నా శరణు వేడగా, వేరొకరు (మారీచుడు) లేడి రూపం పొంది నా అస్త్రానికి మరణించాడు.

కం॥ పాఱును భయకంపితుడై
మారీచుడు రేఫ మున్న మాటను వినగన్,
"మారీచము" మోసముగాఁ
బేరెక్కె జగతిని వాని పృష తాకృతిచే... ॥ 133 ॥

(పాఱు = పారిపోవు, భయకంపితుడు = భయము చేత వణకు వాడు, రేఫము = రవర్ణము, పేరెక్కు = ప్రసిద్ధికెక్కు, జగతి = లోకము, పృషతము = లేడి, ఆకృతి = రూపము)

రేఫము ఉన్న మాటను వినగానే మారీచుడు భయంతో వణుకుతూ పారిపోతాడు. వాని లేడి రూపం వల్ల "మారీచము" మోసంగా లోకంలో ప్రసిద్ధికెక్కింది.

కం॥ పతికి సుగుణములుఁ బంచిన
సతియేఁ దన భర్త కొక్క సద్గురు వవగన్
సతికిన్ దురాశ లుండిన
పతి నుసిగొల్పును, యనుచిత వర్తన మందున్... ॥ 134 ॥

(పంచు = నియోగించు, సతి = భార్య, దురాశ = వ్యర్థమైన ఆశ, ఉసిగొల్పు = ప్రేరేపించు, అనుచిత = ఉచితము కానిది, వర్తనము = ప్రవర్తనము)

భర్తకు మంచి గుణాలు పంచిన భార్యయే తన భర్తకు ఒక మంచి గురువు అవ్వగా, భార్యకు వ్యర్థమైన ఆశలు ఉంటే భర్తను ఉచితం కాని ప్రవర్తనమునకు ప్రేరేపిస్తుంది.

కం॥ తానొసగిన మాట మరువ,
తానూహించని యలమటఁ దన్నుకు వచ్చెన్
చీనము రూపమున కుజకుఁ,
గాననమున మనల కదియె కష్టముఁ దెచ్చెన్... ॥ **135** ॥

(ఒసగు = ఇచ్చు, అలమట = దుఃఖము, తన్నుకు వచ్చు = పొంగు కొచ్చు, చీనము = లేడి, కుజ సీత, కాననము = అడవి)

తాను ఇచ్చిన మాట మరచిపోగా తాను ఊహించని దుఃఖము లేడి రూపంలో సీతకు తన్నుకు వచ్చింది. అడవిలో మనకు అదే కష్టము తెచ్చింది.

తే॥గీ॥ ఇవ్వని మెరిసెడి మృగమా? రివ్వు మనుచు
పరుగిడఁ గన లలిఁ దనికెఁ, బట్టిఁ దెమ్ము
యని తన పతినిఁ గోరు సీతనుఁ గని, యది
మృగమె, మాయావి యన్న సౌమిత్రి వీవె... ॥ **136** ॥

(వని = అడవి, మెరియు = ప్రకాశించు, మృగము = లేడి, రివ్వు = వేగంగా, కను = చూచు, లలి = వాత్సల్యము, తనుకు = కలుగు, మృగము = లేడి, మాయావి = మాయచేయువాఁడు, సౌమిత్రి = సుమిత్ర కొడుకు, ఈవు = నీవు)

ఈ అడవిలో మెరిసే లేడియా? రివ్వు మంటూ పరుగెత్తగా చూస్తే వాత్సల్యము కలిగింది, పట్టి తీసుకొనిరా అని భర్తను కోరిన సీతను చూచి అది లేడియా, మాయావి అన్న సౌమిత్రివి నీవే.

తే॥గీ॥ రత్న సంస్తానములు మేన రంగులీన,
చూడు మల్లదె సారంగ మాడు చుండె
ననగ సీత, వెసన్ దెత్తు నని యరిగితి
దానిఁ జంపగ దొరకు తోలైన యనుచు... ॥ **137** ॥

(రత్న = మణి, సంస్తానము = చిహ్నము, మేను = శరీరము, ఈను = వెలువరించు, అల్లదె = అల్లదిగో, సారంగము = లేడి, ఆడు = క్రీడించు, వెసను = శీఘ్రముగ, తెత్తు = తీసుకొని వచ్చు, అరుగు = వెళ్ళు, దొరకు = లభించు, తోలు = చర్మము)

రత్నకాంతి నిచ్చే మచ్చలు ఒంటి మీద రంగులు వెలువరించగా, అదిగో చూడుము, లేడి ఆడుతోంది అని సీత అనగా, దాన్ని చంపితే తోలయినా దొరుకుతుంది అనుకొని, వెంటనే తీసుకొస్తాను అని నేను వెళ్ళాను.

తే॥గీ॥ అగుపడుచు మాయ మగుచును యడవిని నను
దవ్వులకుఁ గొనిపోయె చిత్రమృగ మనుచుఁ
దునిమితి నపుడే బ్రహ్మాస్త్రమునఁ దలచిన
చందమునఁ, గాని నిజరూప మందు మారి
యార్చ నా వలె, మారీచు కదియె మిమ్ము
తటమటించు వ్యూహ మటంచుఁ దట్టె నపుడు... ॥ 138 ॥

(దవ్వులు = దూరము, కొనిపోవు = తీసికొనిపోవు, చిత్రమృగము = లేడి, తునుము = చంపు, తలచిన = అనుకున్న, చందము = విధము, మారు = మరోరూపం పొందు, ఆర్చు = అఱచు, తటమటించు = మోసపుచ్చు, వ్యూహము = రచన, తట్టు = తోఁచు)

కనిపిస్తూ మాయమవుతూ అడవిలో లేడి నన్ను దూరంగా తీసుకొనిపోయింది అని ఆ సమయంలోనే బ్రహ్మాస్త్రంతో అనుకున్న విధంగా చంపాను. కానీ, అది నిజరూపం లోకి మారి నా లాగా అరవగా మారీచుడికి అదే మిమ్మల్ని మోసపుచ్చే వ్యూహము అని అప్పుడు తట్టింది.

చం॥ అరుసము పొంద వద్దు, యిది యాసుర మాయయె, తాటకేయుఁ డా
హరిణము, ముద్దుగాఱె తన హాటక వర్ణముతో నటించి, తా
నరచెను రాము కంఠమున యంతము నం, దది మోసపూరితం,
బరయు మటంచు నీవుఁ గడు యార్తినిఁ జెప్పితి వయ్య సీతకున్ ॥ 139 ॥

(అరుసము = హర్షము, ఆసుర = రాక్షసప్రవృత్తి, తాటకేయుఁడు = మారీచుఁడు, హరిణము = లేడి, ముద్దుగాఱు = ముద్దులొలుకు, హాటక = బంగారు, వర్ణము = రంగు, అంతము = చావు, మోసపూరితము = మోసముతో నిండినది, అరయు = విచారించు, కడు = మిక్కిలి, ఆర్తి = బాధ)

హర్షము పొంద వద్దు. ఇది రాక్షస మాయే. ఆ లేడి మారీచుడే. తన బంగారు రంగుతో నటించి ముద్దులొలికాడు. చచ్చే ముందు రాముడి స్వరంలో తాను అరిచాడు. అది మోసముతో నిండినది, విచారించు అంటూ నువ్వు మిక్కిలి బాధతో సీతకు చెప్పావయ్యా.

తే॥గీ॥ లెక్కచేయక నీ మాట, రక్కసు దరి
నాకుఁ గడు ముప్పుఁ గలదను వ్యాకులమున,
నిన్నుఁ బంపెను వైదేహి నింద లాడి,
గట్టి మూల్యంబు చెల్లించెఁ గడకు నామె... ॥ 140 ॥

(లెక్కచేయు = లక్ష్యపెట్టు, రక్కసుడు = రాక్షసుఁడు, దరి = సమీపము, కడు = మిక్కిలి, ముప్పు = ఆపద, వ్యాకులము = దుఃఖము, వైదేహి = సీత, నిందలాడు = నిందావాక్యములు పలుకు, గట్టి = అధికము, మూల్యము = వెల, చెల్లించు = సమర్పించు, కడకు = చివరికి)

నీ మాట లక్ష్యపెట్టక, రాక్షసుని చెంత నాకు మిక్కిలి ఆపద ఉన్నదనే దుఃఖంలో సీత నిన్ను నిందలాడి పంపింది. చివరికి ఆమె అధికమైన మూల్యము చెల్లించింది.

తే॥గీ॥ నిన్ను ప్రచ్ఛన్న శత్రువనిఁ గసరుకొనిఁ
బంపి సీత, యామెను వీడి వచ్చితివని
నేను గతి లేక దూఱగ నిన్నె మరల,
రెండు ప్రక్కల నలిగితి వండ నిచ్చి... ॥ 141 ॥

(ప్రచ్ఛన్న = దాచబడినది, కసరుకొను = ఘోషించు, పంపు = పంపించు, వీడు = వదలు, గతి = మార్గము, దూఱు = నిందించు, మరల = మళ్ళీ, నలుగు = నలిగిపోవు, అండ = ఆసరా)

నిన్ను కనపడని శత్రువు అని ఘోషించి పంపి సీత, ఆమెను విడిచి వచ్చావని నేను గతి లేక నిన్నే మళ్ళా నిందించగా, మాకు అండ నిచ్చి రెండు ప్రక్కలా నలిగి పోయావు.

ఉ॥ ధాత వరంబు లివ్వ బల దర్పముతో సురలన్ జయించు ప్ర
ఖ్యాతిని, "యీశ్వరా" యనుచుఁ గ్రందనఁ జేసిన డింగరీఁడుగా,
సీతను గెబ్బు దుర్మతిగ, స్త్రీలనుఁ బట్టి బలాత్కరించుటన్
దోతు డనంగ, రక్కసుల దుందుభి మీటెను రావణుం డిలన్...॥ 142 ॥

(ధాత = బ్రహ్మ, దర్పము = గర్వము, సురలు = దేవతలు, ప్రఖ్యాతి = మిక్కిలి ప్రసిద్ధి, క్రందన = ఏడ్చుట, డింగరీఁడు = భక్తుఁడు, గెబ్బు = అపహరించు, దుర్మతి = దుర్బుద్ధి కలవాఁడు, బలాత్కరించు = నిర్బంధించు, దోతుడు = కుత్సితుడు, రక్కసుడు = రాక్షసుఁడు, దుందుభి = భేరి, మీటు = మ్రోగించు, ఇల = భూమి)

బ్రహ్మ వరాలు ఇవ్వగా బలగర్వంతో దేవతలను జయించిన ప్రఖ్యాతి తోను, "ఈశ్వరా" అంటూ ఏడ్చిన భక్తుడుగా, సీతను అపహరించిన దుర్మతిగా, స్త్రీలను పట్టి బలాత్కరించడంలో కుత్సితుడుగా, లోకంలో రావణుడు రాక్షసుల భేరీ మ్రోగించాడు.

మ॥ వలజన్ రంభనుఁ జూచి మోహమున తాఁ బ్రాలేయ శైలమ్మునన్
బలిమిన్నామె నమాంతముం జెఱచెనే పౌలస్త్యుఁడంచుం గడుం
గలఁతం జెంది శపించ నన్న కొడుకే, కామాంధు లంకేశుకున్
తలఁకయ్యెన్ తదనంతరమ్మున బలాత్కారంబులన్ జల్పుటల్..॥ 143 ॥

(వలజ = చక్కనిరూపుగల స్త్రీ, మోహము = చిత్తవైకల్యము, ప్రాలేయ = మంచు, శైలము = కొండ, అమాంతము = అకస్మాత్తు, చెఱచు = చెడగొట్టు, పౌలస్త్యుఁడు = రావణుఁడు, కడు = మిక్కిలి, కలఁత = మనస్సులో ఆందోళనము, శపించు = తిట్టు, లంకేశుడు = రావణుడు, తలఁకు = భయపడు, తదనంతరము = అటుపిమ్మట, బలాత్కారము = బలవంతము, చల్పు = చేయు)

చక్కని రూపు గల స్త్రీయైన రంభను చూచి చిత్తవైకల్యంతో తాను హిమాలయ పర్వతం మీద బలంతో అకస్మాత్తుగా ఆమెను పాడు చేశాడే రావణుడంటూ మిక్కిలి ఆందోళన చెంది అన్న (కుబేరుని) కుమారుడైన నలకూబరుడే శపించగా, కామంతో అంధుడైన రావణునికి అటుపిమ్మట బలాత్కారాలు చెయ్యడానికి భయమయ్యింది.

ఉ॥ వీరుడు, దిగ్విజేతయుఁ, గుబేరుని గెల్చిన రావణుండు, యం
డీరుఁడు, కాముకుండుఁ, బురుడించెను యింద్రుని, స్త్రీలఁ గాంచినన్
జారుడు, శాపనార్థముల జానకి పట్టక గడ్డిపోచగా
దూరముఁ బెట్టినన్ తనదు దుర్దశ నెంచక మూఢుఁ డయ్యెనే..॥ 144 ॥

(అండీరుఁడు = బలవంతుఁడు, కాముకుఁడు = మైథునేచ్ఛ గలవాఁడు, పురుడించు = పోలికయగు, కాంచు = చూచు, జారుడు = వ్యభిచరించెడి పురుషుడు, శాపనార్థములు = తిట్లు, జానకి = సీత, దుర్దశ = దురదృష్టము, ఎంచు = గణించు, మూఢుఁడు = తెలివిలేనివాఁడు)

వీరుడు, దిక్కులను జయించిన వాడు, కుబేరుని జయించిన రావణుడు, బలవంతుఁడు, మైథునేచ్ఛ గలవాఁడు, ఇంద్రునికి పోలికయగు వాడు, స్త్రీలను చూస్తే వ్యభిచరించెడి పురుషుడు, తిట్లతో సీత పట్టించుకోకుండా గడ్డిపోచగా దూరము పెట్టినా కూడా తన దురదృష్టము లెక్కించక తెలివిలేని వాఁడయ్యాడే.

తే॥గీ॥ శ్లోకములు నాల్గిటి కడను చొప్పడు నుడి
వినగ, "రామ మనువ్రతా" యనెడి ప్రతిన
వరుసగా నుండు కుజ కున్న వ్రతముఁ దెలుప,
రావణునికి హెచ్చరికగా ప్రతిఘటించ,
పుట్టపుట్టు వారంభమున్ పుణికరించె
నిట్టి శైలికి మున్ముందుఁ బట్టు నివ్వ... ॥ 145 ॥

(కడ = చివర, చొప్పడు = వచ్చు, నుడి = మాట, రామ మనువ్రతా = రాముణ్ణి అనుసరించిన వ్రతము కలదానను, ప్రతిన = ప్రతిజ్ఞ, వరుస = క్రమము, కుజ = సీత, వ్రతము = నోము, హెచ్చరిక = సూచన, ప్రతిఘటించు = ఎదిరించు, పుట్టపుట్టువు = వాల్మీకిముని, ఆరంభము = ప్రారంభము, పుణికరించు = ఇచ్చు, ఇట్టి = ఇటువంటి, శైలి = భాషాసరణి, మున్ముందు = భవిష్యత్తులో, పట్టు = ఆధారము)

వాల్మీకి రామాయణంలోని అరణ్యకాండలో 47వ సర్గలోని 33, 34, 35, 36వ శ్లోకాలు "రామ మనువ్రతా" అనే పదాలతో ముగుస్తాయి. రావణుడు తన్ను అపహరించడానికి వచ్చి తొలుత ''నాకు పట్టమహిషివి కమ్ము'' అని ప్రలోభపెట్టినపుడు సీత ఆవేశంగా ఆతడికి చెప్పిన మాటలు ఈ నాలుగు శ్లోకాలు. అవి "రామ మనువ్రతా" అంటే "రాముణ్ణే అనుసరించిన వ్రతము కలదానను" అని అంతమవుతాయి. ఈ విధంగా ఒకే మకుటంతో కవిత్వం వ్రాయడానికి ఆద్యుడు వాల్మీకియేనేమో (వ్యాసభారతంలో కూడా ఇటువంటి ఉదాహరణలు దొరుకుతాయి. భగవద్గీతలో "శోకితు మర్హసి" అన్న మకుటంతో వరుస శ్లోకాలు 2వ అధ్యాయంలో ఉంటాయి.). శతక వాఙ్మయము అంతా ఈ భావనని దృష్టిలో ఉంచుకొని వృద్ధి చెందినదే. ఇక, పై పద్యంలో ఏముందో చూద్దాం.

సీత కున్న నోము తెలియఁ జేయడానికి రావణునికి సూచనగా ఎదిరించడానికి నాలుగు శ్లోకాల చివర వచ్చే మాట వింటే "రామ మనువ్రతా", అంటే "రాముణ్ణి అనుసరించిన వ్రతము కలదానను" అనే అర్థము వచ్చే ప్రతిజ్ఞ వరుసగా ఉంటుంది. ఆది కవియైన వాల్మీకి ఇటువంటి శైలికి భవిష్యత్తులో పట్టు నివ్వడానికి ప్రారంభం ఇచ్చాడు.

తే॥గీ॥ ప్రాణములకు తెగించి ధర్మమునుఁ గావ
వలయు నన్నట్టి నీతి మనలకుఁ జెప్పఁ,
బోరుచు జటాయువు కుజనుఁ జూఱపెట్టు
రావణుని తోడ ముదిమిని, మ్రందెఁ గడను... ॥ 146 ॥

(తెగించు = సాహసించు, కాయు = రక్షించు, పోరు = యుద్ధము చేయు, కుజ = సీత, చూఱపెట్టు = దొంగిలించు, ముదిమి = ముసలితనము, మ్రందు = చచ్చు, కడను = చివరకు)

ప్రాణాలకు తెగించి ధర్మాన్ని కాపాడాలి అనే నీతి మనకి చెప్పడానికి సీతను అపహరించు రావణునితో ముసలితనంలో యుద్ధము చేస్తూ జటాయువు చివరకు చనిపోయాడు.

తే॥గీ॥ విన్న లగ్నము నందేవి వెరజిన వెత
వలదు, తిరిగి పొందెదరు, రావణు డెరుగక
సీత నపహరించె నపుడెఁ, జింత యేల
ననుచు నన్నుఁ జూచి జటాయు వనునయించె... **॥ 147 ॥**

(వెరజు = దొంగిలించు, వెత = దుఃఖము, ఎరుగు = తెలియు, చింత = ఆలోచనము, అనునయించు = ఓదార్చు)

విన్న లగ్నంలో ఏవి దొంగిలించినా దుఃఖము వద్దు. తిరిగి దక్కించుకుంటారు. రావణుడు తెలియక ఆ సమయం లోనే సీతను అపహరించాడు. చింత ఎందుకు అంటూ నన్ను చూసి జటాయువు ఓదార్చాడు.

తే.గీ. తన యెదుటను యసువులుఁ బాసిన జటాయు
పక్షియు కబంధుడు విరాధు డా క్షణముల
యొంటరు లగుటచే నేను యొప్పు రీతి
నుత్తరక్రియ సలుపుట నుగ్గడించి
నాగరికతను వాల్మీకి బాగఁ జెప్పె... **॥ 148 ॥**

(అసువులు = ప్రాణములు, పాయు = విడుచు, క్షణము = సమయము, ఒంటరి = ఏకాకి, ఒప్పు = తగు, రీతి = విధము, ఉత్తరక్రియ = మృతులకుఁజేసెడి అపరకర్మ, సలుపు = చేయు, ఉగ్గడించు = ప్రకటించు, నాగరికత = సంస్కృతి, బాగ = బాగుగా)

తన ఎదురుగా ప్రాణాలు విడిచిన జటాయు పక్షి, కబంధుడు, విరాధుడు ఆ సమయాలలో ఏకాకు లవడం చేత నేను తగిన విధంగా అపరకర్మ చేయడం ప్రకటించి, సంస్కృతిని వాల్మీకి బాగా చెప్పాడు.

చం॥ గమనము మేఘమార్గమున, గమ్యమెటో తెలియంగ రాదు, చౌ
ర్యమున తనన్ గ్రహించె, నని రావణు దూరుచు స్త్రీధనమ్ము చి
ప్పమున బిగించిఁ బాయుట ప్లవంగము లారయ, భావనమ్మునన్
శమనము దక్కె తత్క్షణము జానకికిన్, బ్రతుకన్న యాశతో...॥ 149 ॥

(గమనము = ప్రయాణము, మార్గము = త్రోవ, గమ్యము = వెళ్ళే చోటు, చౌర్యము = దొంగతనము, గ్రహించు = స్వీకరించు, దూరు = నిందించు, స్త్రీధనము = పెండ్లి మున్నగు సమయములలో స్త్రీకిచ్చిన ధనము, చిప్పము = పెద్దమూట, బిగించు = క్రుక్కు, పాయు = విడుచు, ప్లవంగము = కోతి, ఆరయు = తెలిసికొను, భావనము = ఊహ, శమనము = శాంతి, దక్కు = లభించు, తత్క్షణము = అప్పుడు, జానకి = సీత, బ్రతుకు = జీవితము)

మేఘాల త్రోవలో ప్రయాణం, వెళ్ళేది ఎక్కడికో తెలియ రావడం లేదు, దొంగతనంతో తనని గ్రహించాడు అని రావణుణ్ణి నిందిస్తూ స్త్రీధనం మూటగట్టి విడవడం వానరులు తెలిసికొనగా ఆ క్షణంలో సీతకు జీవితం మీద ఆశతో ఊహల్లో శాంతి లభించింది.

తే॥గీ॥ నగల మూటను జార్చి వానరుల నడుమ,
నిస్సహాయుఁల కిటు సీత నెరవుఁ జూపెఁ
గానిఁ, గపులు, జటాయువుఁ గాటులాడి
నట్లు, చౌరవనుఁ జూప లేదచ్చెరువున... ॥ 150 ॥

(జార్చు = జారునట్లు చేయు, వానరుడు = కోతి, నడుమ = మధ్య, నిస్సహాయుడు = ఏమియు చేయలేని స్థితిలో ఉన్నవాఁడు, ఇటు = ఈప్రకారము, నెరవు = మార్గము, కపి = కోతి, కాటులాడు = కలహించు, చౌరవ = సాహసము, అచ్చెరువు = ఆశ్చర్యము)

నగల మూటను వానరుల మధ్యను జారవిడిచి నిస్సహాయులకు ఈ ప్రకారము సీత మార్గము చూపించింది కానీ, వానరులు ఆశ్చర్యంతో ఉండడం వలన జటాయువు కలహించినట్లు సాహసం చూపలేదు.

తే॥గీ॥ కైక వరములు యుక్తముఁ గావు కుజకు
ప్రాంతరమునకు నగలతోఁ బయన మగును
యన్నఁ బెద్దల మాటలు యర్థ మయ్యె
వాటి నామె జాడఁ దెలుప మూటఁ గట్టి
విడువ వానరుల నడుమ విన్ను నుండి... ॥ 151 ॥

(యుక్తము = తగినది, కుజ = సీత, ప్రాంతరము = అడవి, జాడ = ఆచూకి, వానరము = కోతి, నడుమ = మధ్య, విన్ను = ఆకాశము)

అయోధ్య కాండలోని 38వ సర్గములో సీతారామలక్ష్మణులు వనవాసానికి వెళుతూ సెలవు తీసుకోవడానికి దశరథుని దగ్గరకు వచ్చినప్పుడు జరిగిన సంభాషణలలో వశిష్ఠుడు, దశరథుడు కైక వరాలు రాముని పైనే కానీ సీత పైన ఏ ప్రభావం చూపవనీ సీత సర్వాలంకార భూషితురాలై అడవికి వెళ్ళాలనీ తీర్మానించారు. ఆ కారణంగా అప్పుడు ధరించిన ఆభరణాలు సీతకు రావణుడు తనను ఎత్తుకొని వెళ్తున్నప్పుడు మూట గట్టి పడెయ్యడానికి పనికి వచ్చాయి. ఇక, పద్యంలో ఏముందో చూద్దాం.

కైక వరములు సీతకు వర్తించవు, అడవికి నగలతో ప్రయాణ మవుతుంది అన్న పెద్దల మాటలు వాటిని ఆమె తన ఆచూకీ తెలియజేయడానికి మూట గట్టి వానరుల మధ్య ఆకాశం నుండి విడువగా అర్థమయ్యాయి.

తే॥గీ॥ నాడు దుఃఖ కారణములు మూడె యంచు
నీకుఁ జెప్పితి, నితరుఁడు తాఁకు సతియు,
రాజ్య హరణమ్ము, తండ్రి మరణ మనునవి,
జరుగ మూడును విధి నన్ను పరిహసించె... ॥ 152 ॥

(నాడు = ఆ సమయము, ఇతరుఁడు = అన్యుఁడు, తాఁకు = స్పృశించు, సతి = భార్య, హరణము = హరించుట, విధి = దురదృష్టము, పరిహసించు = ఎక్కిరించు)

అప్పుడు దుఃఖ కారణములు, ఇతరుఁడు స్పృశించిన భార్య, రాజ్యము హరించబడుట, తండ్రి చావు అనేవి మూడే అని నీకు చెప్పాను. మూడూ జరుగగా దురదృష్టము నన్ను ఎక్కిరించింది.

చం॥ మలుపునుఁ ద్రిప్పె నాడు కథ మంథరఁ గానకుఁ బంపు సాధనన్,
కలఁకునుఁ దెచ్చె శూర్పణఖఁ గల్లను రావణు భ్రాంతిఁ గొల్పి, తాఁ
దెలియక నిన్నుఁ దిట్టి పలుఁ దిప్పల కగ్గమయెన్ మహీజయే,
తలచిన నా ప్రమేయము యథార్థముగా యిట నేమి లేదుగా ॥ 153 ॥

(మలుపు = మళ్లించుట, త్రిప్పు = తిరుగఁజేయు, కాన = అడవి, సాధన = ఉపాయము, కలఁకు = యుద్ధము, కల్ల = అబద్ధము, భ్రాంతి = భ్రమ, కొల్పు = కొలుపు, తా = తాను, పలు = అనేకము, తిప్పలు = కష్టములు, అగ్గము = అధీనము, మహీజ = సీత, తలచు = ఆలోచించు, ప్రమేయము = జోక్యము, యథార్థము = నిజము, ఇట = ఇక్కడ)

మంధర అడవికి పంపే ఉపాయంతో నా కథ మలుపు త్రిప్పింది. శూర్పణఖ అబద్ధంతో రావణుణ్ణి భ్రమింప జేసి యుద్ధం తెచ్చింది. తాను అనుకోకుండా నిన్ను తిట్టి సీతే అనేకమైన కష్టాలకు అధీనమయ్యింది. ఆలోచిస్తే, నా జోక్యము నిజంగా ఇక్కడ ఏమీ లేదుగా.

తే॥గీ॥ అన్ని కోల్పోతి నను దుఃఖ మడవి కొచ్చి
మరచితినిఁ గాని, యిట సీత మాయమగుట
మరల తిరగతోడెను నాకు మనికితమ్ము,
గహన జీవన మందిదే కష్టతమము... ॥ 154 ॥

(కోల్పోవు = పోఁగొట్టుకొను, మరల = మళ్ళీ, తిరగతోడు = గతించిన లేదా మరుగునపడి ఉన్న వాటిని మళ్ళీ పైకి తీసుకొచ్చు, మనికితము = దుఃఖము, గహనము = అడవి, కష్టతమము = అత్యంత కష్టము)

అన్నీ పోఁగొట్టుకొన్నాను అన్న దుఃఖము అడవికి వచ్చి మరచిపోయాను గానీ, యిక్కడ సీత మాయమవడం నాకు దుఃఖాన్ని మళ్ళీ తిరగతోడింది. వనవాసంలో ఇదే అత్యంత కష్టమైనది.

ఉ॥ రావణు తోడి వైర మది, ప్రాంతర మందున సీత మాయమైఁ
బోవకఁ బూర్వమే మనకుఁ బుట్టెను, లక్ష్మణ! మౌని యాగముం
గావగ తాటకేయులనుఁ గాంచి యెదుర్కొను నాడె, వారలే
సేవకు లౌట రావణుని సెల్వున యాగము బుగ్గి సేయగన్... ॥ 155 ॥

(వైరము = విరోధము, ప్రాంతరము = అడవి, పూర్వము = ముందు, పుట్టు = జనించు, మౌని = ముని, కాయు = రక్షించు, తాటకేయుడు = తాటకి పుత్రుడు, సెల్వు = ఆజ్ఞ, బుగ్గి = భస్మము)

లక్ష్మణా! రావణునితో విరోధ మన్నది అడవిలో సీత మాయమై పోవక ముందే, ముని యాగం రక్షించడానికి తాటకి పుత్రులను చూచి ఎదిరించిన రోజునే, మనకు కలిగింది, వాళ్ళే రావణుని ఆజ్ఞతో యాగం నాశనం చెయ్యడానికి సేవకులు అవ్వడం వల్ల.

చం॥ అవనిజ జాడఁ జెప్పుమని యంబరమున్, యవనీరుహంబులన్
యవిషిని వాగులన్ పొదల నద్రుల కాల్వల పూలమొక్కలన్
నెవయుచు నుండు పక్షులను నిత్యగతిన్ వని నుండు ప్రాణులన్
యవరజుఁ నిన్నుఁ గోరితిని యార్తిని యేడ్చుచు యేమి తోఁచకన్ ॥ 156 ॥

(అవనిజ = సీత, జాడ = ఆచూకీ, అంబరము = ఆకాశము, అవనీరుహము = చెట్టు, అవిషి = నది, వాగు = సెలయేఱు, అద్రి = పర్వతము, నెవయు = ఎగురు, నిత్యగతి = వాయువు, వని = అడవి, అవరజుడు = తమ్ముడు, ఆర్తి = బాధ, తోఁచు = మనసున ఏర్పడు)

సీత ఆచూకీ చెప్పమని ఆకాశాన్ని, చెట్లని, నదిని, వాగులను, పొదలను, పర్వతాలను, కాలువలను, పూలమొక్కలను, ఎగిరే పక్షులను, వాయువును, అడవిలో ఉండే ప్రాణులను, తమ్ముడవైన నిన్ను, బాధతో ఏడుస్తూ ఏమీ తోఁచక కోరాను.

తే॥గీ॥ గేస్తురాలి జాడఁ దెలుపఁ గేకరించి
యడిగితి ప్రకృతి నంతను, యలిగి యెట్టి
స్పందనము లేకునికి, వినాశనముఁ జేయ
సిద్ధ పడగ, నీ వడ్డయిఁ జెప్పితి విటు,
యొకరిఁ దప్పుకు శిక్ష వేరొకరి కేల?... ॥ 157 ॥

(గేస్తురాలు = ఇల్లాలు, జాడ = ఆచూకీ, తెలుపు = తెలియఁజేయు, కేకరించు = కేకలువేయు, ప్రకృతి = పంచభూతములు, అలుగు = కోపించు, స్పందనము = కదలిక, లేకునికి = లేకపోవుట, సిద్ధపడు = సన్నద్ధమగు, అడ్డు = అవరోధము, ఇటు = ఈ ప్రకారము)

భార్య ఆచూకీ తెలియఁజేయమని కేకలువేస్తూ ప్రకృతి నంతటినీ అడిగాను. ఏ రకమైన కదలిక లేక పోవడం వల్ల కోపించి నాశనం చెయ్యడానికి సన్నద్ధమవ్వగా నీవు అడ్డుపడి ఈ విధంగా అన్నావు: ఒకరి తప్పుకు శిక్ష వేరొకరికి ఎందుకు?

తే॥గీ॥ ప్రేలితిని సీత స్మృతులతోఁ బిచ్చి వానిఁ
బోల్కిఁ, దరులఁ బర్వతములఁ బుట్ట లందు
వెదకి, యన్నిట నా సీతను దరిసించ
స్మరణ కొచ్చిన మాటలు మరల వినుము... ॥ 158 ॥

(ప్రేలు = వదరు, స్మృతి = తలపు, పోల్కి = పోలిక, తరులు = చెట్లు, పుట్ట = చిన్నపొద, వెదకు = అన్వేషించు, దరిసించు = చూచు, స్మరణ = జ్ఞప్తి, మరల = మళ్ళీ)

సీత తలపులతో పిచ్చివాడి లాగా వదరాను. చెట్లలోను పర్వతాలలోను చిన్న పొదల్లోను అన్వేషించి అన్నిటిలోను నా సీతను చూడగా జ్ఞప్తి కొచ్చిన మాటలు మళ్ళీ వినుము.

కం॥ నొచ్చుకొను చుంటివా? నే
వచ్చెదనని యెదురుఁ జూచు బాధ సహించన్,
విచ్చేయ నాకు నాత్రమె,
విచ్చేసిన నీ విడుదల వేగమెఁ జేతున్... ॥ 159 ॥

(నొచ్చుకొను = పశ్చాత్తాపపడు, సహించు = ఓర్చు, విచ్చేయు = వచ్చు, ఆత్రము = తొందర, విడుదల = విమోచనము)

నే వస్తానని ఎదురు చూసే బాధ తట్టుకోవడానికి పశ్చాత్తాపపడుతున్నావా? రావడానికి నాకు కూడా తొందరే. వస్తే నీ విమోచనము వేగంగా చేస్తాను.

కం॥ ముందుగ నీవున్నప్పుడు
తొందర రెక్కలను విప్పి తుంటరి యయ్యెన్

యందము కొంటెగ విందుల
సందడి జేయంగ నుల్లసంబున యడరెన్.... **॥ 160 ॥**

(తొందర = సంభ్రమము, తుంటరి = దుష్టుఁడు, కొంటె = చెడ్డ తలంపు లేని అల్లరితనము, విందు = ఆతిథ్యము, సందడి = కోలాహలము, ఉల్లసము = సంతోషము, అడరు = అతిశయించు)

నీవు ముందు ఉన్నప్పుడు తొందర అన్నది రెక్కలు విప్పి స్వేచ్ఛగా చెడ్డది అయ్యింది. అందము అల్లరిగా విందుల కోలాహలము చేయడానికి సంతోషంతో అతిశయించింది.

కం॥ నీ మాటలు, నీ యలకయు,
నీమంబుల నాచరించు నీఁ దేఁకువ, యే
గోమాయువుఁ బాల్పడెనో,
నా మనసునుఁ గుదుపు చుండె నడమంత్రంబై... **॥ 161 ॥**

(అలక = కోపము, నీమము = నియమము, ఆచరించు = పాటించు, తేఁకువ = ధైర్యము, గోమాయువు = నక్క, పాల్పడు = స్వాధీనమగు, కుదుపు = కదలించు, నడమంత్రము = లేని ఆధిక్యమును ప్రదర్శించుట)

నీ మాటలు నీ కోపము నియమాలు పాటించే నీ ధైర్యము ఏ నక్క పాలయ్యాయో, నా మనసును నడమంత్రమై కదలిస్తోంది.

కం॥ నిన్నే నా దేవతగా
కన్నులలో దాచుకొంటి కమనీయముగా
యన్నుల మిన్నవు నినుఁ జే
కొన్న దినము వచ్చె తలఁపుకు మదిన్ కలఁచన్... **॥ 162 ॥**

(కమనీయము = మనోహరమైనది, అన్ను = స్త్రీ, మిన్న = ఎక్కువ, చేకొను = పెండ్లాడు, దినము = రోజు, తలఁపు = జ్ఞప్తి, మది = మనస్సు, కలఁచు = క్షోభపెట్టు)

నిన్నే నా దేవతగా కళ్ళల్లో మనోహరంగా దాచుకున్నాను. స్త్రీలలో గొప్పదానివైన నిన్ను పెళ్ళి చేసుకున్న రోజు మనస్సును క్షోభపెట్టడానికి జ్ఞప్తికి వచ్చింది.

తే॥గీ॥ సీత యున్నపు డున్నట్టిఁ జెన్నుఁదనము
సీత లేనపుడు వికార శీల మందె,
విరుల సీత నిశ్వాసము గుఱుతు కొచ్చె,
లేడి కనులు జానకి వని రేఁపె మరులు,
విరహ దుఃఖము మెండయ్యె విపిన మందు... ॥ 163 ॥

(చెన్నుఁదనము = అందము, వికార = వికృతి, శీలము = స్వభావము, విరి = పువ్వు, నిశ్వాసము = నిట్టూర్పు, గుఱుతు = గుర్తు, జానకి = సీత, రేఁపు = పురికొలుపు, మరులు = మోహము, విరహ = ఎడఁబాటు, మెండు = ఎక్కువ, విపినము = అడవి)

సీత ఉన్నప్పుడు ఉన్న అందము సీత లేనప్పుడు వికృత స్వభావాన్ని పొందింది. పూలలో సీత నిట్టూర్పు గుర్తుకు వచ్చింది. లేడి కళ్ళు సీతవి అని మోహం రేపాయి. అడవిలో ఎడఁబాటు వల్ల వచ్చిన దుఃఖము ఎక్కువ అయ్యింది.

తే॥గీ॥ వెరవుఁ జెప్పె కబంధుడు ధరణిజను నె
మకగఁ జెలిమి సుగ్రీవుడను కపి తోడఁ
జేయు మనుచు, దాని నమలుఁ జేయ మనకు
సుగమ మయ్యె మార్గము రాక్షసుల జయింప... ॥ 164 ॥

(వెరవు = ఉపాయము, ధరణిజ = సీత, నెమకు = అన్వేషించు, చెలిమి = స్నేహము, కపి = వానరుడు, అమలుచేయు = ఆచరణలోకి తెచ్చు, సుగమము = సులువు)

సీతను అన్వేషించడానికి సుగ్రీవుడనే వానరునితో స్నేహం చెయ్యమని కబంధుడు ఉపాయం చెప్పాడు. దానిని ఆచరణలోకి తేవడం వల్ల మనకు రాక్షసులను గెలవడానికి మార్గము సులువు అయ్యింది.

రామ సుగ్రీవుల మైత్రి:

తే॥గీ॥ పట్టి బంధించ నిను ధాత్రిఁ జుట్టుఁ గాని
పెడచెవినిఁ బెట్టునె? ముని సాపెనను, వాలి
ఋష్యమూకము పైకి, సుగ్రీవ! రాడుఁ
గాన, శాంతి నుండు మనియె గాలిచూలి... ॥ 165 ॥

(ధాత్రి = భూమి, చుట్టు = తిరుగు, పెడచెవినిఁ బెట్టు = అలక్ష్యము చేయు, సాపెన = శాపము, గాలిచూలి = హనుమంతుడు)

నిన్ను పట్టి బంధించడానికి భూలోకము చుట్టుతాడు కానీ ముని శాపాన్ని అలక్ష్యము చేస్తాడా? సుగ్రీవా! ఋష్యమూక పర్వతము మీదికి వాలి రాడు గనుక శాంతంగా ఉండమని హనుమ అన్నాడు.

ఉ॥ వారలు రామలక్ష్మణులు, వచ్చిరి, సూర్యజ! మైత్రి సేయ, కం
జార కులావతంసమును సాకఁ దగున్ నృపతుల్, నరేశ్వరా!
వారల సాయముం గొనుచు వాలినిఁ జంపుము, సీత జాడకై
వారికి సాయ మిమ్మనుచు వాయుసుతుండనె, మేలుఁ గోరుచున్ ॥ 166 ॥

(సూర్యజ = సూర్య పుత్రుడైన సుగ్రీవుడు, మైత్రి = స్నేహము, కంజారుడు = సూర్యుడు, అవతంసము = శ్రేష్ఠవాచకము, సాఁకు = కాపాడు, నృపతి = రాజు, నరేశ్వరుడు = రాజు, జాడ = ఆచూకీ, వాయుసుతుడు = హనుమంతుడు)

సుగ్రీవా! వాళ్ళు రామలక్ష్మణులు, స్నేహం చేయడానికి వచ్చారు. రాజా! ఇనకుల శ్రేష్ఠుడు రాజులు కాపాడ తగిన వాడు. వారి సాయం తీసుకొని వాలిని చంపుము. సీత ఆచూకీకి వారికి సాయం ఇవ్వు అని హనుమంతుడు మేలు కోరుతూ చెప్పాడు.

శా॥ సాహాయ్యంబును రామలక్ష్మణులకున్ సఖ్యంబునన్ గూర్పఁ బ్రో
త్సాహం బిచ్చుచు వాయుజాతు డనె, నందంతుండు సుగ్రీవుకున్
బాహాటమ్ముగ, వాలి సూచకులు సంప్రాపించి నారన్న సం
దేహమ్మున్ విడనాడిఁ జూడుము, సఖా! ధీరత్వ మేపారఁగన్ ॥ 167 ॥

(సాహాయ్యము = సహాయత్వము, సఖ్యము = స్నేహము, కూర్చు = కూడబెట్టు, ప్రోత్సాహము = మిక్కిలి ఉత్సాహము, వాయుజాతుడు = హనుమంతుడు, నందంతుడు = రాజు, బాహాటము = బహిరంగము, సూచకుడు = గూఢచారి, సంప్రాపించు = సమీపించు, విడనాడు = త్యజించు, సఖుడు = మిత్రుడు, ధీరత్వము = ధైర్యము, ఏపారు = అతిశయించు)

రామలక్ష్మణులకు సహాయతను స్నేహంతో కూర్చడానికి ప్రోత్సాహం ఇస్తూ రాజైన సుగ్రీవునితో హనుమ బహిరంగంగా వాలి గూఢచారులు సమీపించారన్న సందేహం వదిలిపెట్టి ధైర్యం అతిశయించగా చూడు మిత్రమా! అని అన్నాడు.

ఉ॥ కాముకుఁడైన వాలి బల గర్వితుఁడై, సహజన్ముఁ జోపి, భా
ర్యామణియౌ రుమన్, దశరథాత్మజ! బందినిఁ జేసె నంచు, యీ
రాముని కంజనాసుతుడు లజ్జితుడై మొరపెట్ట, నార్కికిన్
క్షేమముఁ గూర్చితిన్ దనరు స్నేహముతో తన వాంఛఁ దీర్చగన్ ॥ 168 ॥

(కాముకుఁడు = మైథునేచ్ఛ గలవాఁడు, గర్వితుఁడు = గర్వించినవాఁడు, సహజన్ముఁడు = సోదరుఁడు, చోపు = పారద్రోలు, దశరథాత్మజ = దశరథుని పుత్రుడైన రామా, బంది = నిర్బంధము, అంజనాసుతుడు = అంజన పుత్రుడైన హనుమ, లజ్జితుఁడు = సిగ్గుపడినవాఁడు, మొరపెట్టు = విన్నవించు, ఆర్కి = సుగ్రీవుడు, క్షేమము = భద్రము, కూర్చు = కలిగించు, తనరు = అతిశయించు, వాంఛ = కోరిక, తీర్చు = నెఱవేర్చు)

రామా! కాముకుడైన వాలి బలగర్వంతో తమ్ముని పారద్రోలి భార్యయైన రుమను బందిని జేశాడు అంటూ ఈ రామునికి హనుమ సిగ్గుతో విన్నవించగా, సుగ్రీవునికి అధికమైన స్నేహంతో తన కోరిక తీర్చడానికి భద్రము కలిగించాను.

తే॥గీ॥ అగ్ని సాక్షిగ స్నేహము నార్కి తోడఁ
జేయ, యెడమ కన్నదిరెను సీతకు, దశ
కంఠుఁనికి, వాలికి, నెలఁతుకలకు శుభము

పురుషుల కశుభ మంచు చెప్పుటకు మనకు,
యిట్టి లాంఛనము ప్రజ నాఁకట్టు కొనును... **॥ 169 ॥**

(ఆర్కి = సుగ్రీవుడు, మైత్రి = స్నేహము, దశకంఠుఁడు = రావణుడు, నెలఁతుక = స్త్రీ, లాంఛనము = చిహ్నము, ప్రజ = లోకులు, ఆఁకట్టుకొను = ఆకర్షించు)

సుగ్రీవునితో అగ్నిసాక్షిగా స్నేహం చేయగా, సీతకు, రావణునికి, వాలికి ఎడమ కన్ను అదిరింది. స్త్రీలకు శుభమని పురుషులకు అశుభమని మనకు చెప్పడానికి, ఇటువంటి చిహ్నము లోకులను ఆకర్షిస్తుంది.

తే॥గీ॥ తల్లి మాఱుమనువు సంతు తరుణుఁ లైన
నప్పునే? సంప్రదాయమ్ము లొప్పుకొన్న,
యన్న భార్యనుఁ జేకొన్న యార్కి యన్న
యంగదుడు యాదరము లేక యడలె సతము... **॥ 170 ॥**

(మాఱుమనువు = ఆడదానికి రెండవ వివాహము, సంతు = సంతానము, తరుణుఁడు = యౌవనవంతుఁడు, నప్పు = సరిపోవు, సంప్రదాయము = పరంపరాప్రాప్త ధర్మము, ఒప్పుకొను = సమ్మతించు, చేకొను = పెండ్లాడు, ఆర్కి = సుగ్రీవుఁడు, ఆదరము = గౌరవము, అడలు = భయము, సతము = ఎప్పుడు)

తల్లి రెండవ వివాహము సంప్రదాయాలు సమ్మతించినా సంతానం యువకులైతే నప్పుతుందా? అన్న భార్యను పెండ్లాడిన సుగ్రీవుఁడు అంటే అంగదుడు గౌరవం లేక ఎప్పుడూ భయపడేవాడు.

తే॥గీ॥ జాడఁ దెలియనిఁ బతి యున్న జాయ, మాఱు
మనువుకు కనీస మెంత సమయము వేచి
యుండ వలయునో, నియమంబు లున్న యెడల
శుల్వములను, సుగ్రీవుండు యల్వరించి
యుండు, యవి లేక వానికిఁ గీడుఁ గలిగె... **॥ 171 ॥**

(జాడ = ఆచూకీ, పతి = భర్త, జాయ = భార్య, మాఱుమనువు = ఆడదానికి రెండవ వివాహము, కనీసము = అధమము, వేచు = ఎదురుచూచు, శుల్వము = ఆచారము, అల్వరించు = అలవాటు జేసికొను, కీడు = ఆపద)

ఆచూకీ తెలియని భర్త ఉన్న భార్య రెండవ వివాహానికి అధమము ఎంత కాలము ఎదురు చూడాలో ఆచారంలో నియమాలు ఉంటే సుగ్రీవుడు అలవాటు చేసుకొని ఉండేవాడు. అవి లేక వానికి ఆపద కలిగింది.

వాలి వధ:

కం॥ ఒక లాగు యిద్ద రుండిన
యొకరినె దండించఁ గలుగ, యొడికముగా యా
ర్కికి మాలను తొడిగిన నీ
యకలంక ధిషణ వలననె, యడఁచితి వాలిన్... ॥ 172 ॥

(లాగు = విధము, దండించు = శిక్షించు, ఒడికము = ఉపాయము, ఆర్కి = సుగ్రీవుఁడు, మాల = పూదండ, తొడుగు = అలంకరించు, అకలంక = నిర్దుష్టమైన, ధిషణ = బుద్ధి, అడఁచు = చంపు)

ఒకే విధంగా ఇద్దరు ఉంటే ఒకరినే శిక్షించ గలగడానికి, ఉపాయంగా సుగ్రీవుడికి పూదండ అలంకరించిన నీ నిర్దుష్టమైన బుద్ధి వల్లనే వాలిని చంపాను.

కం॥ పాపులు దండితులై యా
పాప విముక్తిఁ బడయగనె స్వర్గము దక్కున్,
పాపము రాజుకు తగులును
పాపిని శిక్షించునట్టి బాధ్యత మరువన్... ॥ 173 ॥

(పాపి = పాపము గలవాఁడు, దండితుడు = శిక్షింపఁబడినవాఁడు, విముక్తి = నివృత్తి, పడయు = పొందు, దక్కు = లభించు, తగులు = సోకు)

పాపులు శిక్షింపఁబడి ఆ పాపం నుండి నివృత్తి పొందగానే స్వర్గము లభిస్తుంది. పాపిని శిక్షించే బాధ్యత మరచిపోతే పాపము రాజుకు తగులుతుంది.

కం॥ చక్కనిది మధ్యమార్గము,
యెక్కుడు ద్వేషంబుఁ దోడ నేర్పడు పొత్తుల్
యెక్కుడు మక్కువఁ జూపుట
గ్రక్కున వీడుమని వాలి ప్రవచన మిచ్చెన్... ॥ 174 ॥

(ఎక్కుడు = అధికము, ద్వేషము = పగ, పొత్తు = బంధము, మక్కువ = ప్రేమ, గ్రక్కున = శీఘ్రముగా, వీడు = వదలు, ప్రవచనము = గొప్పమాట)

మధ్యమార్గము (middle path) చక్కనిది, అధికమైన పగతో ఏర్పడే బంధాలు అధికమైన ప్రేమ చూపించడం శీఘ్రముగా వదల మని వాలి గొప్ప మాట చెప్పాడు.

ఉ॥ కాలమె సాధనమ్ము మనఁ గర్మలకున్, నడిపించ నెల్లరన్
కాలమె ముఖ్యమైన గతి, కాలము నెవ్వరు మార్చ జాలరే,
కాలమె సర్వఁ బ్రేరణలఁ గారణమై విధిఁ గూర్చు జీవులన్,
కాలముఁ బక్షపాతము వికారము లేనిది, లొంగ దేరికిన్,
కాలము నందు మార్పులకుఁ గారణముల్ బరికించగా వలెన్,
కాలపుఁ దారతమ్యములఁ గైవడిఁ జెప్పెడి శాస్త్ర ముండులే,
కాలముచెల్లె వాలి కని కాగల కార్యము బోధఁ జేసితిన్... ॥ 175 ॥

(కర్మ = సంకల్పము, ఎల్లరు = అందరు, గతి = దిక్కు, ప్రేరణ = పురికొలుపడము, విధి = కర్తవ్యము, కూర్చు = కలిగించు, పక్షపాతము = రెండు పక్షములలో నొక పక్ష మభిమానించుట, వికారము = మాఱురూపు, లొంగు = లోబడు, ఏరికి = ఎవరికి, పరికించు = విచారించు, తారతమ్యత = తరతమభావము, కైవడి = విధానము, కాలముచెల్లు = మరణించు)

మన సంకల్పములకు సాధనము కాలమే. మనల్ని నడిపించడానికి కాలమే ముఖ్యమైన గతి. కాలాన్ని ఎవ్వరూ మార్చలేరు కదా. కాలమే అన్ని రకాల ప్రేరణలకు కారణమై ప్రాణులకు కర్తవ్యము నిర్వచిస్తుంది. కాలానికి పక్షపాతము వికారము ఉండవు. దేనికీ కాలం లొంగదు. కాలంలో వచ్చే మార్పులకు కారణాలను

విచారించాలి. కాలానికి సంబంధించిన తారతమ్యతల విధానము చెప్పే శాస్త్రము ఉంటుందిలే (ఇదే తరువాతి కాలంలో వచ్చిన ఐన్‌స్టీన్ (Einstein) గారి "theory of relativity" అనబడే "సాపేక్షత సిద్ధాంతం"). వాలికి కాలం చెల్లింది కనుక చెయ్యాల్సిన పని చెప్పాను, అక్కడ.

సీతాన్వేషణకు సన్నాహాలు:

ఉ॥ ఆలముఁ జేయుచుండ నొక యమ్మును చాటున నుండి వేసి, నే
వాలినిఁ జంపి సూర్యజునిఁ బార్థివుఁ జేయుట విస్మరించ, యా
జ్వాలము యార లేదనుచు, జానకి జాడ కనుంగొనన్ శర
త్కాలము వచ్చె నంచనుచు, తారకుఁ జెప్పితి వీవె, సోదరా!...॥ 176 ॥

(ఆలము = యుద్ధము, చాటు = మఱుగు, సూర్యజుడు = సుగ్రీవుడు, పార్థివుఁడు = రాజు, విస్మరించు = మఱచిపోవు, జ్వాలము = అగ్నిశిఖ, ఆరు = చల్లారు, జానకి = సీత, జాడ = ఆచూకీ, శరత్కాలము = శరదృతువు, ఈవు = నీవు)

తమ్ముడా! యుద్ధము చేస్తూ ఉండగా ఒక బాణాన్ని చాటు నుండి వేసి నేను వాలిని చంపి సుగ్రీవుని రాజును చేయడం మరచిపోవడానికి ఆ మంట చల్లార లేదనీ, సీత జాడ కనుక్కోవడానికి శరత్కాలం వచ్చిందనీ, అంటూ తారకు చెప్పింది నువ్వే.

తే॥గీ॥ దొంగతనమునకును, వ్రత భంగమునకు,
గోవును వధించ, మద్యముఁ ద్రావఁ, గల్గు
పాపములకు నిష్కృతి యుండుఁ, బ్రాచిత మస
లుండదు కృతఘ్నుఁని కని నీ వుగ్గడించఁ,
దప్పుఁ దెలిసి సుగ్రీవుడుఁ దెప్పరిల్లె... ॥ 177 ॥

(వ్రతము = వ్రత నియమము, భంగము = చెరుపు, త్రావు = త్రాగు, కల్గు = కలుగు, నిష్కృతి = ప్రాయశ్చిత్తము, ప్రాచితము = ప్రాయశ్చిత్తము, అసలు = నిజంగా, కృతఘ్నుఁడు = చేసినమేలు మఱచినవాఁడు, ఉగ్గడించు = ప్రకటించు, తెప్పరిల్లు = తెలివిగొను)

దొంగతనానికి వ్రత నియమభంగానికి గోవధకు కల్లు త్రాగితేను కలిగే పాపాలకు ప్రాయశ్చిత్తము ఉంటుంది. చేసిన మేలు మఱచినవాఁడికి ప్రాయశ్చిత్తము ఏమాత్రం ఉండదు అని నువ్వు ప్రకటించగా తప్పు తెలుసుకొని సుగ్రీవుడు తెలివిగొన్నాడు.

తే॥గీ॥ వానకాలము గడచెను వానరేంద్ర!
సంబరమ్ములా? రీఢయా? సఖ్యమందు,
యేల జాగు, పులుగు నేలచూఁలి దరయ?
యనుచు నేను క్రోధించితి నార్కి పైన... ॥ 178 ॥

(గడచు = పూర్తియగు, వానరేంద్ర = వానర రాజ, సంబరము = వేడుక, రీఢ = తిరస్కారము, సఖ్యము = స్నేహము, జాగు = ఆలస్యము, పులుగు = జాడ, నేలచూఁలి = సీత, అరయు = విచారించు, ఆర్కి = సుగ్రీవుడు)

వానాకాలం వెళ్ళి పోయింది, వానర రాజా! వేడుకలా తిరస్కారమా స్నేహంలో, సీత ఆచూకీ విచారించడానికి ఆలస్యం ఎందుకు? అంటూ నేను సుగ్రీవుని పైన కోపించాను.

కం॥ వెనుకాడను వీడుటకై
ధనమును, దేశమును, సమ్మదమునైనను రా
ముని నెయ్యము కోస మనుచు
నను సుగ్రీవు డిటు సాంత్వనఁ బరచె, వినుమా!... ॥ 179 ॥

(వీడు = వదలు, సమ్మదము = సంతోషము, నెయ్యము = స్నేహము, ఇటు = ఈ ప్రకారము, సాంత్వనఁ బరచు = ఓదార్చు)

రాముని స్నేహం కోసము ధనాన్ని దేశాన్ని సంతోషాన్నైనా వదలడానికి వెనుకాడను అంటూ నన్ను సుగ్రీవుడు ఈ విధంగా ఓదార్చాడు, విను.

కం॥ ప్రాణాపాయముఁ గలుగ, వి
ధాన మనిన యాశఁ గలుగ, దబ్బర యైనన్,

మానుకొనడుఁ గర్తవ్యము
జ్ఞానముతో మెలగు ధైర్యశాలి, వసిగొనున్... **॥ 180 ॥**

(విధానము = ధనము, దబ్బర = ఆపద, వసిగొను = ఉత్సహించు)

ప్రాణాపాయం వచ్చినప్పుడు ధనాశ కలిగినప్పుడు ఆపద వచ్చినప్పుడు జ్ఞానంతో మెలిగే ధైర్యవంతుడు కర్తవ్యము మానుకోడు, ఉత్సహిస్తాడు.

ఉ॥ ఆనకఁ జూపుఁ జూడ నగ లశ్రువు లందున, నిన్నుఁ గోరగన్,
నేను నమస్కరించు తరి నిత్యముఁ జూతునుఁ గాలి యందెలన్
జానకివే యివంచునుఁ బ్రజాగర మొప్పగ నీవుఁ జెప్పగా,
వానర రాజు యార్కి తన వారినిఁ బంపెను సీత జాడకై... ॥ 181 ॥

(ఆను = కనఁబడు, చూపు = దృష్టి, అశ్రువులు = కన్నీళ్ళు, తరి = సమయము, నిత్యము = ప్రతి రోజు, అందె = నూపురం, జానకి = సీత, ప్రజాగరము = జాగరూకత, ఆర్కి = సుగ్రీవుడు, జాడ = ఆచూకీ)

నగలు చూడడానికి కన్నీళ్ళలో చూపు ఆనక నిన్ను కోరగా, నేను ప్రతి రోజు నమస్కరించే సమయంలో పాదనూపురములు చూస్తాను, సీతవే ఇవి అంటూ జాగ్రత్తగా నీవు చెప్పగా వానర రాజైన సుగ్రీవుడు తన వారిని సీత ఆచూకీ కోసం పంపాడు.

తే॥గీ॥ భయము నుద్రిక్తతయునుఁ దోడయిన వేళ
కార్య సాధనకు జయముఁ గలుగు చుండు,
వాలిఁ దరుమ సుగ్రీవుడుఁ బారిఁ బారి
లోక మంతయుఁ దిరుగుచు యాకళించ,
యతడి యెరుకయె సీతను వెతుక నొదవె... **॥ 182 ॥**

(ఉద్రిక్తత = ఉద్రేకము, తోడు = సహాయముగా పోవు, తరుము = వెంబడించు, పారు = పరుగెత్తు, ఆకళించు = తెలిసికొను, ఎరుక = జ్ఞానము, వెతుకు = అన్వేషించు, ఒదవు = ఉపయోగించు)

భయము ఉద్రేకము జతగా ఉన్న వేళ కార్యసాధనకు జయం కలుగుతూ ఉంటుంది. వాలి వెంబడించగా సుగ్రీవుడు పరుగెత్తి పరుగెత్తి లోకము అంతా తిరుగుతూ తెలుసుకొనగా అతడి జ్ఞానమే సీతను అన్వేషించడానికి ఉపయోగపడింది.

తే॥గీ॥ మునుము లుండు నెగుర ఖగములకు, గ్రద్ద
లైదు నెగురు, హంస లెగురు నారున, యరు
ణు గరుడు లెగురుదురు మీదను, కపు లార!
కోళ్ళకు చరణముల చెంతఁ గూడు నిచ్చు
ధాత మాకు దూరముగ సంధాన పరచె,
గరుడు కున్న మహిత దృష్టిఁ గలదు నాకు,
జలధి కావలి గట్టునఁ గలదు సీత
లంక యందని సంపాతి శంకఁ దీర్చె,
మార్గము సుగమంబయి హనుమ నట కంప... ॥ 183 ॥

(మునుము = ఎగిరే ఎత్తుకు ముడిపడ్డ మార్గము, ఖగము = పక్షి, గరుడుడు = గరుత్మంతుడు, మీద = పైన, కపి = వానరుడు, చరణము = కాలు, చెంత = సమీపము, కూడు = భోజనము, ధాత = బ్రహ్మ, సంధాన = కూర్చుట, మహిత = గొప్పది, జలధి = సముద్రము, ఆవలి = అవతలి, శంక = సందేహము, తీర్చు = తొలగించు, సుగమము = సులువు, అట = అక్కడ)

పక్షులు ఎగరడానికి మునుములు ఉంటాయి, గ్రద్దలు ఐదులో ఎగురుతాయి, హంసలు ఆరున ఎగురుతాయి, దాని పైన అరుణుడు గరుత్మంతుడు ఎగురుతారు. ఓ, కపులారా! కోళ్ళకు పాదాల దగ్గర ఆహారం ఇచ్చిన బ్రహ్మ మాకు దూరంగా ఏర్పాటు చేశాడు. గరుత్మంతుడికి ఉన్న గొప్ప దృష్టి నాకు ఉంది, సముద్రానికి అవతలి గట్టున లంకలో సీత ఉంది అని మార్గము సులువు అయ్యి హనుమను అక్కడకు పంపడానికి వీలుగా సంపాతి సందేహం తీర్చాడు.

తే॥గీ॥ గాటముఁ గద గంధర్వుల కామము, యధి
కమ్ము కోప మురగముల, కలక హెచ్చు

హరిణముల, ఖగముల మెండు యాకలి యని
వార్ధి తటమున సంపాతి వానరులకుఁ
జెప్ప, శబ్దించె నరు కన్ని స్ఫీత మనుచు... ॥ 184 ॥

(గాటము = అధికము, కామము = కోరిక, ఉరగము = పాము, కలక = భయము, హెచ్చు = ఎక్కువ, హరిణము = లేడి, ఖగము = పక్షి, మెండు = ఎక్కువ, వార్ధి = సముద్రము, తటము = ఒడ్డు, శబ్దించు = ధ్వనించు, నరుడు = మానవుడు, స్ఫీతము = అధికమైనది)

గంధర్వులలో కామము అధికం కదా, పాములలో కోపం ఎక్కువ, లేళ్ళలో భయం ఎక్కువ, పక్షులలో ఆకలి ఎక్కువ అని సముద్రం ఒడ్డున సంపాతి వానరులకు చెప్పగా (వాల్మీకి రామాయణం కిష్కింధా కాండములో 59వ సర్గములో సంపాతి సీతాన్వేషణకు బయలుదేరిన అంగదాదులకు చెప్పిన మాటలు ఇంత వరకే) మానవులలో అన్నీ ఎక్కువే అని ధ్వనించింది (ఇది శ్రీరాముని అనుమితి [inference]).

సీతాన్వేషణ:

తే॥గీ॥ వంద యోజనముల దూర మందు లంకఁ
జేర వాయు మార్గమున సామీరిఁ గదల,
నడుమ సింహిక, సురస, మైనాకు లడ్డుఁ
బడగ వారిని తొలగించు పగిదిఁ దెలుపు,
ధిషణ నేర్పు ధైర్యము సూక్ష్మదృష్టి యుండి,
కార్యసిద్ధిఁ గలుగఁ బడు కక్కసములు... ॥ 185 ॥

(సామీరి = హనుమంతుఁడు, నడుమ = మధ్య, అడ్డుపడు = అడ్డమువచ్చు, తొలగించు = తీసివేయు, పగిది = విధము, తెలుపు = ఎరిగించు, ధిషణ = బుద్ధి, కార్యసిద్ధి = కార్యంలో సఫలత, కక్కసము = కష్టము)

వంద యోజనాల దూరంలో లంక చేరడానికి ఆకాశ మార్గంలో హనుమంతుడు కదలగా మధ్యలో సింహిక, సురస, మైనాకులు అడ్డుపడగా వారిని తొలగించిన విధము బుద్ధి నేర్పు ధైర్యము సూక్ష్మదృష్టి ఉండి కార్య సఫలత కలుగడానికి పడే కష్టాలు తెలియజేస్తుంది.

ఉ॥ లంకనుఁ జేరి యానిలుఁడు లంకను రక్కసి నుక్కడంచి యా
శంకనుఁ జూచె పెక్కు వనజాక్షులఁ, జిత్తవికార మొచ్చునన్
జంకది లేక యా నడుమ జానకిఁ గన్గొనఁ, బట్టు వీడకన్
యంకిత భావ ముంచఁ దుద కామెనుఁ గాంచె నశోక వాటికన్ ॥ 186 ॥

(ఆనిలుఁడు = హనుమంతుడు, రక్కసి = రాక్షసి, ఉక్కడంచు = గర్వము నణఁచు, ఆశంక = సందేహము, పెక్కు = అనేక, వనజాక్షి = స్త్రీ, చిత్తవికారము = మనస్సులో పుట్టిన తెవులు, జంకు = భయము, నడుమ = మధ్య, జానకి = సీత, కన్గొను = కనుఁగొను, పట్టు వీడు = పట్టు వదలు, అంకితభావము = స్వార్థము లేకుండ చూపు నిష్ఠ, తుద = చివర, కాంచు = చూచు, వాటిక = ఉద్యానవనము)

లంకను చేరుకొని హనుమంతుడు లంక అనే రాక్షసి గర్వము నణఁచి సందేహంతో మనోవికారం వస్తుందనే భయమనేది లేకుండా అనేక మంది స్త్రీలను ఆ మధ్యను సీతను కనుఁగొనడానికి చూశాడు. పట్టు వీడకుండా అంకిత భావ ముంచడం వల్ల చివరకు ఆమెను అశోకవనంలో చూశాడు.

తే॥గీ॥ వనము నందు కృత్రిమ ప్రస్థవంత ముండె,
దాని పైన కాలువఁ బోలు తటినిఁ బాఱు
చుండె, నీరు క్రిందికిఁ జేరి కొండ పైకి
మరలఁ బోయెడి యేర్పాటు నరసి, యలిగి
పుట్టినింటికిఁ బోయెడిఁ బ్రోడ నదిగ,
చెట్ల పోకంచు బ్రతిమాలు నట్లు నదిని
తాకు బంధువులకుఁ బోల్చి, దవ్వు కొంత
యేగి యలకఁ దీరగఁ బతి నెలము సతిని

కొండ పైకి బోవు నదిగఁ, గూర్చిఁ జెప్పు,
యాది కవికి వందనములు, యట్టి సుంద
రమగు యేర్పాటుకు ప్రశంస రావణునికి... ॥ 187 ॥

(కృత్రిమ = మనుష్యులచేఁ జేయఁబడినది, ప్రస్థవంతము = కొండ, పోలు = సరిపోలు, తటిని = నది, పాఱు = ప్రవహించు, అరయు = విచారించు, అలుగు = కోపించు, ప్రోఢ = ప్రౌఢస్త్రీ, పోల్చు = సామ్యం చెప్పు, దవ్వు = దూరము, ఏగు = వెళ్ళు, అలక = కోపము, పతి = భర్త, ఎలము = చేరు, కూర్చు = అనుసంధించు, వందనము = నమస్కారము, సుందరము = అందము, ప్రశంస = మెప్పు)

అశోకవనంలో కృత్రిమమైన కొండ ఉంది. దాని మీద కాలువ లాంటి నది ప్రవహిస్తోంది. నీరు క్రిందకు చేరి మరల కొండ మీదకు పోయే ఏర్పాటును విచారించి, అలిగి పుట్టింటికి పోయే ప్రౌఢస్త్రీని నదిగా, పోవద్దంటూ బ్రతిమాలుతున్నట్లుగా నదిని తాకే బంధువులకు చెట్లను పోల్చి, కొంత దూరము వెళ్ళి అలక తీరగా భర్తను చేరు భార్యను కొండ మీదకు వెళ్ళే నదిగా, అనుసంధించి చెప్పిన ఆది కవి వాల్మీకికి నమస్కారాలు. అటువంటి అందమైన ఏర్పాటుకు రావణునికి ప్రశంస.

తే॥గీ॥ అట్టి యుద్యానవనమున మట్టిఁ గ్రమ్మి
బక్కచిక్కిన సతిఁ గట్టు బట్టఁ జూచి,
నాడు కపుల నడుమ సీత వీడనాడు
యుత్తరీయపు రంగు యోషిత్తు చీర
రంగు యొక్కటవగ, యితర యనుకృతులఁ
జూచిఁ బోల్చె కుజగ వాయుసుతుడు తుదకు,
నేర పరిశోధకుల కిది నేర్పుఁ గఱపు... ॥ 188 ॥

(క్రమ్ము = చుట్టుకొను, బక్కచిక్కు = మిక్కిలి కృశించు, సతి = పతివ్రత, బట్ట = వస్త్రము, కపి = వానరుడు, నడుమ = మధ్య, వీడనాడు = విడిచిపెట్టు, యోషిత్తు = స్త్రీ, అనుకృతి = పోలిక, పోల్చు = సాటిచేయు, కుజ = సీత, వాయుసుతుడు

= హనుమంతుడు, తుద = చివర, పరిశోధకుడు = పరీక్షకుడు, నేర్పు = పాటవము, కఱపు = బోధించు)

అటువంటి ఉద్యానవనంలో మట్టిగొట్టుకుని బాగా కృశించిన స్త్రీ కట్టిన వస్త్రం చూసి నాడు వానరుల మధ్యలో సీత విడిచిపెట్టిన ఉత్తరీయం రంగు స్త్రీ చీర రంగు ఒకటే అవడం వల్ల ఇతర పోలికలను చూసి హనుమంతుడు చివరకు సీతగా పోల్చాడు. ఇది నేర పరిశోధకులకు నైపుణ్యం బోధిస్తుంది.

తే॥గీ॥ చెట్లు పూలను రాల్చుట యెట్లుఁ గనెనొ
జూదరులు యోడి యిచ్చు వస్త్రాదు లనెను
రావణునిఁ జూడ మినుముల రాశి యనెను
యాది కవి యుపమల కేది యనుహరణము?... ॥ 189 ॥

(కను = చూచు, రాశి = ప్రోగు, ఉపమ = పోలిక, అనుహరణము = పోలిక)

చెట్లు పూలను రాల్చడం ఎట్లా చూశాడో, జూదరులు ఓటమి పాలై ఇచ్చే వలువలు, ఇతరములు అన్నాడు. రావణుణ్ణి చూచి మినుముల కుప్ప అన్నాడు. ఆది కవి వాల్మీకి పోలికలకి పోలికేది?

తే॥గీ॥ నిన్నుఁ జూచిన పిమ్మట నెమ్మిఁ బోయె
భార్య వలన యనుచు కామి వలె హసించి,
యొంటరిగ మహీజనుఁ గని తుంటరితన
మున యసభ్యతఁ గనపరచిన యబాసి
రావణుఁ గనగా హనుమకు రగిలెను కసి.... ॥ 190 ॥

(పిమ్మట = అనంతరము, నెమ్మి = సుఖము, కామి = కాముకుడు, హసించు = నవ్వు, మహీజ = సీత, కను = చూచు, తుంటరితనము = దుష్టత్వము, అసభ్యత = అమర్యాద, కనపరచు = వ్యక్తం చేయు, అబాసి = దుష్టుడు, రగులు = ప్రజ్వలించు, కసి = కోపము)

నిన్ను చూసిన తరువాత భార్య వలన సుఖము పోయింది అంటూ కాముకుడి లాగా నవ్వి ఒంటరిగా సీతను చూసి దుష్టత్వంతో అమర్యాద వ్యక్తం చేసిన దుష్టుడైన రావణుణ్ణి చూడగానే హనుమకు కోపము రగులుకొంది.

కం॥ రావణుని ప్రలోభములును,
చావే గతి యనుచుఁ జెప్పు సంతక్షణముల్,
తీవిగ నెదిరించిన కుజ
భావమునన్, హనుమ, సాధ్వి పట్టుదుఁ గాంచెన్... ॥ 191 ॥

(ప్రలోభము = పేరాస, సంతక్షణము = కఠినోక్తి, తీవి = గాంభీర్యము, కుజ = సీత, భావము = స్వభావము, సాధ్వి = పతివ్రత, పట్టుదు = పట్టుదల, కాంచు = చూచు)

రావణుని పేరాసలను, చావే గతి అంటూ చెప్పే కఠినోక్తులను, దర్జాగా ఎదిరించిన సీత స్వభావంలో హనుమ పతివ్రత పట్టుదల చూశాడు.

తే॥గీ॥ ముక్తసరిగ సామీరి రాము కథఁ బాడ
సీత గమనించి యాతని చెట్టు పైన,
మరొక యాపద వచ్చెను మాయ లేడి
వలె ననుచు సతమత మయ్యె నులికి పడుచు... ॥ 192 ॥

(ముక్తసరిగ = క్లుప్తముగ, సామీరి = హనుమంతుఁడు, సతమతము = మిక్కిలి ఆయాసము, ఉలికిపడు = హటాత్తుగా గలిగిన భయము చేత కంపించు)

క్లుప్తంగా హనుమంతుఁడు రాము కథ పాడగా సీత యతణ్ణి చెట్టు మీద గమనించి మాయ లేడి వంటిది మరొక ఆపద వచ్చింది అని ఉలికిపడుతూ సతమత మయ్యింది.

తే॥గీ॥ సతికిఁ బతియగుఁ గైసేఁత, యతడు లేక
శోభఁ గోల్పోయిన కుజనుఁ జూచి, హనుమ
ధూమమున నున్న జ్వాలగఁ దోఁచ, నాదు
ముద్రిక నిడి నా సందేశము నెరిగించె... ॥ 193 ॥

(సతి = భార్య, పతి = భర్త, కైసేఁత = అలంకారము, శోభ = కాంతి, కోల్పోవు = పోగొట్టుకొను, కుజ = సీత, ధూమము = పొగ, జ్వాల = మంట, తోఁచు = మనసున ఏర్పడు, ముద్రిక = ముద్దుటుంగరము, ఇడు = ఇచ్చు, ఎరిగించు = తెలియజేయు)

భార్యకు భర్త అలంకారం అవుతాడు. అతడు లేక శోభ పోగొట్టుకున్న సీతను చూసి, హనుమ, పొగలో ఉన్న మంటగా అనిపించగా, నా ముద్రిక నిచ్చి నా సందేశము తెలియజేశాడు.

తే॥గీ॥ రావణు వనము ధ్వంసించి, రాక్షసులను
పెక్కురనుఁ జంపి, కాల్చగ పిచ్ఛ మందు
లంకను ప్రముఖుల గృహములను దహించి,
హనుమఁ గలిగించె నష్టమ్ము నన్ని దెసల,
చూచి రమ్మన్నచో కాల్చి వైచె ననగ... ॥ 194 ॥

(వనము = తోట, ధ్వంసించు = నాశం చేయు, పెక్కురు = అనేకులు, పిచ్ఛము = తోక, దహించు = కాల్చు, దెస = దిక్కు)

రావణుని ఉద్యానవనము నాశనం చేసి అనేక మంది రాక్షసులను చంపి, తోక కాల్చగా లంకలో ముఖ్యమైన వాళ్ళ ఇళ్ళను కాల్చి హనుమ చూసి రమ్మంటే కాల్చి వైచాడు అన్నట్లుగా అన్ని దిక్కుల నష్టము కలిగించాడు.

రామునికి సీత జాడ తెలుపుట:

కం॥ పులకించిరిఁ బావని మై
థిలినిఁ గనుఁగొనెనని, ప్రమానుదిమ్మరు లెలమిన్
సలిపె మధువనికి నష్టము
వెలువడి సుగ్రీవు కడకు బెరయుచుఁ బోవన్... ॥ 195 ॥

(పులకించు = రోమాంచితమగు, పావని = హనుమంతుఁడు, మైథిలి = సీత, కనుఁగొను = తెలిసికొను, ప్రమానుదిమ్మరి = కోతి, ఎలమి = తృప్తి, సలుపు = చేయు, వెలువడు = బయలుపడు, కడ = చెంత, బెరయు = గుంపుగూడు)

వానరులు హనుమంతుఁడు సీతను కనుగొన్నాడని పులకించారు. బయటపడి సుగ్రీవుని చెంతకు గుంపుగా వెళ్ళడానికి తృప్తితో మధువనికి నష్టం చేశారు.

ఉ॥ చూచితి నబ్ధి దాటి యొక సుందర వాటిక యందు రక్కసుల్
వేచగ శోకతప్త యగు భీరువు దైన్యము, యామె నచ్చటన్
దాచెను రావణుం డనుచుఁ దల్చితి చారుఁని వోలె, రాఘవా!
యా చల భూమిజే యనుచు యానిలిఁ జెప్పెను యంజలించుచున్ ॥ 196 ॥

(అబ్ధి = సముద్రము, వాటిక = తోఁట, రక్కసి = రాక్షసి, వేచు = బాధించు, శోకతప్త = దుఃఖముచే తపింపఁజేయునది, భీరువు = భయపడు స్త్రీ, దైన్యము = దీనత్వము, తల్చు = తలచు, చారుఁడు = వేగువాఁడు, రాఘవుడు = శ్రీరాముడు, చల = వణఁకుఁ గలది, భూమిజ = సీత, ఆనిలి = ఆంజనేయుఁడు, అంజలించు = దోయిలించు)

సముద్రము దాటి ఒక అందమైన తోఁటలో రక్కసులు బాధించగా దుఃఖముతో తపిస్తున్న భయపడు స్త్రీ యొక్క దీనత్వము చూశాను. రామా! ఆమెను అక్కడ రావణుడు దాచాడు అని వేగు లాగా అనుకున్నాను. ఆ వణఁకుఁ గలది సీతయే అంటూ హనుమంతుడు అంజలిస్తూ చెప్పాడు.

శా॥ పారావారము దాట నీదు ప్రతిభా పాండిత్యమేఁ గన్పడెన్,
చేరన్ ముద్రిక సీత కిచ్చితివి, నీచే లంక కంపించెనే,
యీ రాముం గరుణించి సీత మణి మా కీదెచ్చితే, శైల వా
సా! రా! రమ్మనె సూర్యజుండు హనుమన్ సంరంభ మేపారగన్ ॥ 197 ॥

(పారావారము = సముద్రము, కంపించు = వణకు, శైలవాస = కొండ మీద నివసించే వాడా, సూర్యజుడు = సుగ్రీవుడు, సంరంభము = గర్వము, ఏపారు = అతిశయించు)

సముద్రం దాటడంలో నీ ప్రతిభా పాండిత్యమే కనబడింది. చేరగానే ముద్రిక సీత కిచ్చావు. నీ వల్ల లంక వణికిందిగా. ఈ రాముని కరుణించి సీత మణిని మాకు ఇవ్వడానికి తెచ్చినావుగా. గర్వము అతిశయించగా సుగ్రీవుడు హనుమను కొండ ద్రిమ్మరీ! రా! రమ్ము! అని అన్నాడు.

కం॥ ఎన్నాళ్ళకు విన వచ్చెను
నన్నేఁ దలఁచుచుఁ దపించు నా సతి వార్తల్,
కన్నీ రింకెనులే, తా
నున్నదనెడి మాట నన్ను యూరటఁ బఱచన్... ॥ 198 ॥

(తలఁచు = ధ్యానించు, తపించు = బాధపడు, సతి = భార్య, ఇంకు = ఆవిరైపోవు, ఊరట = ఉపశమనం, పరచు = చేయు)

నన్నే ధ్యానిస్తూ బాధపడే నా భార్య వార్తలు ఎన్నాళ్ళకి వినవచ్చాయి. తను ఉంది (బ్రతికి ఉంది) అన్న మాట నన్ను ఊరట పరచగా కన్నీరు ఆవిరైపోయింది.

తే॥గీ॥ రావణుని వంటి శూరుఁడు రాజయోగి,
బ్రహ్మ వంశమందునఁ బుట్టి వరము లంది
పెంకె యగుట, ధనికు నింట పిసినిగొట్టు
యుద్భవించి నటుల నాకు నుపమఁ దోఁచె... ॥ 199 ॥

(శూరుఁడు = యుద్ధమునకు భయపడనివాఁడు, రాజయోగి = రాజయోగము గలవాఁడు, పెంకె = మూర్ఖుఁడు, ధనికుడు = ధనముగలవాఁడు, పిసినిగొట్టు = పిసినారి, ఉద్భవించు = పుట్టు, ఉపమ = పోలిక, తోఁచు = మనసున ఏర్పడు)

రావణుని వంటి శూరుఁడు రాజయోగి బ్రహ్మ వంశంలో పుట్టి వరమలు పొంది మూర్ఖుఁడవ్వడం ధనము కలవాఁడి ఇంటిలో పిసినారి పుట్టినట్లుగా నాకు పోలిక తోఁచింది.

తే॥గీ॥ మాయ లేడిపై కాకిపై మండిపడుచు
నేను బ్రహ్మాస్త్రమును వేసిఁ బోనడచితి,
వాలి నేక బాణమున రూపడచి నాను,
యట్టిది కుజను బాధించ నెట్టు విడుతు
రావణునిఁ జంపకుండ యా లంక కేగి?... ॥ 200 ॥

(పోనడచు = చంపు, రూపడచు = చంపు, కుజ = సీత, ఎట్టు = ఎట్లు, విడుచు = వదలు, ఏగు = వెళ్ళు)

మాయ లేడి పైన కాకి పైన కోపించి నేను బ్రహ్మాస్త్రం వేసి చంపాను. వాలిని ఒకే బాణంతో చంపాను. అటువంటిది సీతను బాధిస్తే ఆ లంకకు వెళ్ళి రావణుణ్ణి చంపకుండా ఎట్లా వదులుతాను?

సీతా వియోగము:

తే॥గీ॥ కడలి తటమున సేనతో విడిదిc జేసి
యెవరి బాధ్యత వారికి వివరము లిడ
సీత జ్ఞాపకములు కలcచె మది నొక్క
సారిగ, యనుజ! తలcపుల జోరు వినుము.... ॥ 201 ॥

(కడలి = సముద్రము, తటము = తీరము, విడిదిc జేసి = బసచేసి, బాధ్యత = జవాబుదారీ, వివరము = వివరణము, కలcచు = క్షోభపెట్టు, మది = మనస్సు, అనుజ = తమ్ముడా, తలcపు = ఆలోచన, జోరు = హడావిడి)

సముద్ర తీరంలో సేనతో బస చేసి ఎవరి బాధ్యత వారికి వివరములు ఇవ్వగా సీత జ్ఞాపకాలు మనస్సును ఒక్క సారిగా క్షోభపెట్టాయి. తమ్ముడా! ఆలోచనల జోరు వినుము.

తే॥గీ॥ వాయు దేవా! యచటి నుండి వచ్చి యిటకు,
గాలి మేను తాకగ ప్రియురాలి స్పర్శ
ప్రాప్త మయ్యె, యో చంద్ర! నీ పైనc గలియ
మాదుc జూపుల సంబంధ మాదు కొనెను... ॥ 202 ॥

(ఇట = ఇక్కడ, మేను = శరీరము, ప్రాప్తము = పొందcబడినది, కలియు = ఏకమగు, మాదు = మా యొక్క, సంబంధము = చేరిక, ఆదుకొను = ఆదరించు)

వాయు దేవా! అక్కడ నుండి ఇక్కడికి వచ్చి గాలి శరీరాన్ని తాకగానే ప్రియురాలి స్పర్శ పొందినట్లు అయ్యింది. ఓ, చంద్రా! నీ మీద కలవడం వల్ల మా చూపుల చేరిక ఆదరించింది.

కం॥ నా యెదుట నున్న జాబిలి,
మా యెదుటకు యేల రావు? మంకుతనంబా?
ప్రేయసితో గడుపఁ గలుగు
నా యీ కోర్కె నెరవేర నా కిక లేదా?... ॥ 203 ॥

(జాబిలి = చంద్రుడు, మంకుతనము = మొండితనము, ప్రేయసి = ప్రియురాలు, గడుపు = వెళ్ళబుచ్చు, నెరవేరు = సిద్ధించు)

నా ఎదురుగా ఉన్న చంద్రుడా! మా ఎదుటకు ఎందుకని రావు? మొండితనమా? ప్రియురాలితో గడప గలిగే నా ఈ కోరిక సిద్ధించడం నాకు ఇక కుదరదా?

కం॥ కలియుట లేదని దిగులునఁ
గలఁగకు, తలవని తలంపుగ గగన మందున్
గలియును మన చూపులు జా
బిలిపై, ప్రతి రాత్రి వేళ బిత్తర మాడన్.... ॥ 204 ॥

(కలఁగు = కలఁతపడు, తలవని తలంపుగ = ముందు అనుకొనకుండ, గగనము = ఆకాశము, జాబిలి = చంద్రుడు, బిత్తరము = శృంగారచేష్ట)

కలవడం లేదనే దిగులుతో కలఁతపడకు. ముందు అనుకోకుండా మన చూపులు ఆకాశంలో చంద్రునిపై ప్రతిరాత్రి వేళ శృంగారచేష్ట చెయ్యడానికి కలుస్తాయి.

కం॥ నీ వున్న తావు దూరమె,
భావనలో నీవు నాకు ప్రాణసమమె, నీ
మోవుల తాకిన గాలులు
తావిగ ననుఁ జేరి విరహ తాపముఁ బెంచెన్.... ॥ 205 ॥

(తావు = చోటు, భావన = తలపు, ప్రాణసమము = ప్రాణ సమానము, మోవి = పెదవి, తావి = పరిమళము, విరహతాపము = ప్రేమకి సంబంధించిన బాధ)

నీవు ఉన్న చోటు దూరమే. భావనలో నీవు నాకు ప్రాణ సమానమే. నీ పెదవులను తాకిన గాలులు పరిమళమై నన్ను చేరి విరహతాపము పెంచాయి.

కం॥ రావా! యని దిక్కు లదర
నీ వా లంకను యశోక నిష్కుటమున వా
పోవ, వగచి నా మది వీ
రావేశమ్మున దుమికెను రావణుఁ దునుమన్... ॥ 206 ॥

(నిష్కుటము = ఉద్యానవనము, వాపోవు = దుఃఖించు, వగచు = దురపిల్లు, మది = మనస్సు, దుముకు = దూకు, తునుము = చంపు)

రావా! అంటూ దిక్కు లదిరేటట్లుగా నీవు ఆ లంకలో అశోకవనంలో దుఃఖించగా, నా మనస్సు దురపిల్లి రావణుణ్ణి చంపడానికి వీరావేశంతో దూకింది.

కం॥ నీ కనుల కాంతి సోకగ,
మూకుమ్మడిగా మరు శరములుఁ దాఁకె ననున్,
నా కనులే చెమరింప మ
మేక మయెనుఁ దనువు పొంగి మేకొనుఁ బ్రభతో... ॥ 207 ॥

(సోకు = తగులు, మూకుమ్మడిగా = ఒకేసారిగా, మరుడు = మన్మథుడు, శరము = బాణము, తాఁకు = స్పృశించు, చెమరించు = తడియగు, మమేకము = మిక్కిలి ప్రేమతో అన్యోన్యముగ నుండుట, తనువు = శరీరము, మేకొను = ప్రాప్తించు, ప్రభ = వెలుఁగు)

నీ కన్నుల కాంతి సోకగా ఒక్క సారిగా మన్మథుని బాణాలు నన్ను తాకాయి. నా కన్నులే తడి అవ్వగా శరీరము పొంగి లభించిన వెలుఁగుతో మమేక మయ్యింది.

తే॥గీ॥ గరళము వలె యంగములనుఁ గాల్చు చున్న
దామె వగపు, రగిలి మన్మథాగ్ని విరహ
మగుచు కట్టెలుగ జ్వలించె, యంబునిధిని
దిగి పరుండిన యీ కాఁక దిగుట కగునె?... ॥ 208 ॥

(గరళము = విషము, అంగము = అవయవము, వగపు = శోకము, రగులు = మండు, విరహము = ఎడఁబాటు, జ్వలించు = మండు, అంబునిధి = సముద్రము, కాఁక = తాపము, దిగు = మీఁద నుండి క్రిందికివచ్చు లేక దిగబడు)

ఆమె శోకము విషం లాగా అవయవాలను కాలుస్తున్నది. రాజుకొని కామాగ్ని ఎడఁబాటుగా మారి కట్టెలుగా మండింది. సముద్రంలో దిగి పడుకుంటే ఈ తాపం తగ్గుతుందా?

తే॥గీ॥ భూమిజా! నీవు యుండిన భూమి పైన
నాకు యుండుటె ఘనతగా నమ్ముచుంటి,
నీరుఁ గల చేను ప్రక్కన నీరు లేని
చేను జీవించుఁ గాదె యాఁ జెమ్మఁ దగిలి... ॥ 209 ॥

(భూమిజ = సీత, ఘనత = గొప్పఁదనము, చేను = పంటనేల, చెమ్మ = తడి)

సీతా! నీవు ఉన్న భూమి మీద ఉండడం నాకు గొప్పఁదనంగా నమ్ముతున్నాను. నీరు ఉన్న పంటనేల ప్రక్కన నీరు లేని పంటనేల ఆ తడి తగిలి బ్రతుకుతుంది కదా.

కం॥ పతిభక్తియు, ప్రకృతి యనన్
యతి ప్రేమయు, మునులు యతిథు లన మన్నన, విం
శతిబాహుకైన బెదరని
ధృతిఁ, గలిగిన నీ ప్రవృత్తి దృష్టాంతంబౌ... ॥ 210 ॥

(ప్రకృతి = పంచభూతములు, అతి = అధికము, అతిథి = ఆగంతుకుడు, మన్నన = గౌరవము, వింశతిబాహుడు = రావణుడు, బెదరు = భయపడు, ధృతి = ధైర్యము, ప్రవృత్తి = నడవడి, దృష్టాంతము = ఆదర్శము)

పతి భక్తియు, ప్రకృతి అంటే ఎక్కువ ప్రేమయు, మునులు అతిథులు అంటే గౌరవము, రావణునికి కూడా భయపడని ధైర్యము, కలిగి ఉన్న నీ నడవడి ఆదర్శము (role model) అవుతుంది.

కం॥ ఉవ్వున మాయం బైనను,
దవ్వున నుండియును, నాకు ధైర్యము నిడి, నా
దివ్వెగ మార్గము చూపెడి
జవ్వని, సీతా! నిజముగ జాయన నీవే... ॥ **211** ॥

(ఉవ్వున = తటాలున, దవ్వు = దూరము, ఇడు = ఇచ్చు, దివ్వె = దీపము, జవ్వని = యౌవనవతి, జాయ = భార్య)

తటాలున మాయమైనా, దూరంగా ఉన్నా, నాకు ధైర్యం ఇచ్చి, నా దీపముగా త్రోవ చూపించే యౌవనవతివైన సీతా! నిజంగా భార్యంటే నువ్వే.

తే॥గీ॥ మలిన వస్త్రము వోలె యీ మనికితమ్ము
యెపుడు విడుతునో, లక్ష్మణా! యెరుగ కుంటి,
సీత బ్రతికి యున్నదనుచుఁ జెప్ప హనుమఁ
గలియు టెప్పు డనుచు మదిఁ గలంతఁ జెందె... ॥ **212** ॥

(మలిన = మురికి, పోలె = వలె, మనికితము = దుఃఖము, విడుచు = వదలు, ఎరుగు = తెలియు, కలియు = చేరు, మది = మనస్సు, కలంత = సంతాపము)

లక్ష్మణా! మాసిన బట్ట లాగా ఈ దుఃఖాన్ని ఎప్పుడు విడుస్తానో తెలియకుండా ఉన్నాను. సీత బ్రతికి ఉంది అంటూ హనుమంతుడు చెప్పగానే ఎప్పుడు కలుస్తానా అని మనస్సు సంతాపము చెందింది.

విభీషణు శరణాగతి:

తే॥గీ॥ చేటుమూడును రావణా! సీత వలన,
యేడుగడ యైన రాముడు యిచటి కొచ్చు
ననుపదికుఁడు లక్ష్మణుఁ గూడి యనికి ననుచు,
యార్చుచు విభీషణుండనె యన్న తోడ... ॥ **213** ॥

(చేటుమూడు = ఆపద సంభవించు, ఏడుగడ = రక్షకుడు, ఇచటికి = ఇక్కడకు, అనుపదికుఁడు = అనుసరించువాఁడు, కూడు = చేరు, అని = యుద్ధము, ఆర్చు = ఘోషించు)

రావణా! సీత వల్ల ఆపద సంభవిస్తుంది. రక్షకుడైన రాముడు అనుచరుడైన లక్ష్మణునితో కలిసి యుద్ధానికి ఇక్కడికి వస్తాడు అని విభీషణుడు అన్నతో ఘోషిస్తూ చెప్పాడు.

కం॥ పావని సీతను ముచ్చిలు
బేవర మఘమనిఁ దెలిసి విభీషణు డనియెన్,
నీ వామెను తిరిగిచ్చిన,
రావణ! ఖచ్చితముగ రఘురాముడుఁ బ్రోచున్... ॥ 214 ॥

(పావని = పవిత్రురాలు, ముచ్చిలు = దొంగిలించు, బేవరము = వ్యవహారము, అఘము = పాపము, ఖచ్చితము = కచ్చితము, ప్రోచు = రక్షించు)

పవిత్రురాలైన సీతను అపహరించు వ్యవహారము పాపమని తెలిసి, విభీషణుడు, రావణా! నీవు ఆమెను తిరిగి ఇచ్చేస్తే ఖచ్చితంగా శ్రీరాముడు రక్షిస్తాడు, అని అన్నాడు.

ఉ॥ కంటికి గోచరించ డనిఁ గంటునఁ జూచెద వేల దైవమున్,
కంటకుఁ లార్గురన్ మరచుఁ గారణ మున్నదె నాకుఁ జెప్పుమా,
యింటను దొంగ లుండ వెలి నీవలఁ జూతు వదేల? మానవా
తుంటరి చేష్ట లీవనుచు, దూఱె విభీషణు డన్న మేలుకై... ॥ 215 ॥

(గోచరించు = అగపడు, కంటు = పగ, కంటకుఁడు = నీచబుద్ధి గల శత్రువు, వెలి = శరీరబహిర్భాగము, ఈవల = ఈ ప్రక్క, మాను = విడుచు, తుంటరి = దుష్టుడు, చేష్ట = పని, ఈవు = నీవు, దూఱు = నిందించు, మేలు = క్షేమము)

కంటికి కనపడదని దైవాన్ని పగతో చూస్తావెందుకు? కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే ఆరుగురు శత్రువులను మరచిపోవడానికి కారణం

ఉందా నాకు చెప్పు. ఇంట్లో దొంగ లుంటే బయట చూస్తావేమి? తుంటరి పనులు మానవా అంటూ విభీషణుడు అన్న రావణుని క్షేమం కోసం నిందించాడు.

తే॥గీ॥ అన్ని విధముల నీతిని యన్నకుఁ గఱ
పించి నిస్సహాయుఁనిగ విభీషణుండు,
దుష్ట మారీచు వోలె తా తోడువడక,
యన్నను విడిచిఁ, గోరెను నన్ను శరణు... ॥ 216 ॥

(కఱపించు = బోధించు, నిస్సహాయుఁడు = ఏమీ చేయలేని స్థితిలో ఉన్న వ్యక్తి, పోలె = వలె, తోడువడు = తోడ్పాటు ఇచ్చు, విడుచు = వదలు, శరణు = రక్షణము)

అన్నయైన రావణునికి అన్ని విధాల నీతిని బోధించి విభీషణుడు మారీచుడి లాగా తోడ్పాటు నివ్వక అన్నను వదిలిపెట్టి నిస్సహాయుఁనిగా నన్ను రక్షణ కోరాడు.

తే॥గీ॥ నాదు రాజ్యమె వద్దనిఁ గుందిలమునఁ
గాలిడి పరుల రాజ్యము నేల వలతు?
వాలిని వధించి సుగ్రీవు ప్రభునిఁ జేసి
శరణిడి విభీషణుని లంక దొరనుఁ జేసి
రాజ్యకాంక్ష లేదనుచు తార్కాణ మిడితి,
రాజ నీతికి నూత్న మర్యాద నిలుప... ॥ 217 ॥

(కుందిలము = అడవి, కాలిడు = ప్రవేశించు, పరులు = అన్యులు, వలచు = కోరు, శరణు = రక్షణ, ఇడు = ఇచ్చు, దొర = రాజు, కాంక్ష = కోరిక, తార్కాణము = ఉదాహరణము, నూత్న = క్రొత్త, మర్యాద = కట్టుఁబాటు, నిలుపు = ప్రతిష్ఠించు)

నా రాజ్యమే వద్దని అడవిలో ప్రవేశించి అన్యుల రాజ్యాన్ని ఎందుకు కోరతాను? రాజనీతిలో క్రొత్త కట్టుఁబాటు నిలబెట్టడానికి, వాలిని చంపి సుగ్రీవుణ్ణి రాజును చేసి, విభీషణుడికి శరణు ఇచ్చి లంకకు రాజును చేసి, రాజ్యకాంక్ష లేదని ఉదాహరణ ఇచ్చాను.

యుద్ధ సన్నాహాలు:

తే॥గీ॥ వృక్షములఁ గాయు ఫలములె భక్షణముగ
తటినుల ఝరులఁ గల నీరు దాహ ముడుప
వ్యయము లేకుండ సాగెను వానర పరి,
పల్లెల పురములనుఁ గాక బయట నుండి
జనుల వ్యవహారముల నడ్డు కొనక యుండ... ॥ 218 ॥

(భక్షణము = తిండి, తటిని = నది, ఝరి = సెలయేఱు, దాహము = దప్పి, ఉడుపు = పోఁగొట్టు, వ్యయము = ఖర్చు, పరి = సేన, వ్యవహారము = కార్యాచరణము, అడ్డుకొను = ఆటంకపఱచు)

చెట్లకు కాసే పళ్ళే ఆహారంగా, నదుల్లో సెలయేళ్ళలో ఉన్న నీరు దాహము తీర్చగా ఖర్చు లేకుండా వానర సేన ప్రజల పనులను ఆటంక పఱచకుండా పల్లెలు పట్టణాల లోనుండి కాకుండా బయట నుండి సాగింది. (నేటి కాలంలో బైపాస్ రోడ్డు [bypass road] అన్న భావన ఆ కాలంలో ఇలా ఉండేది అన్నమాట.)

తే॥గీ॥ నాదు సేనకు దాటగ నడవ నివ్వ
మూడు దినములు జలధిని వేఁడుకొంటి
ఫలము లేదని సంధించ బమ్మయమ్ము
యేటిఱే డంజలించుచు, యెదుట కొచ్చె... ॥ 219 ॥

(నడవ = దారి, జలధి = సముద్రము, వేఁడుకొను = ప్రార్థించు, ఫలము = ప్రయోజనము, సంధించు = కూర్చు, బమ్మయమ్ము = బ్రహ్మాస్త్రము, ఏటిఱేడు = సముద్రుడు, అంజలించు = దోయిలించు)

నా సేనకు దాటడానికి దారి ఇవ్వమని సముద్రాన్ని మూడు రోజులు ప్రార్థించాను. ప్రయోజనము లేదని బ్రహ్మాస్త్రము సంధించగా సముద్రుడు అంజలిస్తూ ఎదుటికి వచ్చాడు.

**మ॥ మొన దాటం దిమి నింకc జేతునను వ్యామోహమ్ముc బీడింప, నా
కినుకన్ యెక్కిడు యస్త్రముం గని, ప్రజల్ కీర్తింప స్వాభావ్యమౌ
గుణముల్ వీడవు పంచభూతములు, యాకూతమ్ము వేరొక్క సా
ధనముం జేకొనc జెప్పె నా కపుడు, వైదగ్ధ్యమ్మునన్ సంద్రుcడే ॥ 220 ॥**

(మొన = సైన్యము, తిమి = సముద్రము, ఇంకు = ఆవిరైపోవు, వ్యామోహము = ఎక్కువ మోహము, పీడించు = బాధించు, కినుక = కోపము, ఎక్కిడు = ఎక్కుపెట్టు, కను = చూచు, కీర్తించు = స్తుతించు, స్వాభావ్యము = సహజము, వీడు = త్యజించు, ఆకూతము = ఆలోచన, సాధనము = ఉపాయము, చేకొను = చేపట్టు, వైదగ్ధ్యము = నేర్పు, సంద్రుcడు = సముద్రుcడు)

సేన దాటడానికి సముద్రాన్ని ఆవిరియై పోయేటట్లుగా చేస్తాను అనే వ్యామోహము బాధించగా నా కోపాన్ని ఎక్కుపెట్టిన అస్త్రాన్ని చూసి, ప్రజలు పొగిడితే (నేను మూడు రోజులు ప్రార్థించానుగా) పంచభూతాలు సహజ గుణాలు వదిలిపెట్టవు, వేరొక ఉపాయం చేపట్టమని నాకు అప్పుడు సముద్రుడే నేర్పుగా ఆలోచన చెప్పాడు.

**తే॥గీ॥ లోతు లేకుండ యుంట నా రీతి కెదురు
నియమ భంగము జేయుట నెరవుc గాదు
యట్లుc జెప్పుట భావ్యమా? యరయు మనుచు
వేడి, సంద్రుడు నా కొక్క వెరవుc దెలిపె... ॥ 221 ॥**

(రీతి = స్వభావము, ఎదురు = వ్యతిరేకము, నెరవు = యుక్తము, భావ్యము = కాదగినది, అరయు = విచారించు, వేడు = ప్రార్థించు, సంద్రుడు = సముద్రుడు, వెరవు = ఉపాయము)

లోతు లేకుండా ఉండటం నా స్వభావానికి వ్యతిరేకము. నియమము ఉల్లంఘించడం యుక్తము కాదు. అలా చెప్పడం భావ్యమా, విచారించు అంటూ ప్రార్థించి సముద్రుడు నాకు ఒక ఉపాయము తెలియజేశాడు.

కం॥ చేరను లంకా నగరము
వారిధిపైఁ గపులుఁ గట్టె వారధిఁ గడు వి
డ్డూరముగా, యదియే నా
కారణమున "రామసేతు"గా విలసిల్లెన్... **॥ 222 ॥**

(వారిధి = సముద్రము, కపి = వానరము, వారధి = వంతెన, కడు = మిక్కిలి, విడ్డూరము = వింత, విలసిల్లు = ఒప్పు)

లంకా నగరము చేరుకోవడానికి సముద్రము మీద వానరులు వంతెన మిక్కిలి వింతగా కట్టగా, అదే నా కారణంగా "రామసేతు"గా ఒప్పింది.

తే॥గీ॥ రావణుని సేన కస్త్ర శస్త్రములు జిత్తు
లుండ, లేవ వేవియు నాదు దండుఁ బోర,
తరువులు, శిలలు, గోళ్ళు, వక్త్రములెఁ గాక
శత్రువుల వద్ద గుంజిన శస్త్రములను
వాడిరిఁ గపి సేన వెలార్చ వాఁడి ననిని... **॥ 223 ॥**

(జిత్తు = మాయ, దండు = సేన, పోరు = యుద్ధముచేయు, తరువు = చెట్టు, శిల = రాయి, వక్త్రము = నోరు, గుంజు = లాగు, శస్త్రము = ఆయుధము, కపి = వానరము, వెలార్చు = వెల్లడించు, వాఁడి = శౌర్యము, అని = యుద్ధము)

రావణుని సేనకు అస్త్రశస్త్రములు, మాయలు ఉండగా, నా సేనకు యుద్ధము చేయడానికి అవి ఏవీ లేవు. చెట్లు, రాళ్ళు, గోళ్ళు, నోళ్ళే కాక శత్రువుల వద్ద లాక్కున్న ఆయుధాలను వానర సేన యుద్ధంలో శౌర్యము వెల్లడించడానికి వాడారు.

తే॥గీ॥ నీవును విభీషణు డతని సేవకులును
నేనును నర రూపంబునఁ గానఁబట్టి,
యన్యు లెల్ల రనిని వానరాకృతిఁ బొడ
చూప వలెనని యనుట, యసురులు మాయఁ
జేసి మానవాకృతి యందు సేన నుండ

సులభముగ మనము గుఱుతించుటకుఁ గాదె,
యిట్టి సైనిక మర్మమ్ము లెట్లు మరతు... ॥ 224 ॥

(నరుడు = మానవుడు, కానఁబట్టు = కనఁబడు, అన్యుడు = ఇతరుడు, ఎల్లరు = అందరు, అని = యుద్ధము, పొడచూపు = కనఁబడు, అసురులు = రాక్షసులు, గుఱుతించు = ఆనవాలుపట్టు, మర్మము = రహస్యము)

నీవు, విభీషణుడు, అతని సేవకులు, నేను మానవ రూపంలో కనఁబడి ఇతరులు అందరూ యుద్ధంలో వానర రూపంలో కనఁబడాలని అనడం, రాక్షసులు మాయ చేసి మానవ రూపంలో సేనలో ఉన్నప్పుడు సులువుగా మనము ఆనవాలు పట్టడానికి కాదా. ఇలాంటి సైనిక రహస్యాలు ఎట్లా మరచిపోతాను.

తే॥గీ॥ కోట వెలుపల నుండిఁ బోరాట మాచ
రించ యాకస్మికమ్ముగ రేపగ లనిఁ
జేయ వచ్చు, యిడె నదె పైచేయి మనకు,
యది యటుంచి, లంకకు నష్ట మగుట తథ్య
మెవరు గెలిచినఁ బోరు కిర వదిఁ గాన... ॥ 225 ॥

(వెలుపల = బయట, ఆచరించు = చేయు, ఆకస్మికము = తటాలున, రేపగలు = రేయింబవళ్ళు, అని = యుద్ధము, ఇడు = ఇచ్చు, పైచేయి = ఆధిక్యం, అటుంచు = ప్రక్కనఁ బెట్టు, తథ్యము = నిజము, పోరు = యుద్ధము, ఇరవు = స్థానము)

కోట బయట నుండి యుద్ధం చేస్తే తటాలున (యుద్ధంలో వాడే ఆయుధాలు ఎలా ఉన్నా, అనూహ్యంగా దెబ్బకొట్టడం [surprise weapon] అన్నిటికన్నా గొప్ప ఆయుధం. కోట బయట ఉండి యుద్ధం చేసే వాళ్ళకి ఈ వెసులుబాటు ఎక్కువ.) రేయింబవళ్ళు చేయవచ్చు. అదే మాకు ఆధిక్యాన్ని ఇచ్చింది. ఆ విషయం ప్రక్కనఁ బెట్టి యుద్ధరంగము లంక కాబట్టి ఎవరు గెలిచినా లంకకు నష్టము అవడం తథ్యము. (ఈ కాలంలో కూడా మనం చూస్తాం. గెలుపోటముల మాట అటుంచి, యుద్ధం ఎవరి భూభాగంలో జరిగితే వారికి నష్టం ఎక్కువగా ఉంటుంది.)

తే॥గీ॥ నాయకత్వ కేంద్రీకరణ దశకంఠుఁ
దీరు, మన సేన యందది వేరుఁ, గలసిఁ
బోరుట మన జోరు, విడిగఁ బోరి యంత
రించుటయె వారి సౌరు, వరించ హ్వాల... ॥ 226 ॥

(కేంద్రీకరణ = ఒకచోటికి తెచ్చుట, దశకంఠుడు = రావణుడు, తీరు = విధానము, వేరు = అన్యము, పోరు = యుద్ధము చేయు, జోరు = బలము, విడి = ఒంటరి, అంతరించు = చచ్చు, సౌరు = విధము, వరించు = కోరు, హ్వాల = ఓటమి)

నాయకత్వము కేంద్రీకరించడం (centralized leadership) రావణుని విధానము. మన సేనలో అది వేరు (different). కలిసి యుద్ధం చేయడం మన బలము. ఓటమిని వరించడానికి విడిగా యుద్ధము చేసి చావడం వారి విధము.

తే॥గీ॥ రాము డెడలెనని కుజకు రావణుండు
నాదు శిరమును సృష్టించి నమ్మఁ బలుకఁ
రణమునకు ముందె, వాల్మీకి రచన వలన,
నేను బ్రతికి యుండ, గతించ నేను సీత
యెటుల యేడ్చునో నా మది కెరుక యయ్యె... ॥ 227 ॥

(ఎడలు = చచ్చు, కుజ = సీత, శిరము = తల, సృష్టించు = కల్పించు, నమ్మఁ బలుకు = నమ్మే విధంగా మాట్లాడు, రణము = యుద్ధము, గతించు = చచ్చు, ఎటుల = ఎట్లు, మది = మనస్సు, ఎరుక = పరిచయము)

నా తలను సృష్టించి రాముడు చచ్చిపోయాడని సీతకు రావణుడు యుద్ధానికి ముందే నమ్మఁ బలకడం వల్ల, నేను చచ్చిపోతే సీత ఎట్లా ఏడుస్తుందో, నా మనస్సుకి నేను బ్రతికి యుండగానే వాల్మీకి రచన వలన, పరిచయం అయ్యింది.

యుద్ధ వివరాలు:

కం॥ గగనము గగనాకారమె,
జగమున సరిపోలు నెద్ది సంద్రమునకుఁ, గాం

చగ నటులె సాగె నని సం
యుగముల సరిసాటి లేని యుద్ధ మనంగన్... ॥ **228** ॥

(గగనము = ఆకాశము, జగము = లోకము, సరిపోలు = సామ్యము, ఎద్ది = ఏది, సంద్రము = సముద్రము, కాంచు = చూచు, అటుల = అట్లు, అని = యుద్ధము, సంయుగము = యుద్ధము, సరిసాటి = సమానము)

ఆకాశము ఆకాశం లాగానే ఉంటుంది. లోకంలో సముద్రాన్ని పోలేది ఏమి ఉంది. చూస్తే అలాగే యుద్ధాలలో సరిసాటిలేని యుద్ధము అనేటట్లుగా యుద్ధం సాగింది.

కం॥ అంకించు బంధువర్గము,
పంకజముఖి సీత వంటి భార్యయు దొరకున్
యింకువ లన్నిట ననుజా!
జంకని నీ వంటి జోదు జక్కొను టరుదే... ॥ **229** ॥

(అంకించు = స్తుతించు, పంకజముఖి = సౌందర్యవతి, ఇంకువ = ప్రదేశము, అనుజుడు = తమ్ముడు, జంకు = భయపడు, జోదు = యోధుడు, జక్కొను = లభించు, అరుదు = దుర్లభం)

అన్ని ప్రదేశాల్లోనూ స్తుతించే బంధువర్గము, సౌందర్యవతి సీత వంటి భార్య దొరుకుతారు. తమ్ముడా! భయపడని నీ వంటి యోధుడు లభించడం దుర్లభమే.

తే॥గీ॥ నన్ను నిన్నును సర్పబాణములఁ గట్టి
చచ్చితి మనిఁ జెప్పి కుజనుఁ దెచ్చిఁ జూప,
త్రిజట పుష్పక మహిమ కథించి ధైర్య
మిచ్చి మనదు కుశల వార్త నిచ్చె కుజకు... ॥ **230** ॥

(సర్పము = పాము, కుజ = సీత, పుష్పకము = పుష్పక విమానము, కథించు = చెప్పు)

నన్ను నిన్ను సర్పబాణాలతో కట్టి చచ్చాము అని చెప్పి సీతను తెచ్చి చూపించగా, త్రిజట పుష్పక విమానము మహిమను చెప్పి (ఇప్పుడు మనం పుష్పక విమానంలో వచ్చాము కదా. రాముడు మరణించి యుంటే పుష్పకం నిన్ను మొయ్యడం జరగదు. దాన్ని బట్టి రాముడు బ్రతికే ఉన్నాడని తెలుస్తోంది కదా అని త్రిజట సీతకు చెప్పింది.) ధైర్యము ఇచ్చి సీతకు మన కుశల వార్త చెప్పింది.

మ॥ శరతల్పమ్మున చేతనా రహితులౌ సౌమిత్రియున్ రాముడున్
మరణించెన్ యని నమ్మ వద్దు, వదనం బందున్ ప్రభల్ గాంచుమా,
మఱపమ్మా యని జానకిన్ త్రిజట సంభాలించి, సంతాపమున్
మరపించెన్ రణరంగ మందనుచు, సన్మానింతు చిత్తంబునన్ ॥ 231 ॥

(శరతల్పము = అంపశయ్య, చేతనా రహితుడు = చైతన్యము లేకుండా ఉన్నవాడు, సౌమిత్రి = లక్ష్మణుడు, వదనము = ముఖము, ప్రభ = వెలుఁగు, కాంచు = చూచు, మఱపు = మూర్ఛ, జానకి = సీత, త్రిజట = అశోకవనంలో సీతకు కాపలాగా ఉన్న రాక్షస స్త్రీ [విభీషణుని కుమార్తె అని అంటారు], సంభాలించు = ఓదార్చు, సంతాపము = దుఃఖము, మరపించు = మఱచునట్లు చేయు, రణరంగము = యుద్ధభూమి, సన్మానించు = గౌరవించు, చిత్తము = మనసు)

అంపశయ్య మీద అచేతనంగా ఉన్న లక్ష్మణుడు, రాముడు చనిపోయారని నమ్మ వద్దు, ముఖంలో కాంతి చూడుమా, మూర్ఛమ్మా అని యుద్ధభూమిలో సీతను త్రిజట ఓదార్చి దుఃఖము మఱచునట్లు చేసిందని మనస్సులో గౌరవిస్తాను.

తే॥గీ॥ మూర్ఛ నొందగ బ్రహ్మాస్త్రమున మన పరి,
యడిగె జాంబవంతుడు యనుమఁడి కుశలము,
యతడె యిచ్చు భద్రత యని యంద రనుట
రెండు మార్లత డోషధి శృంగిఁ దెచ్చి
నిన్ను సేనను బ్రతికించి నిజముఁ జేసె.... ॥ 232 ॥

(పరి = సేన, అనుమఁడు = హనుమంతుఁడు, కుశలము = క్షేమము, భద్రత = రక్షణ, మారు = తడవ, ఓషధి = మందుమూలిక, శృంగి = కొండ)

మన సేన బ్రహ్మాస్త్రం వల్ల మూర్ఛ నొందగా జాంబవంతుడు హనుమంతుడి కుశలము అడిగాడు. రెండు సార్లు అతడు ఓషధి పర్వతం తెచ్చి నిన్ను సేనను బ్రతికించి, "అతడే రక్షణ ఇస్తాడు" అని అందరు అనడాన్ని నిజం చేశాడు.

తే॥గీ॥ హనుమఁ జేసిన మేలు నీ జనన మందు
మరువ లేను, ప్రత్యుపకృతి పరిఘటించ
వీలుఁ గాదు, యందుల కత దేల సంక
టములఁ బడవలె ననుచు మనమునఁ దోఁచు... ॥ 233 ॥

(జననము = జన్మము, ప్రత్యుపకృతి = ప్రత్యుపకారము, పరిఘటించు = చేయు, సంకటము = బాధ, మనము = మనస్సు)

హనుమ చేసిన మేలు ఈ జన్మలో మరిచిపోలేను. ప్రత్యుపకారం చేయడానికి వీలు అవదు. అందుకోసం అతడు ఎందుకు కష్టాలలో పడాలి అని మనస్సుకి అనిపిస్తుంది. నేను కష్టాలలో ఉన్నప్పుడు హనుమ ఆదుకున్నాడు కదా అని, అతనికి నేను ప్రత్యుపకారం చెయ్యాలంటే అతను కష్టాల ఊబిలో చిక్కుకోవాలను కోవడం న్యాయం కాదు.

తే॥గీ॥ మాయ సీతనుఁ దెచ్చి భ్రమ నెనయించి
నాదు తలఁ దెచ్చిఁ గలిగించి నడుఁకు కుజకు
దైత్య కృత్రిమ మేధ యందలము నెక్కె
ముందు ముందు యీ విద్యయేఁ బొందు నిలుపు... ॥ 234 ॥

(భ్రమ = భ్రాంతి, ఎనయించు = కలిగించు, నడుఁకు = కంపము, కుజ = సీత, దైత్య = రాక్షస, మేధ = ధారణాశక్తి గలబుద్ధి, అందలము = పల్లకి, ముందుముందు = భవిష్యత్తులో, పొందు = స్నేహము, నిలుపు = ప్రతిష్ఠించు)

మాయ సీతను తెచ్చి భ్రాంతిని కలిగించి, నా తల తీసుకొచ్చి సీతకు వణుకు కలిగించి, రాక్షస కృత్రిమ మేధ (artificial intelligence) ప్రసిద్ధి కెక్కింది. భవిష్యత్తులో ఈ విద్యే స్నేహాన్ని నిలుపుతుంది.

తే॥గీ॥ కదన రంగ మందు తగులు గాయములకు
తృటిని వైద్యముఁ జేసెడి పటిమ యున్న
జీవదులు యోషధు లెరిగి చేవ నిలిపె
జోదుల కవి వాసనఁ జూపి చోద్యముగను... ॥ 235 ॥

(కదనరంగము = యుద్ధ రంగము, తృటిని = క్షణకాలంలో, పటిమ = నేర్పు, జీవదుఁడు = వైద్యుఁడు, ఓషధి = మందుమూలిక, చేవ = సత్తువ, జోదు = యోధుడు, చోద్యము = ఆశ్చర్యము)

యుద్ధ రంగములో తగిలే గాయాలకు క్షణకాలంలో చికిత్స చేసే నేర్పు ఉన్న వైద్యులు మందుమూలికలు తెలుసుకొని యోధులకు అవి వాసన చూపించి ఆశ్చర్యకరంగా సత్తువ నిలిపారు.

తే॥గీ॥ కొండ రాళ్ళతోడ పదును గోళ్ళ తోడ
కోరపళ్ళ తోడ కపులుఁ బోరు చుండ
ప్రముఖ శత్రువీరులు మ్రందె, విముఖుఁ డయ్యె
రావణుడు సుంత, పంతము చావకుండ... ॥ 236 ॥

(పదును = వాడి, కోర = పెద్ద, కపి = వానరము, మ్రందు = చచ్చు, విముఖుడు = మరలినవాఁడు, సుంత = కొంచెము, పంతము = పట్టుదల)

కొండ రాళ్ళతో వాడియైన గోళ్ళతో పెద్ద పళ్ళతో వానరులు యుద్ధము చేస్తూ ఉండగా ముఖ్యమైన శత్రువీరులు మరణించారు. పట్టుదల నశించని రావణుడు కొంచెము వెనక్కి తగ్గాడు.

కుంభకర్ణుని ఉపదేశము:

తే॥గీ॥ మనుజుని వలన ప్రాప్తించె మాకు భయము,
వానరులు ముట్టడించిరి స్వర్ణ లంక,
ప్రముఖులనుఁ జంపి కోశము వట్టిఁ జేసి
పిల్లల ముదుసలుల వీడి వినశనమునుఁ
గూర్చె, రక్షకుండవు నీవె కుంభకర్ణ!
యన్న యన్నకు దబ్బె నిట్లతడు వినుము... ॥ 237 ॥

(ప్రాప్తించు = లభించు, ముట్టడించు = చుట్టుముట్టు, స్వర్ణ = బంగారు, కోశము = బొక్కసము, వట్టి = రిక్తము, ముదుసలులు = వృద్ధులు, వీడు = వదలు, వినశనము = విధ్వంసము, కూర్చు = పొందించు, దబ్బు = చెప్పు)

మానవుడి వల్ల మాకు భయం కలిగింది. వానరులు స్వర్ణలంకను ముట్టడించారు. ముఖ్యమైన వాళ్ళని చంపి ధనాగారము రిక్తపరచి, పిల్లలని ముసలివాళ్ళని వదిలి నాశనం చెందించారు, కుంభకర్ణా! నీవే రక్షకుడవు అని అన్న అన్నయైన రావణునికి అతడు ఇలా చెప్పాడు. వినుము.

కం॥ బలవంతుడ నాకేమని
వలుమున సీతను హరించి ఫలితము మాటేఁ
దలఁపక, యగ్రజ! పిమ్మట
కలఁగుట పూర్వాపరములుఁ గనకయె, సుమ్మీ!... ॥ 238 ॥

(వలుము = మోసము, హరించు = దొంగిలించు, ఫలితము = ప్రయోజనము, తలఁచు = భావించు, అగ్రజ = అన్న, పిమ్మట = అనంతరము, కలఁగు = క్షోభించు, పూర్వాపరములు = ముందువెనుకలు, కను = చూచు)

అన్నా! బలం ఉన్న వాడిని నాకేమిటి అని మోహంతో సీతను హరించి, ప్రయోజనం మాటే ఆలోచించక, అనంతరం క్షోభించడం ముందు వెనుకలు చూడకపోవడం వల్లే సుమా!

తే॥గీ॥ స్వార్థపరు లహితము నైన స్వామి మెచ్చఁ
జెప్పు వారు మంత్రులుగ నున్నప్పు, డెవని
మాట వినని ప్రభువు యున్న, మంచి పనులుఁ
జేయు టన్నది యరుదగు, చెనఁటి నడుచు... ॥ 239 ॥

(అహితము = హితవుకానిది, స్వామి = ప్రభువు, అరుదు = అపురూపము, చెనఁటి = కుత్సితము)

స్వార్థపరులు హితవు కానిదైనా ప్రభువు మెచ్చే విధంగా చెప్పే వాళ్ళు మంత్రులుగా ఉన్నప్పుడు, ఎవని మాట వినని ప్రభువు ఉన్నా, మంచి పనులు చేయడం అన్నది అపురూమ మవుతుంది. కుత్సితం నడుస్తుంది.

తే॥గీ॥ ద్విశత గజముల పరిధి, ద్వాదశ శత గజ
ముల పొడవు యున్న విగ్రహము, రణ మందు
వేయి పుట్ల శూలముఁ బట్టి విసర, కుంభ
కర్ణుడా? యంత్రమా? యని కపు లదరిరి.... ॥ 240 ॥

(ద్విశత = రెండు వందలు, గజము = మూడడుగుల కొలఁది, పరిధి = చుట్టుకొలత, ద్వాదశ శత = పన్నెండు వందలు, రణము = యుద్ధము, పుట్టి = 60 కిలోలు, శూలము = ఆయుధము, కపి = వానరము, అదరు = భయపడు)

రెండు వందల గజాల చుట్టుకొలత, పన్నెండు వందల గజాల పొడవు ఉన్న విగ్రహం యుద్ధంలో అరువది వేల కిలోల శూలము పట్టి విసరగా కుంభకర్ణుడా? యంత్రమా? అని వానరులు భయపడ్డారు.

తే॥గీ॥ నీకు హితము విభీషణు నెరవు, యదియె
మంచిదని యన్నకుఁ గఱపి, మారకుండ
తాను మాత్ర మాలమున గతపడి కుంభ
కర్ణుడు, దశకంధరుని వివర్ణుఁ జేసె... ॥ 241 ॥

(హితము = మేలు, నెరవు = ఉపాయము, కఱపు = బోధించు, ఆలము = యుద్ధము, గతపడు = చచ్చు, దశకంధరుడు = రావణుడు, వివర్ణుఁడు = తెల్లబోయినవాఁడు)

నీకు విభీషణుని ఉపాయమే మంచిదని అన్నకు బోధించి, తాను మాత్రం మారకుండా యుద్ధంలో చచ్చి, కుంభకర్ణుడు రావణుణ్ణి తెల్లబోయేలా చేశాడు.

రావణ వధ:

ఉ॥ జంకునుఁ గొల్పు పోరున దశాస్యుడు ధీరుఁడు శత్రుధైర్యనా
శంకరుఁ దుద్ధతిం బఱప సాయక కోటిని నాదు మేనిపై,
లంక నృపాలు శౌర్య మకలంక మటంచును యస్త్ర వృష్టితో
బింకము రూపుమాపి యటు వెంబడిఁ గూల్చితి బమ్మయమ్మునన్ ॥ 242 ॥

(జంకు = భయము, కొల్పు = కొలుపు, పోరు = యుద్ధము, దశాస్యుఁడు = రావణుఁడు, ధీరుఁడు = ధైర్యముగలవాఁడు, శత్రుధైర్యనాశంకరుడు = శత్రువుల ధైర్యాన్ని నాశనం చేసే వాడు, ఉద్ధతి = గర్వము, పఱపు = ప్రయోగించు, సాయకము = బాణము, కోటి = సమూహము, మేను = శరీరము, నృపాలుడు = రాజు, శౌర్యము = పరాక్రమము, అకలంకము = మచ్చలేనిది, వృష్టి = వర్షము, బింకము = గర్వము, రూపుమాపు = నాశముచేయు, అటు వెంబడి = ఆ వెనువెంట, కూల్చు = చంపు, బమ్మయమ్ము = బ్రహ్మాస్త్రము)

భయం గొలిపే యుద్ధంలో ధైర్యము గలవాఁడు, శత్రువుల ధైర్యాన్ని నాశనం చేసే వాడైన రావణుఁడు గర్వంతో నా శరీరం మీద బాణ సమూహాన్ని ప్రయోగించగా లంకేశుని పరాక్రమము మచ్చలేనిది అంటూ అస్త్రవృష్టితో గర్వం నాశముచేసి ఆ వెనువెంట బ్రహ్మాస్త్రముతో చంపాను.

తే॥గీ॥ నేను దైవోపహతుడను నిశ్చయముగ
తాను శాపోపహతుడు భీతావహుండు
యెందరో తప్పునినను తా నియ్యకొనక
రావణుండు మొండిగఁ బోరి, వ్రాలెఁ దుదకు... ॥ 243 ॥

(దైవోపహతుఁడు = దురదృష్టవంతుడు, నిశ్చయము = తప్పక కలుగుట, శాపోపహతుడు = శాపము చేత పీడింపబడ్డవాడు, భీతావహుడు = భయాన్ని కలిగించువాఁడు, ఇయ్యకొను = ఒప్పుకొను, మొండి = మూర్ఖుడు, పోరు = యుద్ధము చేయు, వ్రాలు = చచ్చు, తుదకు = చివరకు)

నేను తప్పకుండా దురదృష్టవంతుణ్ణి. తాను శాపము చేత పీడింపబడ్డవాడు, భయాన్ని కలిగించేవాఁడు. ఎందరో తప్పు అని చెప్పినా తాను ఒప్పుకొనక రావణుడు మూర్ఖంగా యుద్ధం చేసి చివరకు చచ్చాడు.

కం॥ స్వార్థప్రవృత్తి వదలక,
వ్యర్థముగా జీవితము నియంత్రించుచు, ప్ర
త్యర్థుల నారటపెట్టిన,
పార్థివుఁడగు రావణుండు, వ్రాలెను యనిలో... ॥ 244 ॥

(ప్రవృత్తి = స్వభావము, వ్యర్థము = అప్రయోజకము, నియంత్రించు = అదుపులో నుంచు, ప్రత్యర్థి = శత్రువు, ఆరటపెట్టు = బాధపెట్టు, పార్థివుఁడు = రాజు, వ్రాలు = చచ్చు, అని = యుద్ధము)

స్వార్థప్రవృత్తి విడిచి పెట్టక, అప్రయోజకంగా జీవితాన్ని అదుపులో నుంచుతూ, శత్రువులను బాధపెట్టిన రాజైన రావణుడు యుద్ధంలో మరణించాడు.

సీ॥ దిగ్విజయముఁ జేసి దేవ గణములను
యోడించినట్టి సుయోధనుండు;
విష్ణుభక్తులఁ బట్టి పీడించు క్రమమున
దుశ్శాసనుడుగ ఖ్యాతుడగు నేత;
స్త్రీలౌల్యమున సాహసి; వలదను విభీష
ణుని కకర్ణుడు; సీతనుఁ జెరపట్టి
లంకలో నుంచి యీ రాముని కోపాగ్ని
కి యపదేశ మగుచు; కృష్ణశకుని

తే॥గీ॥ నైన, సీతకు పరిలోప మన క్షమింప
నట్టి యీ రాముని కదన మందుఁ గవిసి
బమ్మయమ్మున వింశతిబాహు డీల్గె
భస్మసింహాసనముఁ గాగ స్వర్ణలంక... ॥ 245 ॥

(దిగ్విజయము = అన్ని దిక్కులలో ఉన్న రాజ్యాలను జయించుట, గణము = సమూహము, సుయోధనుడు = చక్కని యుద్ధం చేసేవాడు, పీడించు = బాధించు, క్రమము = వరుస, దుశ్శాసనుడు = శాసింప లేక అదుపు చేయ సాధ్యము కానివాడు, ఖ్యాతుఁడు = ప్రసిద్ధుఁడు, నేత = నాయకుడు, లౌల్యము = ఆశ, సాహసి = తెగువరి, అకర్ణుడు = చెవిటివాఁడు, చెరపట్టు = నిర్బంధించు, అపదేశము = కారణము, కృష్ణశకుని = కాకి, పరిలోపము = అపకారము, కదనము = యుద్ధము, కవియు = ఎదిరించు, బమ్మయమ్ము = బ్రహ్మాస్త్రము, వింశతిబాహుడు = రావణుఁడు, ఈల్గు = చచ్చు, భస్మ = బూడిద, స్వర్ణ = బంగారు)

దిగ్విజయం చేసి దేవతా సమూహాలను ఓడించి నటువంటి యుద్ధనిపుణుడు, విష్ణు భక్తులను పట్టి బాధించే క్రమంలో శాసింప సాధ్యము కానివాడుగా ప్రసిద్ధి కెక్కిన నాయకుడు, స్త్రీ లోలత్వములో తెగువరి, వద్దని చెప్పే విభీషణుడికి చెవిటివాడు, సీతను నిర్బంధించి లంకలో ఉంచి ఈ రాముని కోపము అనే అగ్నికి కారణము అవుతూ, సీతకు అపకారము అంటే కాకి నైనా క్షమించని ఈ రాముని యుద్ధంలో ఎదిరించి బంగారు లంక భస్మ సింహాసనం కాగా బ్రహ్మాస్త్రము చేత రావణుడు చచ్చాడు. (భారతం లోని పేర్లతో వ్రాసిన పద్యం ఇది.)

యుద్ధానంతర విశేషాలు:

తే॥గీ॥ అంతమయె వైరము మరణానంతరమున
యని విభీషణు తోడ నేనన్న మాట
జగతి కౌదార్యమును నేర్పు, జటిల మైన
ప్రశ్నలకు సరళమగు జవాబు లిచ్చు... ॥ 246 ॥

(అంతము = తుది, వైరము = విరోధము, అనంతరము = తరువాత, జగతి = లోకము, ఔదార్యము = ఉదారత్వము, జటిలము = చిక్కైనది, సరళము = తిన్నని)

మరణం తరువాత విరోధము అంతమవుతుంది ("మరణాంతాని వైరాణి" అన్న శ్లోకం వాల్మీకి రామాయణంలో ఉంది.) అని విభీషణునితో నేను అన్న మాట లోకానికి ఔదార్యాన్ని నేర్పుతుంది, చిక్కుముడి లాంటి ప్రశ్నలకు తిన్నని జవాబు లిస్తుంది.

ఉ॥ **బల్లిదుడైన వాలి నొక బాణముఁ దోడనె సంహరించె, నీఁ**
జెల్లికి ముక్కుఁ గర్ణములు ఛేదనఁ జేసెను, భీతి తోడ కం
పిల్లిన సౌరిఁ గాచి కపివిట్పతిఁ జేసె నటంచు, యాజి నీ
డ్గిల్లిన రావణుం గనిన గేహినిఁ బల్కెను, నన్ను మెచ్చుచున్... ॥ 247 ॥

(బల్లిదుఁడు = మిక్కిలిబలము గలవాఁడు, కర్ణము = చెవి, ఛేదన = ఖండన, భీతి = భయము, కంపిల్లు = వణకు, సౌరి = సుగ్రీవుడు, విట్పతి = రాజు, ఆజి = యుద్ధము, ఈడ్గిల్లు = కూలఁబడు, కను = చూచు, గేహిని = ఇల్లాలు)

బలవంతుడైన వాలిని ఒక బాణంతోనే చంపాడు, నీ చెల్లెలికి ముక్కు చెవులు ఖండన చేశాడు, భయంతో వణికిన సుగ్రీవుణ్ణి కాపాడి వానరరాజును చేశాడు అంటూ యుద్ధంలో కూలబడ్డ రావణుణ్ణి చూసి ఇల్లాలైన మండోదరి నన్ను మెచ్చుకుంటూ అంది.

ఉ॥ **అక్కజ మందు నిగ్రహము నర్చన లందునఁ జూపు నీ పయిన్**
యక్కసు పొందె నింద్రియము లన్నియు యన్నటు స్త్రీ సుఖంబునే
చక్కగ మార్చి తీవు దినచర్యగ, ముప్పు గ్రహించి సీతపై
దృక్కు మరల్చి నీ సతి హృదిన్ శమమున్ నిలుపంగఁ దోఁచకన్ ॥ 248 ॥

(అక్కజము = ఆశ్చర్యము, నిగ్రహము = సంయమనము, అర్చన = ఉపాసన, అక్కసు = ఆగ్రహము, దినచర్య = నిత్యకృత్యము, ముప్పు = ఆపద, దృక్కు = చూపు, మరల్చు = మళ్ళించు, మామక = నాది, హృది = మనస్సు, శమము = శాంతి, నిలుపు = నిలబెట్టు, తోఁచు = మనసున ఏర్పడు)

ఆపదను గ్రహించి సీతపై చూపు మళ్ళించి నీ భార్య మనస్సున శాంతిని నిలపాలని అనిపించక, ఆశ్చర్యం కలిగే విధంగా ఉపాసనలలో నిగ్రహం చూపించే నీ పైన ఇంద్రియాలన్నీ ఆగ్రహము పొందాయి అన్నట్లు స్త్రీసుఖాన్నే చక్కగా నిత్యకృత్యంగా మార్చావు, నువ్వు.

తే॥గీ॥ ఇంద్రియమ్ముల శాసించి యెన్నొ యేండ్లు
తపముఁ జేసి వరము లంది దర్ప మొప్ప
మూడు లోకములను దశముఖుడు గెలిచె,
యిప్పు డవియె శాసించ తా నీల్గె ననుచు
వగచె మండోదరి గతించు పతినిఁ జూచి... ॥ 249 ॥

(శాసించు = ఆజ్ఞాపించు, దర్పము = గర్వము, దశముఖుడు = రావణుడు, ఈల్గు = చచ్చు, వగచు = శోకించు, గతించు = చచ్చు, పతి = భర్త)

ఎన్నో సంవత్సరాలు ఇంద్రియాలను శాసించి తపస్సు చేసి వరాలు పొంది గర్వము అతిశయించగా ముల్లోకాలు రావణుడు గెలిచాడు. ఇప్పుడు అవియే శాసించగా తాను చచ్చాడు అంటూ మండోదరి మరణించిన భర్తను చూసి శోకించింది.

తే॥గీ॥ నిన్ను బాధలు పెట్టిన నీచ రక్క
సులను చంపెద నన వాయుసుతుడు, సీత
శాంత పరచి, వారు ప్రభునాజ్ఞనుఁ జరించు
భటులు, యస్వతంత్రులుఁ, జంప వలదని యనె,
ప్రభుత మారిన యీ నీతి పథముఁ దెల్పు... ॥ 250 ॥

(రక్కసి = రాక్షసి, వాయుసుతుడు = హనుమంతుడు, చరించు = ప్రవర్తించు, భటులు = సేవకులు, అస్వతంత్రులు = బానిసలు, ప్రభుత = పరిపాలనా వ్యవస్థ, నీతి = న్యాయము, పథము = మార్గము)

నిన్ను బాధలు పెట్టిన నీచులైన రాక్షస స్త్రీలను (సీతకు కాపలా ఉన్న) చంపుతాను అని హనుమంతుడు అనగా సీత శాంత పరచి, వారు రాజాజ్ఞ ప్రకారం

ప్రవర్తించే సేవకులు, బానిసలు, చంప వద్దు అని అంది. ఈ నీతి పరిపాలనా వ్యవస్థ మారినపుడు మార్గము తెలుపుతుంది. బ్రిటీషు (British) పాలకుల దగ్గర పనిచేస్తూ భారత ప్రజలను పీడించిన భారతీయ పౌర సేవల (Indian Civil Services) సభ్యులను స్వాతంత్ర్యానంతరం తొలగించాలా వద్దా అన్న విషయం చర్చకు వచ్చినప్పుడు సర్దార్ పటేల్ గారి (Sardar Patel) సూచన మేరకు ఈ నీతినే పాటించినట్లు కనపడుతుంది.

తే॥గీ॥ రక్కసుని యింట కొంత కాలము వసించి
సీత వచ్చె ననిఁ దెలియఁ, బ్రీతియు కిను
కయును దైన్య మొక్కటిగ నన్ గలచె, సీత
నీదు మాట వినక వచ్చెఁ గాదె నిటుల... ॥ 251 ॥

(రక్కసుడు = రాక్షసుడు, వసించు = నివసించు, ప్రీతి = సంతోషము, కినుక = కోపము, దైన్యము = దీనత్వము, కలచు = కలతపెట్టు, ఇటుల = ఇట్లు)

రాక్షసుడి ఇంట్లో కొంత కాలం నివసించి సీత వచ్చింది అని తెలియగానే సంతోషము, కోపము, దైన్యము ఒక్కటిగా నన్ను కలతపెట్టాయి. సీత నీ మాట వినకపోవడం వల్ల వచ్చింది కాదా ఇదంతా?

తే॥గీ॥ పెండ్లి యందు, స్వయంవర వేళ, యజ్ఞ
మందు, యాపద లందును, యాల మందు,
రాజ్య సంబంధ మగు క్షోభ ప్రాజ్యమైన,
కాంతు కడ నుండ, నితరుల కంటఁబడుట
దొసగుఁ గాదు సతుల కని, తొంగిచూచు
కపుల నడుమ నడువ జనకజకు యాన
తివ్వ, యామె కదలి వచ్చె దివ్వె వోలె... ॥ 252 ॥

(ఆలము = యుద్ధము, క్షోభ = వ్యాకులత, ప్రాజ్యము = అధికము, కాంతుడు = మగడు, కడ = చెంత, కంటఁబడు = కనఁబడు, దొసగు = దోషము, సతి = భార్య, తొంగిచూచు = వంగి చూచు, కపి = వానరము, నడుమ = మధ్య,

జనకజ = సీత, ఆనతి = ఆజ్ఞ, దివ్వె = దీపము)

పెళ్ళిలోను, స్వయంవరం వేళ, యజ్ఞంలో, ఆపదల్లో, యుద్ధంలో, రాజ్య సంబంధమైన వ్యాకులత ఎక్కువైనపుడు, భర్త దగ్గర ఉన్నప్పుడు, ఇతరులకు కనఁబడడం స్త్రీలకు దోషం కాదు అని, వంగి చూసే వానరుల మధ్య నడవమని సీతకు ఆజ్ఞ ఇవ్వగా, ఆమె దీపం జ్యోతి లాగా నడిచి వచ్చింది.

తే॥గీ॥ పరగృహమున యున్న సతిని మరల స్వీక
రించునె కులీనుఁడు? యసురు ప్రేక్షణముల
వాని యొడిని నలిగి నట్టి పడతి సీత
శీల మందున విశ్వాస మేల నుండు?
నన్ను లోకాపవాదమ్ము వెన్నుదగుల
నిట్లు కటువుగాఁ బలికితి నేవగించి... ॥ 253 ॥

(పరగృహము = ఇతరుల ఇల్లు, సతి = భార్య, కులీనుఁడు = మంచికులమునఁ బుట్టినవాఁడు, అసురుఁడు = రాక్షసుఁడు, ప్రేక్షణము = నేత్రము, ఒడి = తొడ పైభాగము, పడతి = స్త్రీ, శీలము = పవిత్ర చరిత్రము, విశ్వాసము = నమ్మకము, అపవాదము = నింద, వెన్నుదగులు = వెంబడించు, కటువు = కఠినము, ఏవగించు = అసహ్యపడు)

ఉత్తమ కుల సంజాతుడు పరాయి పంచన ఉన్న భార్యను మళ్ళీ స్వీకరిస్తాడా? రాక్షసుని కళ్ళలో ఒళ్ళో నలిగినటువంటి స్త్రీ సీత యొక్క పాతివ్రత్యములో నమ్మకం ఎట్లా ఉంటుంది? నన్ను లోకనింద వెంటాడగా రోసి ఈ విధంగా కఠినంగా మాట్లాడాను.

తే॥గీ॥ కంటి జబ్బుండి దీపముఁ గాన రాని
వాని వలెనె భిన్నంబుగఁ గానఁబట్టి
శీలమునుఁ గూర్చి యడిగితి సీత నచట
జగతి కొచ్చెడి యాశంక జంకుఁ గఱప
ప్రశ్న జనులదిఁ గనుక జవాబు నరయ... ॥ 254 ॥

(కానరాని = కనపడని, భిన్నము = వేఱైనది, కానఁబట్టు = కనఁబడు, శీలము = పాతివ్రత్యము, ఆశంక = సందేహము, జంకు = భయము, కఱపు = కలుగఁ జేయు, జనులు = జనసమూహము, అరయు = విచారించు)

కంటి జబ్బు ఉండి దీపం కనఁబడని వాడి వలెనే వేఱుగా కనఁబడగా, లోకానికి వచ్చే సందేహం భయాన్ని కలుగఁజేయగా, ప్రశ్న జనసమూహానిది కనుక జవాబు విచారించడానికి పాతివ్రత్యము గురించి సీతను అడిగాను అక్కడ.

మన సివిల్ ప్రొసీజర్ కోడులో (Civil Procedure Code) ప్రాతినిధ్య దావాలకు (Representative Suit) సంబంధించిన నియమాలు ఉన్నాయి. ఒక ప్రశ్న గురించి ఒకే విధమైన ఆసక్తి ఉన్న అనేక మంది వ్యక్తులు ఉన్నప్పుడు, ఆసక్తి ఉన్న వారందరి తరపున ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు కోర్టులో ప్రాతినిధ్య దావా వేయవచ్చు. అంటే, ఆసక్తి ఉన్న వాళ్ళందరూ విడివిడిగా దావాలు వెయ్యక్కరలేదని అర్థం. ఇక్కడ రాముడు వేసిన ప్రశ్న, ఆతడు అందరి తరపున వేసినట్లు అనుకోవాలి.

కం॥ నీ వన యాసక్తి వశిక
మీ వెట కైనన్ మనుటకు నేగు మటంచున్
పావని సీతకుఁ జెప్పితి,
భావనను రవంత యధ్రువము లేకున్నన్... ॥ 255 ॥

(ఆసక్తి = శ్రద్ధ, వశికము = శూన్యము, ఈవు = నీవు, ఎట = ఎక్కడ, మను = జీవించు, ఏగు = వెళ్ళు, పావని = పవిత్రురాలు, భావన = తలఁపు, రవంత = కొంచెము, అధ్రువము = సందిగ్ధము)

ఆలోచనలో కొంచెం కూడా సందిగ్ధము లేకున్నప్పటికీ, నువ్వంటే ఆసక్తి శూన్యము, నువ్వు బ్రతకడానికి ఎక్కడికైనా వెళ్ళమంటూ పవిత్రురాలైన సీతకు చెప్పాను.

తే॥గీ॥ కుజను పరికించ కున్న లోకులుఁ గనెదరుఁ
గామిగా నన్ను, మౌనిగఁ గాంచు చుంటి

నామె యగ్నిప్రవేశము నందు వలన,
నాకుఁ దెలియు నామె గురించి, నాకుఁని విడి
కాంతి యుండు ననుట పెద్ద కల్లఁ గాదె,
యటులె సీత నన్నెడఁబాసె ననుటఁ బొల్లు,
ద్రష్ట లిది మెచ్చి రనుకొంటి, తట్టకపుడు... ॥ **256** ॥

(కుజ = సీత, పరికించు = పరీక్షించు, లోకులు = జనులు, కను = చూచు, కామి = స్త్రీలోలుడు, మౌని = మౌనముగలవాడు, కాంచు = చూచు, నాకుఁడు = సూర్యుడు, విడి = త్యజించు, కల్ల = అబద్ధము, ఎడఁబాయు = వీడిపోవు, పొల్లు = అనృతము, ద్రష్ట = చూచువాఁడు, తట్టు = తోఁచు)

సీతను పరీక్షించకపోతే జనులు నన్ను స్త్రీలోలుడిగా చూస్తారు. అందువల్లే మౌనంగా ఆమె అగ్నిప్రవేశము చూస్తున్నాను. నాకు ఆమె గురించి తెలియును. సూర్యుణ్ణి విడిచి కాంతి ఉంటుందని అనడం పెద్ద అబద్ధము కాదా. అలాగే, సీత నన్ను వీడి పోయిందనడం అనృతము. నా కప్పుడు తట్టక, చూసిన వాళ్ళు ఇది మెచ్చు కున్నారనుకున్నాను.

కం॥ నీ వొక సామాన్యుఁని వలె
యీ వైదేహినిఁ దెగడుదు వేలా? రామా!
సావాసముఁ జాలని కుజ,
చావే యిక తథ్య మనుచు, జ్వాలను దూకెన్... ॥ **257** ॥

(సామాన్యుఁడు = విశేషవ్యక్తి కానివాఁడు, వైదేహి = సీత, తెగడు = తిరస్కరించు, సావాసము = పొత్తు, చాలు = సరిపడు, కుజ = సీత, తథ్యము = సత్యము, జ్వాల = మంట, దూకు = దుముకు)

రామా! నీవు ఒక సామాన్య వ్యక్తి లాగా ఈ సీతను తిరస్కరిస్తా వెందుకు? పొత్తు చాలు అని, మరణమే సత్య మంటూ సీత మంటలో దూకింది.

కం॥ జ్వాలను దూకు కుజనుఁ గొని
జ్వాలాజిహ్వుఁడు మెలఁపున వచ్చెన్ యామెన్
శీలవతి యటంచుఁ దెలుప,
యా లీలను సేనఁ జూడ యాశ్చర్యముగన్... ॥ 258 ॥

(జ్వాలాజిహ్వుఁడు = అగ్ని, మెలఁపు = జాగరూకత, శీలవతి = సుగుణవతి, లీల = విలాసము)

మంటలో దూకిన సీతను తీసుకొని, ఆమెను సుగుణవతి అంటూ చెప్పడానికి ఆ విలాసాన్ని ఆశ్చర్యంతో సేన చూస్తూ ఉండగా అగ్నిదేవుడు జాగ్రత్తగా వచ్చాడు.

కం॥ ఆ వింతనుఁ గనుఁగొనగా
భావోద్వేగంబు నాదు స్వాంతముఁ నిండన్,
నా వైదేహినిఁ జేరగ
యావేశము పొంగి యిటుల యార్తినిఁ బలికెన్... ॥ 259 ॥

(కనుఁగొను = వీక్షించు, ఉద్వేగము = కలఁత నందిన మనస్సు, స్వాంతము = మనస్సు, వైదేహి = సీత, ఆవేశము = ఉద్రేకము, ఆర్తి = బాధ)

ఆ వింతను చూడగా నా మనస్సులో భావోద్వేగం నిండగా నా సీతను చేరడానికి ఉద్రేకము పొంగి ఈ విధంగా బాధతో పలికింది (ముందరి పద్యంతో అన్వయము).

కం॥ గత మవగతమే, నీ జీ
విత ప్రస్థానము నరయగ, పెనగిన యిడుముల్
వెత లెక్కువ, సుఖము వెలితి,
చతురతతో నెగ్గితీవు చరితార్థముగన్... ॥ 260 ॥

(గతము = జరిగినది, అవగతము = తెలియబడినది, ప్రస్థానము = ప్రయాణము, అరయు = విచారించు, పెనగు = ఎదిరించు, ఇడుము = కష్టము, వెత =

శోకము, వెలితి = తక్కువ, చతురత = నేర్పు, నెగ్గు = జయమునొందు, ఈవు = నీవు, చరితార్థము = సార్థకము)

జరిగిన దేమిటో తెలిసినదే. నీ జీవన ప్రయాణం విచారించగా పడ్డ కష్టాలు శోకాలు ఎక్కువ, సుఖాలు తక్కువ, నేర్పుతో నువ్వు సార్థకంగా నెగ్గుకొచ్చావు.

కం॥ ఎన్నో కష్టము లోర్చిన
నిన్నుం గన, ప్రేమశక్తి నివ్వెఱఁ బఱచెన్,
యిన్నాళ్ళ యెదురుఁ జూపుకు,
నన్నే యర్పించు కొంటి, నాకిక నీవే... ॥ 261 ॥

(ఓర్చు = భరించు, కను = చూచు, నివ్వెఱ = ఆశ్చర్యము, పఱచు = పడజేయు, ఎదురుచూపు = ముందుచూపు, అర్పించు = గౌరవ సూచకంగా సమర్పించు)

ఎన్నో కష్టాలు భరించిన నిన్ను చూడగానే ప్రేమశక్తి ఆశ్చర్యపఱచింది. ఇన్నాళ్ళ ఎదురుచూపుకు నన్నే సమర్పించుకున్నాను. నాకు ఇంకా నువ్వే.

తే॥గీ॥ నగర మందున నేను రాఁదగనుఁ గాన
లంకఁ జూడ నేనప్పుడు రానసంటి,
స్వర్ణమయ మైన దైనను స్వర్గ మైన
జనని జన్మభూముల కంటె శస్త మగునె?... ॥ 262 ॥

(నగరము = పట్టణము, తగు = యుక్తమగు, కాన = కనుక, స్వర్ణమయము = బంగారంతో నిండినది, స్వర్గము = దేవలోకము, జనని = తల్లి, జన్మభూమి = పుట్టిన స్థానము, శస్తము = శ్రేష్ఠము)

పట్టణంలోకి నేను రాకూడదు కనుక లంక చూడడానికి అప్పుడు రానని అన్నాను. బంగారంతో నిండినదైనా స్వర్గమైనా తల్లి, జన్మభూమి కన్నా శ్రేష్ఠమవుతుందా? ("జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అన్న శ్లోకం వాల్మీకి రామాయణంలో ఉంది.)

కం॥ భరతుని రాక కపార్థము
నరసిన నినుఁ దప్పుఁబడితి నడవిని, యదియే
పొరపాటు నేనుఁ జేసితి
నరయగ సామీరి నంపి యనుజుఁని మనమున్... ॥ 263 ॥

(రాక = ఆగమనము, అపార్థము = తప్పు అర్థము, అరయు = ఆలోచించు లేక విచారించు, పొరపాటు = తప్పు, సామీరి = హనుమంతుఁడు, అంపు = పంపు, అనుజుఁడు = తమ్ముడు, మనము = మనస్సు)

వాల్మీకి రామాయణం అయోధ్య కాండము లోని 96–97వ సర్గములలో భరతుడు సైన్యసమేతుడై వనవాసంలో ఉన్న సీతారామ లక్ష్మణులను కలవడానికి రావడం, అది చూసి లక్ష్మణుడు భరతుడు తమ్ము చంపడానికి వస్తున్నాడని అనడం, రాముడు భరతుని గొప్పదనం గురించి చెప్పి లక్ష్మణుణ్ణి శాంతపరచి యుద్ధవిముఖుణ్ణి చెయ్యడం జరిగాయి. ఇక పద్యంలో ఏముందో చూద్దాం.

భరతుని రాకకు తప్పు అర్థము ఆలోచించిన నిన్ను అడవిలో తప్పుపట్టాను. హనుమంతుణ్ణి తమ్ముడి మనసు తెలుసుకోవడానికి పంపి అదే తప్పు నేను చేశాను.

తే॥గీ॥ ఎట్టి సుఖములు యెదుట లేనట్టి వనిని
గట్టి దీక్షను మన ముంటఁ గాదు కస్తి,
యన్ని సుఖములు యెదుటనే యున్నఁ గాని
వలదని త్యజించుటే మిన్న భరతు వోలె... ॥ 264 ॥

(వని = అడవి, దీక్ష = పట్టుదల, కస్తి = కష్టము, త్యజించు = విడుచు, మిన్న = శ్రేష్ఠము, పోలె = వలె)

ఎటువంటి సుఖాలు ఎదురుగా ఉండనటువంటి అడవిలో గట్టి పట్టుదలతో మనం ఉండడం కష్టం కాదు. అన్ని సుఖాలు ఎదురుగా ఉన్నా కానీ భరతుడి లాగా వద్దని విడిచిపెట్టడమే శ్రేష్ఠము.

ఉ॥ చేరు నయోధ్య రాము డిటఁ జేకొను రాజ్యము, కాక యున్నఁ జే
కూరును నాకు చావనుచు గోదును కైక సుతుండుఁ గ్రక్క, యా
తీరునుఁ గాంచి యానిలి, ప్రతీక్షణమా, భరతా! ముగించి మీ
యూరున స్వాగ తమ్మిడగ యుద్యతిఁ జేయుము రాము కంచనెన్ ॥ 265 ॥

(ఇట = ఇక్కడ, చేకొను = గ్రహించు, కాక = తక్క, చేకూరు = సిద్ధించు, గోదు = బాధ, సుతుడు = పుత్రుడు, క్రక్కు = వెడలఁజేయు, కాంచు = చూచు, ఆనిలి = హనుమంతుడు, ప్రతీక్షణము = ఎదురుచూచుట, ముగించు = సమాప్తము చేయు, ఊరు = దేశం, స్వాగతము = వచ్చినవారి ఆదరణ, ఇడు = ఇచ్చు, ఉద్యతి = యత్నము)

అయోధ్యను చేరుకుంటాడు, రాముడు ఇక్కడ రాజ్యము గ్రహిస్తాడు, అట్లా కాకుంటే, నాకు చావు వస్తుంది అని కైక కుమారుడైన భరతుడు బాధ వెళ్ళగ్రక్కగా, ఆ తీరును చూచి హనుమంతుడు, భరతా! ఎదురుచూడడం ముగించి మీ దేశంలో రాముడికి స్వాగతము ఇచ్చే ప్రయత్నము చెయ్యి అని అన్నాడు.

మ॥ భరతుం డగ్రజు నన్నుఁ గాంచి మది సంభావించి హ్వానక్రియల్
సరిగాఁ గైకొనియెన్, వసంతము మహా సంపూర్ణ భావోన్నతిం
బురమెల్లన్ జిలికించె కోసల జనుల్, భూపుత్రికై మానమం
దరు నిర్జించిన నన్ను, శాంతిని సముత్థాపించగా మెచ్చుచున్..॥ 266 ॥

(అగ్రజుడు = అన్న, కాంచు = చూచు, మది = మనస్సు, సంభావించు = ఆదరించు, హ్వాన = పిలుచుట, క్రియ = చేష్ట, సరి = యుక్తము, కైకొను = అనుసరించు, వసంతము = పసుపుసున్నమును కలిపిన యెఱ్ఱనీళ్ళు, సంపూర్ణ = పరిపూర్ణము, ఉన్నతి = అతిశయము, పురము = పట్టణము, చిలికించు = చల్లు, భూపుత్రి = సీత, మానమందరుడు = రావణుడు, నిర్జించు = జయించు, సముత్థాపించు = ప్రతిష్ఠించు, మెచ్చు = శ్లాఘించు)

భరతుడు అన్నయైన నన్ను చూచి మనస్సులో గౌరవించి ఆహ్వాన ప్రక్రియ తగిన విధంగా అనుసరించాడు. కోసల దేశపు ప్రజలు ఎళ్లనీళ్ళు గొప్పదైన సంపూర్ణమైన భావాతిశయంతో పట్టణ మంతా చల్లారు. సీత కోసం రావణుణ్ణి జయించిన నన్ను శాంతిని ప్రతిష్ఠించినందుకు మెచ్చుకున్నారు.

తే॥గీ॥ నాకు పట్టాభిషేక మొనర్చు నాఁడు
నాదు ముగ్గురుఁ దమ్ములు నాకు సేవఁ
జేయఁ, గని విభీషణుడు సుగ్రీవు డూర్చి
కన్ను లొత్తుకొనిరి, జ్ఞప్తి కన్న రాగ... ॥ 267 ॥

(పట్టాభిషేకము = పట్టము గట్టునపుడు చేయు ఉత్సవము, ఒనర్చు = చేయు, నాఁడు = రోజు, కను = చూచు, ఊర్చు = నిట్టూర్చు, కన్నులొత్తుకొను = కన్నులు అద్దుకొను, జ్ఞప్తి = జ్ఞాపకము)

నాకు పట్టాభిషేకము చేసే రోజున నా ముగ్గురు తమ్ములు నాకు సేవ చేయగా చూచి విభీషణుడు సుగ్రీవుడు అన్న గుర్తు రాగా కళ్లు ఒత్తుకున్నారు.

తే॥గీ॥ అంతయు సుఖాంత మయ్యెలే యనుట కేది,
మూడు ఘటనల విచికిత్స మోసులెత్తె,
శంబుక వధయు, శునక విజ్ఞప్తి, కుజను
వీడుట యెసకొలిపె నవలోడనమ్ము... ॥ 268 ॥

(సుఖాంతము = ముగింపు సంతృప్తిగా ఉండటం, విచికిత్స = సంశయము, మోసులెత్తు = మెల్లగా పైకి వచ్చు, వధ = చంపుట, శునకము = కుక్క, విజ్ఞప్తి = విన్నపము, కుజ = సీత, వీడు = వదలు, ఎసకొలుపు = ప్రేరేపించు, అవలోడనము = విమర్శ)

అంతా సుఖాంతము అయ్యిందిలే అనడానికి ఏది. మూడు ఘటనలలో సంశయము మెల్లగా పైకి వచ్చింది. శంబుకుణ్ణి చంపడం, కుక్క విన్నపము, సీతను వదలిపెట్టడం విమర్శను ప్రేరేపించాయి.

సీతాపరిత్యాగము:

తే॥గీ॥ రావణుని వశమున నున్న రాణి యన్న
నిజము మరచి రాఘవు డయోనిజనుఁ దెచ్చి
యేమి యెరుగని విధమున యేలు కొనుట
మాకు కలిగించె రోఁతని లోకు లనిరి... ॥ 269 ॥

(వశము = అధీనము, అయోనిజ = సీత, రోఁత = జుగుప్స, లోకులు = జనులు)

భార్య రావణుని అధీనంలో ఉన్నదన్న నిజము మరచిపోయి శ్రీరాముడు సీతను తెచ్చి ఏమీ ఎరుగని విధంగా పరిగ్రహించడం మాకు జుగుప్స కలిగించెనని జనులు అన్నారు.

తే॥గీ॥ శీలమునుఁ గూర్చి యలనాఁడు సీత నడుగ
యగ్ని నామె దుముకుట యా యగ్ని దేవు
డామె పరిశుద్ధ యనుటయు యలముకొనక,
ప్రజ లెరుగ రీ యుదంతము నిజమెఁ గాని
నే నపు డనుకొన్న తలఁకె నిజము యయ్యె... ॥ 270 ॥

(శీలము = పాతివ్రత్యము, కూర్చి = గురించి, అలనాఁడు = పూర్వము, పరిశుద్ధ = మిక్కిలి శుద్ధిపొందినది, అలముకొను = వ్యాపించు, ఉదంతము = వృత్తాంతము, తలఁకు = సందేహము)

పాతివ్రత్యము గురించి అదివరకు సీతను ప్రశ్నించగా ఆమె అగ్నిలో దూకడం, అగ్నిదేవుడు ఆమె పరిశుద్ధ అని అనడం అన్నవి వ్యాపించకపోవడం వల్ల ప్రజలు ఈ వృత్తాంతము ఎరుగరు అన్నది నిజమే కానీ నేను అప్పుడు అనుకున్న సందేహమే నిజమయ్యింది.

తే॥గీ॥ భార్య యిట్లున్నను క్షమించు ప్రభువు యున్న,
ప్రజలుఁ గూడ సైఁప వలయు భార్యల నిటు
లనుచు బహిరంగ మందు లోకాపవాద
ముండ, యెట్లలక్ష్య మొనర్తు నోర్మి తోడ... ॥ 271 ॥

(సైపు = సహించు, బహిరంగము = బయలు పడినది, అపవాదము = నింద, ఒనర్చు = చేయు, ఓర్మి = క్షమ)

భార్య ఈ విధంగా ఉన్నా కూడా క్షమించే రాజు ఉంటే ప్రజలు కూడా భార్యలను ఇదే విధంగా సహించాలని లోక నింద ఉండగా, ఎట్లా క్షమతో అలక్ష్యము చేస్తాను.

తే॥గీ॥ నింద యెంతకాలము వ్యాప్తి యందు నుండు,
నంత దనుక నిందితు డుండు నంతకాల
యమున యనుచు శాస్త్రముఁ జెప్పు, సుమతి కుజను
విడుచుటే పరిష్కార మీ కడిఁది కయ్యె... ॥ 272 ॥

(అంతకాలయము = యమలోకము, సుమతి = మంచి బుద్ధి కలది, కుజ = సీత, పరిష్కారము = తీర్పు, కడిఁది = కష్టము)

నింద ఎంత కాలం వ్యాప్తిలో ఉంటుందో అంత వరకు నిందితుడు నరకంలో ఉంటాడని శాస్త్రం చెబుతోంది. మంచి బుద్ధి కల సీతను వదిలి పెట్టడమే ఈ కష్టానికి పరిష్కారం అయ్యింది.

కం॥ ఆనాటి జ్ఞాపకములను
యే నాటికి మరువఁజాల, నేమి వచింతున్
నా నాతికి? యో, సీతా!
పోనాడకఁ దప్ప లేదు పూజ్యవె యైనన్... ॥ 273 ॥

(వచించు = చెప్పు, నాతి = భార్య, పోనాడు = తిరస్కరించు, పూజ్య = పూజింపదగినది)

ఆ నాటి జ్ఞాపకాలను ఏనాటికి కూడా మరచిపోలేను. నా భార్యకి ఏమి చెబుతాను? ఓ, సీతా! పూజింపదగిన దానివియైనా తిరస్కరించక తప్ప లేదు.

కం॥ సత్య మిది, ప్రజావాణికి
భృత్యుఁడనై లోఁబడి, నిను భీకర వని నౌ

చిత్యము మరచి వదలి, యను
నిత్యము నినుఁ దలపగ, నను నిద్ర త్యజించెన్... ॥ **274** ॥

(ప్రజావాణి = ప్రజల వాక్కు, భృత్యుఁడు = సేవకుడు, లోఁబడు = అధీనమగు, భీకర = భయము పుట్టించునది, వని = అడవి, ఔచిత్యము = యోగ్యత, తలచు = స్మరించు, త్యజించు = వదలిపెట్టు)

నిజము ఇది. ప్రజల మాటకు అధీనమై నిన్ను భయంకరమైన అడవిలో ఔచిత్యము మరచి వదలిపెట్టి ప్రతిరోజు నిన్ను స్మరించగా నన్ను నిద్ర వదిలిపెట్టింది (నిన్ను వదలిన నన్ను నిద్ర వదలింది).

తే॥గీ॥ మునుల యాశ్రమములఁ జూడ ముచ్చటపడె
సీత, గర్భవతిఁ గనుక కౌతుకమునుఁ
దీర్చ వాల్మీకి యాశ్ర మాంతికమున విడి
నీవు పరితాపమున వచ్చినావు మరలి... ॥ **275** ॥

(ముచ్చటపడు = ఆశపడు, కౌతుకము = కోరిక, తీర్చు = సిద్ధింపఁజేయు, అంతికము = సమీపము, విడి = వదలిపెట్టి, పరితాపము = సంతాపము, మరలు = వెనుకకు తిరుగు)

మునుల ఆశ్రమములను చూడాలని సీత ఆశపడగా, గర్భవతి కావడం వల్ల కోరిక తీర్చడానికి వాల్మీకి ఆశ్రమ సమీపంలో వదలిపెట్టి నువ్వు సంతాపముతో వెనుకకు తిరిగి వచ్చావు.

కం॥ అంతర్వత్నివి, రఘుకుల
కాంతా! రమ్మనుచుఁ బిల్చె, కాంతారమునన్
యింతిని సీతనుఁ గని, వృ
త్తాంతము వాల్మీకి యెరిగి, తన కడ నుండన్... ॥ **276** ॥

(అంతర్వత్ని = గర్భిణి, కులకాంత = ఇల్లాలు, పిల్చు = పిలుచు, కాంతారము = అడవి, ఇంతి = స్త్రీ, కను = చూచు, వృత్తాంతము = సమాచారము, ఎరుగు = తెలిసికొను, కడ = చెంత)

అడవిలో స్త్రీయైన సీతను చూచి వాల్మీకి ముని సమాచారము తెలుసుకొని తన చెంత నుంచుకోవడానికి గర్భిణివి, రఘుకులంలో ఇల్లాలా! రమ్మని పిలిచాడు.

శునకము విజ్ఞప్తి:

తే॥గీ॥ మానవులుఁ గాని ప్రాణులు మాటలాడె,
మనుజు లంద నారోగ్యము కనఁబడదని,
వర్షపాతము సరిపడెఁ బంట చేల
ప్రజలు ముదము నుండిరి రామరాజ్య మందు
యనుచు భరతుడుఁ జెప్ప నే నలరి నాను... ॥ 277 ॥

(సరిపడు = అనుకూలమగు, పంటచేను = పంటనేల, ముదము = సంతోషము, అలరు = ఆనందించు)

మానవులు కాని జీవులు మాట్లాడాయి, మనుషుల్లో అనారోగ్యం కనబడదని, పంట పొలాల్లో వర్షపాతం అనుకూలంగా ఉందని, రామరాజ్యంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని భరతుడు చెప్పగా నేను ఆనందించాను.

కం॥ కారణము లేక కొట్టెను
పాఱుఁడు నన్ననెడి కుక్క వాదన వినగన్
వేరొక మార్గముఁ గానకఁ
గోరితి వేఁపిని వచింప కొఱతకు శిక్షన్... ॥ 278 ॥

(పాఱుఁడు = బ్రాహ్మణుడు, వాదన = తర్కబద్ధంగా చేసే అభిప్రాయ ప్రకటన, కను = చూచు, వేఁపి = కుక్క, వచించు = చెప్పు, కొఱత = తప్పు, శిక్ష = దండనము)

అకారణంగా బ్రాహ్మణుడు నన్ను కొట్టాడు అనే కుక్క వాదన వినగానే మరో దారి లేక తప్పుకి శిక్ష ఏమిటో చెప్పమని కుక్కను కోరాను.

తే॥గీ॥ పూర్వజన్మ మందున నేను పుణ్య మిచ్చు
కులపతిత్వము తోడ కోవెల మఠముల

యాధిపత్యముఁ జేసితి, యా యదనున
దేవతాద్రవ్యమును వాడితిని తెలియక,
కుక్కనైతి నా దొసఁగునకు, క్షితిసురుని
కా పదవి నిమ్మనుచుఁ గోరె వేఁపి యపుడు... ॥ 279 ॥

(అదను = సమయము, ద్రవ్యము = ధనము, వాడు = ఉపయోగించు, దొసఁగు = తప్పు, క్షితిసురుడు = బ్రాహ్మణుడు, పదవి = ఉన్నతస్థితి, వేఁపి = కుక్క)

పూర్వజన్మలో నేను పుణ్యము ఇచ్చే కులపతిత్వముతో పాటు దేవాలయాల మఠాల ఆధిపత్యము చేశాను. ఆ సమయంలో దేవుని ధనాన్ని తెలియక వాడాను. ఆ తప్పుకు కుక్కని అయ్యాను. బ్రాహ్మణునికి ఆ పదవి ఇమ్మని అప్పుడు కుక్క కోరింది.

తే॥గీ॥ పరధనమున కాశించు కాపటికు లెచట
యున్న నెపుడు యున్న శునక మన్న మాట
లందునఁ గల గూఢార్థము లరయగ గుణ
పాఠ మగు, శ్రేష్ఠమగు నడవడికి గతిగ... ॥ 280 ॥

(ఆశించు = కోరు, కాపటికుడు = మోసగాడు, శునకము = కుక్క, గూఢార్థము = దాగి యున్న అర్థము, అరయు = విచారించు, గుణపాఠము = ఇతరుల దుష్ప్రవర్తనకు చెప్పు తగిన జవాబు, శ్రేష్ఠము = ఉత్తమమైన, గతి = ఉపాయము)

ఇతరుల ధనాన్ని కోరే మోసగాళ్ళు ఎక్కడ ఉన్నా ఎప్పుడు ఉన్నా కుక్క అన్న మాటలలో ఉన్న గూఢార్థములు విచారిస్తే ఉత్తమమైన నడవడికి ఉపాయంగా గుణపాఠ మవుతుంది.

శంబూక వధ:

తే॥గీ॥ రాజు నడవడి యందు కళంక మున్న,
జను లయుక్త కార్యంబులుఁ బొనరుచున్నఁ,
బ్రాపు లేకున్న, దోషము రాజు దగుట
మృత్యుభయముఁ గల్గు ననుచు భృత్యుఁ లనిరి... ॥ 281 ॥

(నడవడి = ప్రవర్తనము, కళంకము = మచ్చ, అయుక్తము = తగని, కార్యము = పని, పొనరుచు = చేయు, ప్రాపు = రక్షణ, దోషము = తప్పు, మృత్యుభయము = మరణ భయము, ధృత్వుఁడు = బ్రాహ్మణుఁడు)

రాజు ప్రవర్తనములో కళంకము ఉన్నా, జనులు అయుక్తమైన పనులు చేస్తూ ఉన్నా, రక్షణ లేకున్నా, తప్పు రాజుదే అవడం వల్ల మరణ భయము కలుగుతుందని బ్రాహ్మణుఁలు అన్నారు.

తే॥గీ॥ సంఘమున వృత్తిపరముగ జాతు లుండు,
తాము శిక్షణఁ బొందిన తమకు నిడిన
వృత్తి విడనాడి తెలియని వృత్తి సేయ,
మిగులును దురాశ దుఃఖము జగతి యందు,
మందగించునుఁ గాదె సమస్త ప్రగతి... ॥ 282 ॥

(వృత్తి = జీవనోపాయము, పరము = ద్వారా, ఇడు = ఇచ్చు, విడనాడు = త్యజించు, జగతి = లోకము, మందగించు = తక్కువ అగు, సమస్త = సకలము, ప్రగతి = అభివృద్ధి)

సంఘంలో వృత్తిపరంగా జాతు లుంటాయి. తాము శిక్షణ పొందిన లేక తమకు ఇవ్వబడిన వృత్తిని వదిలిపెట్టి తెలియని వృత్తి చేస్తే లోకంలో దురాశ దుఃఖము మిగులుతాయి. అభివృద్ధి అంతా కుంటుపడుతుంది కదా.

తే॥గీ॥ పిన్న వయసున బ్రాహ్మణు పెద్ద నిద్ర
రాజ్యమున శూద్రుఁ దపము వలననె యనగ
నారదుండు, యా దుర్మతి పేరడఁచితి,
యతడె శంబూకుడు, యరిగె నమరపురికి... ॥ 283 ॥

(పిన్న = చిన్న, పెద్ద నిద్ర = చావు, శూద్రుఁడు = నాల్గవజాతివాఁడు, తపము = తపస్సు, దుర్మతి = దుర్బుద్ధికలవాఁడు, పేరడఁచు = చంపు, అరుగు = పోవు, అమరపురి = స్వర్గము)

చిన్న వయస్సులో బ్రాహ్మణుని చావు రాజ్యంలో నాల్గవ జాతి వాఁని తపస్సు వల్లనే అని నారదుడు అనగా, ఆ దుర్బుద్ధి కలవాఁడిని చంపాను. అతడే శంబూకుడు, వెళ్ళాడు స్వర్గానికి.

తే॥గీ॥ బోయ జాతికిఁ జెందిన పొలఁతి శబరి
ముదిమిని తపస్విని యగుట ముదము నిడెను,
స్వీయ ధర్మము వీడగ శిక్ష పడెను
శంబుకుడను శూద్ర మునికి జపము సేయ,
జగతి నది యధర్మంబుగఁ జౌకలించ... ॥ 284 ॥

(బోయ = కిరాతుఁడు, పొలఁతి = స్త్రీ, ముదిమి = ముసలితనము, తపస్విని = తాపసురాలు, ముదము = సంతోషము, ఇడు = ఇచ్చు, స్వీయ = తనకు సంబంధించిన, ధర్మము = విధి, వీడు = వదలు, శిక్ష = దండనము, శూద్ర = నాల్గవ జాతి, జపము = ధ్యానము, జగతి = లోకము, చౌకలించు = వ్యాపించు)

బోయ జాతికి చెందిన స్త్రీయైన శబరి ముసలితనంలో తాపసురాలవడం సంతోషాన్ని ఇచ్చింది. శంబుకుడనే శూద్ర మునికి తన కర్తవ్యము వదిలి ధ్యానము చేయడం వల్ల లోకంలో అది అధర్మంగా వ్యాపించగా దండన పడింది.

అశ్వమేధయాగం:

తే॥గీ॥ సీత వంటిది దొరకు నే సీమ నైన
యనిఁ బలికితి మూర్ఛను నిను ననిఁ గనంగ
నాఁడు, సీతను విడిఁ గూడ నేఁడు యేక
పత్ని నా వ్రత మనుచు నే పాదుకొంటి... ॥ 285 ॥

(సీమ = ప్రదేశము, మూర్ఛ = స్మారకము తప్పడము, అని = యుద్ధము, కను = చూడు, నాఁడు = ఆ రోజు, విడు = వదలు, నేఁడు = ఈ రోజు, ఏకపత్ని = సవతిలేని స్త్రీ, వ్రతము = నియమము, పాదుకొను = స్థిరపడు)

మూర్ఛలో నిన్ను యుద్ధంలో చూడగానే ఆ రోజున సీత వంటిది ఏ ప్రదేశంలోనైనా దొరుకుతుంది అని అన్నాను. ఈ రోజున సీతను వదలి కూడా నాది ఏకపత్నీవ్రతమని నేను స్థిరపడ్డాను.

తే॥గీ॥ అశ్వమేధ యాగముఁ జేయ నాజ్ఞ నిచ్చి
భార్య లేదుఁ గనుక యామె బంగరు ప్రతి
మనుఁ గడనుఁ బెట్టఁ గోరితి, మఖముఁ జూడ
వచ్చిన కవలె నాదు జీవనులని ముద
మందితి, మదిని కుజ కభినందన లిడి... ॥ 286 ॥

(ప్రతిమ = విగ్రహము, కడ = చెంత, మఖము = యజ్ఞము, కవలు = జంటగా పుట్టిన వారు, జీవనుడు = కుమారుడు, ముదము = సంతోషము, మది = మనస్సు, కుజ = సీత, అభినందన = స్వస్తివాచకము, ఇడు = ఇచ్చు)

అశ్వమేధ యాగం చెయ్యడానికి ఆజ్ఞ ఇచ్చి, భార్య లేదు కాబట్టి ఆమె బంగారు విగ్రహం చెంతను పెట్టమని కోరాను. యజ్ఞం చూడడానికి వచ్చిన కవలలే నా కుమారులని మనస్సులో సీతకు అభినందనలు ఇచ్చి సంతోషపడ్డాను.

కం॥ లవకుశులు పుట్టుటయు, నా
కవ కట వాల్మీకి విద్యఁ గఱపు క్రమమునన్
వివరణతో నా కథ నే
నె విని యభిప్రీతి నంద నేర్పుట, ముదమే... ॥ 287 ॥

(కవ = కవలపిల్లలు, అట = అక్కడ, కఱపు = నేర్పు, క్రమము = వరుస, వివరణ = వ్యాఖ్యానము, అభిప్రీతి = సంతోషము, ముదము = సంతోషము)

లవకుశులు పుట్టడం, ఆ కవలలకు అక్కడ వాల్మీకి మునీశ్వరుఁడు విద్య నేర్పే క్రమంలో వ్యాఖ్యానంతో నా కథ నేనే విని ఆనందించేటట్లుగా నేర్పడం, సంతోషమే.

తే॥గీ॥ నాదు కథ ప్రజ లెదుట గానమ్ము సలిపి
సీతపై యపనిందను క్షీణపరచె
లవకుశులు, యామె నడవి యందు విడి బాధ
పడుట కన్న, కాఁబోలు నీ పథమె మేలు,
భావినిఁ గలుగు లోకాపవాదములకు... ॥ 288 ॥

(చలుపు = చేయు, అపనింద = నిష్కారణముగ వచ్చిన నింద, క్షీణపరచు = సన్నగిల్లునట్లు చేయు, విడు = వదలు, కాఁబోలు = ఔనేమో, పథము = మార్గము, మేలు = మంచిది, భావి = భవిష్యత్తు, లోకాపవాదము = లోకనింద)

నా కథ ప్రజల సమక్షంలో గానం చేసి లవకుశులు సీతపై నిష్కారణముగ వచ్చిన నింద సన్నగిల్లునట్లు చేశారు. ఆమెను అడవిలో వదలి బాధ పడడం కన్నా, భవిష్యత్తులో వచ్చే లోకనిందలకు ఈ మార్గమే మంచిది కాబోలు.

మహాప్రస్థానం:

తే॥గీ॥ లంక యందగ్ని యందున దూకె మున్ను,
నా సభను యంద రెదుటను బాసఁ జేసి
తనదు శుద్ధి ఋజువుచేసి ధరణిజ, ధర
లోని కరిగె సింహాసనాసీన యగుచు... ॥ 289 ॥

(మున్ను = పూర్వము, బాస = ప్రతిజ్ఞ, శుద్ధి = పవిత్రత, ఋజువుచేయు = నిరూపించు, ధరణిజ = సీత, ధర = భూమి, అరుగు = పోవు, ఆసీన = కూర్చున్నది)

పూర్వం లంకలో అగ్ని యందు దూకింది. నా సభలో అందరి సమక్షంలో ప్రతిజ్ఞ చేసి తన పవిత్రతను నిరూపించి సీత సింహాసనం మీద కూర్చుని భూమిలోకి వెళ్ళిపోయింది.

తే॥గీ॥ కాలపురుషుఁని సందేశ మాలకించి
నేను నిను వీడ నీవును మేను వీడ

తోడనే మేము సుగ్రీవుఁ గూడి తనువు
విడచితిమి, లక్ష్మణా! శిష్టి కొడుకుల కిడి... ॥ **290** ॥

(కాలపురుషుఁడు = మరణదేవత, సందేశము = వర్తమానము, ఆలకించు = విను, వీడు = వదలు, మేను = శరీరం, కూడు = కలియు, తనువు = శరీరము, శిష్టి = ఏలుబడి, ఇడు = ఇచ్చు)

లక్ష్మణా! కాలపురుషుఁని వర్తమానం విని నేను నిన్ను త్యజించగా, నీవు శరీరం వదిలావు. వెంటనే మేము ఏలుబడి కొడుకులకు ఇచ్చి, సుగ్రీవునితో కలిసి శరీరం వదిలిపెట్టాము.

వందన సమర్పణ:

కం॥ తానున్న కాల మందున
తానొక పాత్రగ జరిగిన ధరణిజ గాథన్
తానే రచించి నెఱపిన
జ్ఞానికి వాల్మీకి మునికి శతకోటి నతుల్... ॥ **291** ॥

(ధరణిజ = సీత, గాథ = చరిత్రము, నెఱపు = వ్యాపింపఁజేయు, జ్ఞాని = జ్ఞానం కలిగినవాడు, శతకోటి = నూరుకోట్లు లేక అనేక, నతి = నమస్కారము)

తాను ఉన్న కాలంలో తాను ఒక పాత్రగా జరిగిన సీత చరిత్రను తానే రచించి వ్యాపింపఁజేసిన జ్ఞానియైన వాల్మీకి మునికి శతకోటి నమస్కారాలు.

– స్వస్తి –

సులభాః పురుషా రాజన్! సతతం ప్రియవాదినః ॥
అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥

ISBN 978-93-343-4723-4
9 789334 347234

Bhandari Arts 'N' Printers, Hyd. Cell: 9963480834